ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 1

ఫిబ్రవరి, 2013

ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**హెచ్. కూర్మారావు**

**డా॥ సి. నాగరాజు**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**

**డా॥ వి. శివ శంకర ప్రసాద్**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**

**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
రాష్ట్రంలో ప్రారంభమయిన నగదు బదిలీ పథకం ..... 3
అడిగిన 15 రోజుల్లోపే ఉపాధి హామీ పనులు కల్పిస్తాం : లేదంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తాం ..... 4
అపార్డులో 64 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ..... 6
అపార్డ్‌ను సందర్శించిన నిఖిల్ డే ..... 7
కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల అమలుకు చర్యలు ..... 8
ఆదర్శనేత దామోదరం సంజీవయ్య ..... 9
ఆహుతులను అలరించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహా సభలు ..... 11
వర్మికంపోస్టు తయారుచేయటం ఎలా? ..... 13
సహకార సంఘాలు - విహంగ వీక్షణం ..... 14
నిర్మల్ భారత్ అభియాన్ పథకంపై పది ప్రశ్నలు ..... 16
ఆంధ్రప్రదేశ్ భూమి సాగు లైసెన్సుదారుల చట్టం 2011 (18/2011) ..... 18
ఆదివాసీల వెలుగు బాట 'మాతోట' ..... 19
సేంద్రీయ వ్యవసాయాన్ని (ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోత్సహించేందుకు అమల్లో ఉన్న పథకాలు ..... 23
ఆగేదెన్నడు మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలు? ..... 25
మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా అపార్డ్ సిబ్బంది ప్రదర్శన ..... 26
ఇందిర జలప్రభ ద్వారా 6 లక్షల పేద, దళిత, గిరిజన కుటుంబాలలో చిరునవ్వుల కళకళ ..... 27
గ్రామీణ యువతకు సోషల్ ఆడిట్‌పై సర్టిఫికెట్ కోర్సు ..... 31
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 32
64వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బి.ఎన్.వి. లపై ప్రశంసల జల్లులు ..... 34
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో అందరికీ ఉపాధి ..... 35
కేవలం 9 నెలల్లో గ్రామ స్వరూపాన్ని మార్చి వేసిన కొటాల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు . 36
ఒక ఆలోచన ఊరినే మార్చింది ..... 37
ఏమి ఆశించి వీరు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అయ్యారు? ..... 38
'ఉపాధి హామీ పథకం'తో వెలుగుబాట ..... 39
మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం డైరీ విడుదల ..... 40
"మార్పు" కు శ్రీకారం - మహిళా సాధికారతకు మరింత ఉపకారం ..... 41
ప్రభుత్వ పథకాల్లో బిఎన్‌విల బహుముఖ పాత్ర ..... 44
బాలికలు, మహిళలపై అత్యాచారాలకు అంతే లేదా? ..... 51
మహిళా సంఘాల్లో పారదర్శకత కోసం సోషల్ ఆడిట్ ..... 55
తెలుగు భాషా తేజాన్ని నలుదిక్కులా చాటిన ప్రపంచ తెలుగు మహాసభలు ..... 57
షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళికల అమలుపై : అపార్డ్‌లో మేధోమథనం ..... 60
పంటల సాగులో ఎరువుల కొరతను, ఖర్చును తగ్గించుకునే విధానాలు ..... 61
పడి లేచిన కెరటం ..... 63

# గ్రామీణాభివృద్ధి కొత్త పుంతలు

వర్థమాన దేశాల్లో గ్రామీణాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఉంటుంది. ప్రత్యేకించి, భారతదేశం వంటి దేశానికి గ్రామీణాభివృద్ధి మరీ అవసరం. ఇటీవలి కాలంలో గ్రామీణ జనాభా తగ్గి, పట్టణ జనాభా బాగా పెరిగినప్పటికీ, భారతదేశంలో ఇప్పటికీ 65 శాతం మంది ప్రజలు గ్రామాల్లోనే నివశిస్తున్నారు. ఈ కారణం వల్లనే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, పలు పథకాలను అమలు చేస్తున్నాయి. వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి.

పేదరిక నిర్మూలన, జీవనోపాధులను మెరుగుపరిచే కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి గ్రామీణాభివృద్ధిలో కీలకాంశాలుగా ఉన్నాయి. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు జరిగే పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మరియు అపార్డ్ గ్రామీణాభివృద్ధిని రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగినవి - మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇందిరా క్రాంతి పథం, ఇందిర జలప్రభ, కీ క్యాప్ - ల్యాబ్ టు ల్యాండ్, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమాలు మొదలైనవి.

ఈ కార్యక్రమాల్లో తలమానికం అనదగిన కార్యక్రమం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఉపాధి కల్పనా కార్యక్రమాల్లో ప్రపంచంలోనే ఇది అతిపెద్ద కార్యక్రమం. ఈ ఏడాది (2012-13) కేంద్రప్రభుత్వం ఈ పథకానికి రూ. 33,000 కోట్లను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ప్రారంభమయిన నాటి నుండి ఇప్పటి వరకూ ఈ పథకంపై రూ. 23,260 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 1.9 కోట్ల మంది లబ్ధిదారులు కనీసం ఒకసారయినా ఈ పథకాన్ని ఉపయోగించుకున్నారు. 2012-13 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంపై రూ. 4113 కోట్లను వ్యయం చేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, ఇది దేశంలో అత్యధిక వ్యయం. అంతేకాక, పని హక్కుకి వాస్తవ రూపం ఇవ్వడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. వివిధ బృందాలు పనికోసం ఇచ్చే దరఖాస్తులను ప్రతి శనివారం ఒక నిర్దిష్ట ప్రదేశంలో స్వీకరించాలని, దరఖాస్తు అందిన 14 రోజుల్లోగా పని కల్పించకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. అంతేకాక, నిరుద్యోగ భృతి నిబంధనలను రూపొందించి జారీ చేసింది. ఇవి 2013, జనవరి 3వ వారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ విధంగా నిరుద్యోగ భృతి నిబంధనలను రూపొందించి, ప్రకటించి, అమలు చేసిన ప్రథమ రాష్ట్రం మనదే.

అదే విధంగా ఇందిరా క్రాంతి పథం కార్యక్రమంతో స్వయం సహాయక బృందాల మహిళలు నూతన అధ్యాయాలను లిఖిస్తున్నారు. మన రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాలు సాధించిన విజయాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిష్ట పొందాయి. మహిళలతోనే ప్రత్యేకంగా ఉన్న 10 లక్షలకు పైగా బృందాలలో ఒక కోటీ 15 లక్షల మంది సభ్యులుగా ఉండటం రాష్ట్రం సాధించిన ఘన విజయమే. కదం తొక్కుతున్న ఈ మహిళా విజయానికి మరింత ఘనతను చేకూర్చేందుకు రాష్ట్రప్రభుత్వం పావలావడ్డీ రుణాలను, ఇటీవల వడ్డీలేని రుణాలను వారికి అందుబాటులోకి తెచ్చింది. వారికి అత్యవసర సమయాల్లో రుణాలు అందుబాటులోకి తెచ్చేందుకు 'స్త్రీ నిథి' సంస్థను నెలకొల్పింది.

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మరో వినూత్న కార్యక్రమమైన ఇందిర జలప్రభ బీడు భూములను ఏ విధంగా పండ్లతోటలుగా మారుస్తోందో. 'స్థానిక పాలన' పత్రిక ఎప్పటికప్పుడు మీ కళ్లముందుంచుతూనే ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో అపార్డ్ అమలు చేస్తున్న కీ క్యాప్ - ల్యాబ్ టు ల్యాండ్, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణ తదితర కార్యక్రమాలు గ్రామాల్లో నిశ్శబ్ద విప్లవాన్ని తెస్తున్నాయి. గ్రామీణాభివృద్ధికి ఒక తపస్సులా, యజ్ఞంలా, సాగుతున్న ఈ కృషిలో పంచాయితీలు, తదితర స్థానిక సంస్థలు ముమ్మరంగా భాగస్వాములు కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కె. చంద్రమౌళి

( కె. చంద్రమౌళి )

# రాష్ట్రంలో ప్రారంభమయిన నగదు బదిలీ పథకం




**కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ప్రత్యక్ష లబ్ధి (నగదు) బదిలీ పథకాన్ని దేశంలో ప్రథమంగా మన రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాలో కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ జైరాం రమేష్ జనవరి 6వ తేదీన ప్రారంభించారు. తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి, పౌరసరఫరాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి. మాణిక్య వరప్రసాద్, స్థానిక పార్లమెంటు సభ్యులు శ్రీ ఉండవల్లి అరుణ్ కుమార్, శ్రీహర్ష కుమార్, పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.**

ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన కేంద్ర మంత్రి జైరాం రమేష్ మైక్రో ఎ.టి.ఎం. ను ఉపయోగించి నీళ్ళ సత్యనారాయణ అనే వ్యక్తికి వికలాంగ పింఛను చెల్లించారు. అదేవిధంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలు పలువురి పేరుమీద ఎలక్ట్రానిక్ పద్ధతితో చెల్లింపులు జరిపారు. ఈ సందర్భంగా శ్రీ జైరాం రమేష్ మాట్లాడుతూ, 2013 సంవత్సరాంతానికి, అన్ని గ్రామపంచాయితీలు, మండలాలు, జిల్లాలను మైక్రో ఎ.టి.ఎం. నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకొని రానున్నట్లు తెలియచేశారు. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 3000 కోట్ల రూపాయలపైబడి వేతనాల రూపంలో ఉపాధిహామీ పథకంలో చెల్లించబడుతున్నట్లు తెలియచేస్తూ, ప్రత్యక్ష లబ్ధిబదిలీ పథకం ద్వారా డబ్బు మొత్తం పారదర్శకంగా లబ్ధిదారులకు చేరుతుందని అన్నారు.


ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ బాట, రూపాయికే కిలో బియ్యం, ఇప్పుడు ఈ నగదు బదిలీ పథకం అన్ని తూర్పు గోదావరి జిల్లానుండి ప్రారంభం కావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ నగదు బదిలీ పథకం వల్ల లబ్ధిదారులకు సకాలంలో చెల్లింపులతో పాటు చివరి పైసావరకూ ఖచ్చితంగా వారి ఖాతాలలోకి చేరుతుందన్నారు.

ఆధార్ కార్డ్ ఆధారంగా ఈ నగదు బదిలీ పథకాన్ని దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని, ప్రతి ఒక్కరూ అధార్ కార్డు పొందాలని సూచించారు. మైక్రో ఎటిఎంల సాయంతో కుగ్రామాలలో సైతం బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొని వచ్చి బ్యాంకింగ్ సేవలలో నాణ్యత పెంపొందిస్తామని తెలియచేశారు. ■

# అడిగిన 15 రోజుల్లోపే ఉపాధి హామీ పనులు కల్పిస్తాం : లేదంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తాం

## గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ డి. మాణిక్యవర ప్రసాద్






**గ్రామీణాభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గూర్చి వివరించడం కోసం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు శ్రీ డి. మాణిక్యవర ప్రసాద్ 09.01.2013 న సచివాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ పత్రికా విలేకరుల గోష్టిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల కాలంలో వివిధ పథకాలలో తీసుకున్న విధాన నిర్ణయాలను, ఆయా పథకాల క్రింద సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించడం జరిగింది.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి శాఖలో అద్భుతంగా అమలవుతున్న కార్యక్రమం ఇందిర జలప్రభ అని తెలిపారు. బీడు భూములకు నీటి పారుదల వసతులు కల్పించి పంట భూమిగా మార్చి సాగులోకి తీసుకొనిరావడమే ఇందిర జలప్రభ ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 8596 బోర్ బావులు, 650 గొట్టపు బావులు, 15 సాధారణ బావుల ద్వారా 9267 వ్యవసాయ క్షేత్రాలలోని భూమికి నీటి పారుదల వసతులు కల్పించినట్లు చెప్పారు. 2623 పంపు సెట్లను విద్యుదీకరించి 1.43 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా 45 వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ పథకం క్రింద 10 లక్షల ఎకరాల భూమిని అభివృద్ధి చేసేందుకు రూ. 1833 కోట్లు ప్రాజెక్టు వ్యయం అంచనాగా నిర్ణయించామని తెలిపారు. దీని ద్వారా ఎస్సీ, ఎస్టీ లకు చెందిన 5.8 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతారని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉపరితల నీటి నిల్వ, బోర్ బావుల రీఛార్జి ద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయని, అందుకై ఇందిర జలప్రభ అభివృద్ధి వల్ల భూమి పంటల విధానంలో కూడా మంచి మార్పులు వచ్చాయని, మెట్ట నేలలో ఉద్యాన వనసాగుతో పాటు మధ్యలో కూరగాయల పెంపకం చేపడుతున్నారని తెలిపారు. దీంతో భూమి విలువ 5 నుంచి 7 రెట్లు పెరిగిందని వివరించారు. గతంతో పోలిస్తే ఎకరాకు రూ. 15 వేల మేరకు రైతులకు ఆదాయం పెరిగిందని కొనియాడారు. రోజుకూలికి వెళ్ళే శ్రామికులు దాదాపు 30 వేల మంది ఇందిర జలప్రభ పథకం ద్వారా రైతులుగా మారారని తెలిపారు. ఇప్పటి వరకూ వృధాగా ఉన్న భూమిని సాగులోకి తేవడం, సాగులో ఉన్న భూమిలో పంటలు అధికం చేయడం, భూగర్భ జలాలు ఉమ్మడి వనరుగా మార్చడమే ఇందిర జలప్రభ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా వివరించారు.

గ్రామీణాభివృద్ధిలో ప్రతిష్టాత్మకంగా గత ఆరేళ్ళు గా అమలువుతున్న పథకం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకమని, గ్రామీణ పేద ప్రజల జీవితాల్లో ఈ పథకం వెలుగు నింపుతోందని తెలిపారు. ఈ పథకం ప్రారంభం నుండి ఇప్పటి వరకూ మన రాష్ట్రంలో రూ. 23,260 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఉపాధి హామీ ద్వారా 1.9 కోట్ల మంది కూలీలకు ఉపాధి హామీ పనుల్లో 100 రోజుల పని లభించిందన్నారు. వారికి మొత్తం 181 కోట్ల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 93 లక్షల కుటుంబాల వారికి రూ. 16962 కోట్ల వేతనాల క్రింద చెల్లించామన్నారు. సగటున రోజుకి





**ఇందిర జలప్రభ ద్వారా అభివృద్ధి చేసిన భూములలో పండిన కూరగాయలను తిలకిస్తున్న రాష్ట్ర మంత్రివర్యులు**

93.61 వేతనంగా చెల్లించామని తెలిపారు. 100 రోజులు పనిపూర్తి చేసుకున్న కూలీలకు మరో 50 అదనపు పనిదినాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. 2012-13 సంవత్సరంలో రూ. 4113 కోట్ల వ్యయం చేసి రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు వచ్చే వేసవిలో సీజనల్ అలవెన్స్ ప్రకటిస్తున్నామని, ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నేలల్లో 30 శాతం, జూన్ 20 శాతం అదనంగా వేతనం చెల్లిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం నుండి ఉపాధి హామీ పథకంలో పని కోసం డిమాండ్ చేసిన కూలీలకు కోరిన 15 రోజుల్లోగా పని కల్పిస్తామని చెప్పారు. అట్టి ఉపాధి కల్పించలేకపోతే వారికి ప్రభుత్వమే వేతనంలో నాలుగోవంతు మొత్తాన్ని నిరుద్యోగభృతిగా కూలీలకు చెల్లిస్తామని వివరించారు. అదే సమయంలో పని కల్పించడంలో విఫలమైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పథకంలో కూలీల్లో స్వావలంబన పెంపొందించేందుకు స్వయం సహాయక సంఘాల తరహాలో శ్రమశక్తి సంఘాల సమాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని, ఈ సంఘాల ద్వారా ఉపాధి కూలీల సమస్యలు, అవసరాలు తీర్చుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇప్పటికి 15 జిల్లాల్లోని 35 మండలాల్లో 220 శ్రమశక్తి సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఏప్రిల్ మాసం నుంచి ఉపాధి కూలీలకు చెల్లించే వేతనం బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని, త్వరలోనే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు హెచ్.ఆర్. పాలసీను అమలు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను మంత్రి విడుదల చేసి క్షేత్ర సహాయకులకు అందజేశారు.

గ్రామీణాభివృద్ధి శాఖలో పలు అభివృద్ధి పథకాలు సక్రమంగా అమలు జరగడానికి శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరికీ వినూత్న పద్ధతులతో మంచి శిక్షణ అందజేసే అపార్డ్ కారణమని తెలిపారు. శిక్షణ అందజేయటంలో తన కంటూ ఒక ప్రత్యేకమైన శైలిని అవలంబిస్తున్న అపార్డ్, దేశ శిక్షణా రంగంలో ఎనలేని సేవలు అందిస్తోందని కొనియాడారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, లింగ సమానత్వం, సహజ వనరుల యాజమాన్యం, పంచాయితీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపుదల కోసం అపార్డ్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. 2007-08 సంవత్సరంలో అపార్డ్ 208 ప్రోగ్రామ్‌లు నిర్వహించి 7542 మందికి శిక్షణ అందించగా, 2012-13 లో 456 ప్రోగ్రామ్‌లలో గాను 15966 మందికి శిక్షణ అందించిందని కొనియాడారు. ముఖ్యంగా ప్రజల్లో సమిష్టితత్వాన్ని పెంపొందించేందుకు రాష్ట్రంలో 691 మండలాల్లో 1852 పంచాయితీల్లో 32606 యువతకు శిక్షణ అందజేసి భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. 20 అక్టోబర్ 2011 నుండి 23 అక్టోబర్ 2012 వరకూ సంవత్సరం పొడువునా 365 రోజులు పాటు నిర్విరామంగా తన శిక్షణా సేవలను అందజేయడం అపార్డ్ ఘనత అని కొనియాడారు. ఈ సందర్భంగా అపార్డ్ ఎన్నోరకాలైన అవార్డులును దక్కించుకుందని వివరించారు.



ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రమణ్యం, ఐ.ఏ.ఎస్, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్, గ్రామీణాభివృద్ధి కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్, ఐ.ఏ.ఎస్, ఉపాధిహామీ పథకం డైరెక్టర్ శ్రీమతి కరుణ, ఐ.ఏ.ఎస్, గ్రామీణాభివృద్ధి స్పెషల్ కమీషనర్ శ్రీ విద్యాసాగర్, ఐ.ఎఫ్.ఎస్, సోషల్ ఆడిట్ డైరెక్టర్ కుమారి సౌమ్య, స్మార్టు కార్డు ప్రాజెక్టు అడిషనల్ కమీషనర్ శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అపార్డులో 64 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**64 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అపార్డులో ఘనంగా జరుపుకున్నారు. మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ, ఎందరో మహానుబావులు చూపిన చొరవ వల్ల, త్యజించిన సుఖాల వల్ల, వారు కోల్పోయిన సౌకర్యాల వల్ల ఈ రోజు భారతయులందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. ఏ స్వేచ్ఛా వాయువులతో మనం జీవిస్తున్నామో, ఏ స్వాతంత్రాన్ని మనం అనుభవిస్తున్నామో అటువంటి స్వేచ్ఛా వాతావరణాన్ని కలుషితం చేయడానికి, సమస్యలు సృష్టించడానికి, ప్రశాంత వాతావరణంలో బురద జల్లడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తుంటారని తెలిపారు. అటువంటి వ్యక్తులను అడ్డుకుని, ప్రతి పౌరుడు వారికి బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు.**

ఈ దేశ భవిష్యత్ యువతపై ఆధారపడిందని, యువతీ యువకులు ఆలోచనలు, విధానాలను ఒక ఇంధనంగా ఈ దేశం వాడుకుని ఈ దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని ఆయన అన్నారు. ఈ దేశంలో ఎన్నడూలేని విధంగా అవినీతి పెరిగిపోయిందని, దానిని బాధ్యత ప్రయత్నం ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని ఆయన సూచించారు.

గ్రామాల్లో అపార్డు తయారు చేసిన 33600 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వారి వారి గ్రామాల్లో అవినీతిని అడ్డుకోవడంలోనూ, గ్రామాన్ని అభివృద్ధి పథం వైపు ముందుకు తీసుకుపోవడంలోను చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన తెలిపారు. అదే విధంగా సంస్థలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒక్కో భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా పనిచేసి సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. ఈ గణతంత్ర దినోత్సవం ప్రతి పౌరుడిలో ఉత్తేజాన్ని నింపాలని కోరుకుంటున్నానని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డా॥ సి. నాగారాజు, సెంటర్ హెడ్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కాంట్రాక్ట్ సిబ్బంది మరియు ఎ.వి.ఎం. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ■

అనంతపూర్ సమగ్ర అభివృద్ధికి అపార్డ్, ఐ.సి.ఏ.ఆర్ మరియు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రాజెక్ట్ అనంత రిపోర్ట్‌ను ఐ.సి.ఏ.ఆర్ డైరెక్టరు జనరల్ శ్రీ డా. అయ్యప్పన్‌కు, రాష్ట్ర మంత్రి శ్రీ ఎన్. రఘువీరారెడ్డి ది. 21.1.2013న న్యూఢిల్లీలో అందచేసారు. రాష్ట్ర మంత్రి శ్రీ శైలజానాథ్, పార్లమెంటు సభ్యులు శ్రీ అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్ శాసన సభ్యులు శ్రీ మధు సూదన్ గుప్తా, మడకసిర ఎం.ఎల్.ఏ కె.సుధాకర్ కూడా ఈ బృందంలో ఉన్నారు. మంత్రి వెంట అపార్డ్ సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ శ్రీ హెచ్. కూర్మారావు, శ్రీ రత్నాచార్యులు ఉన్నారు. సమావేశం అనంతరం ప్లానింగ్ కమీషన్ మెంబరు ప్రొ॥ అభిజిత్‌సేన్‌ను, సామాజిక శాస్త్రవేత్త జయతీఘోష్‌తోను రాష్ట్ర మంత్రి ఈ విషయమై చర్చలు జరిపారు.



# అపార్డ్‌ను సందర్శించిన నిఖిల్ డే



**ప్రముఖ సామాజికవేత్త శ్రీ నిఖిల్ డే ది. 24.1.2013 న అపార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అపార్డ్‌లో సోషల్ ఆడిట్‌పై గ్రామీణ యువతకు నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సును గురించి అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళిని అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో శ్రీ నిఖిల్ డే మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి సమాచారం పొందటం ప్రతి ఒక్కరి హక్కని, సామాన్య ప్రజలకు సత్వర న్యాయం చేకూరేలా, ప్రజలలో సాధికారత పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టాన్ని రూపొందించటం జరిగిందని అన్నారు.**

గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించటానికి, పనిని హక్కుగా చేస్తూ చేయబడిన ఉపాధి హామీ చట్టం ప్రకారం 'సామాజిక తనిఖీ' ప్రక్రియ తప్పని సరి అనీ, సామాజిక తనిఖీ వల్ల పథకం అమలులో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం పెంపొందుతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ డే అపార్డులోని వివిధ శిక్షణా సదుపాయాలను సందర్శించారు. దేశంలో అత్యుత్తమ వసతి సౌకర్యాలున్న శిక్షణా సంస్థ అపార్డ్ అని ఆయన కితాబిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ఆర్. సుబ్రమణ్యం, ఐ.ఎ.ఎస్., సోషల్ ఆడిట్ డైరక్టర్ కుమారి సౌమ్య, అపార్డ్ జాయింట్ డైరక్టర్ డా. సి. నాగరాజు, సెంటర్ హెడ్‌లు హెచ్ కూర్మారావు, శ్రీమతి ఉషారాణి, డా. వి. శివశంకరప్రసాద్, డా. ఆంజనేయులు, ప్రొ. సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల అమలుకు చర్యలు



**కోనేరు రంగారావు కమిటీ సిపార్సుల అమలుపై 31.12.2012 అపార్డ్‌లో రెవెన్యూ శాఖ ఒక మేధోమధనం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి రెవెన్యూ మంత్రి శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి, భూపరిపాలన అప్పటి ప్రధాన కమీషనర్ శ్రీ శ్యామ్యూల్, అప్పటి రెవెన్యూ ముఖ్యకార్యదర్శి శ్రీ ఎసి. పునేఠా, జి.ఓ., ఎన్.జి.ఓ. ఎగ్జిక్యూటి వైస్ చైర్మన్, శ్రీ గోపాల రావు (ఐ.ఎ.ఎస్. రిటైర్డ్) పాల్గొన్నారు.**

ఈ సందర్భంగా మంత్రి శ్రీ రఘువీరా రెడ్డి మాట్లాడుతూ, కోనేరు రంగారావు కమిటీ 104 సిపార్సులను చేయగా, అందులో 90 సిఫార్సులును మంత్రి మండలి ఆమోదించిందని తెలిపారు. ఈ సిపార్సులపై జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్.డి.వో, తహసీల్దార్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించామన్నారు. ఈ సిపార్సుల అమలుకై నిరంతర పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి, తర్వాత మండల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందులో ప్రజాసంఘాలు ప్రజా ప్రతినిధులు కూడా భాగస్వాములవుతారని మంత్రి చెప్పారు.

ప్రభుత్వ భూములకు సంబంధించి ఇప్పటికే ఒక సమగ్ర జాబితా తయారు చేశామని, వీటిని పారదర్శకంగా ఉండే విధంగా ప్రజలందరికీ తెలిసేలా బహిరంగ పర్చడంతో పాటు పబ్లిక్ డొమైన్‌లో పొందుపరుస్తామన్నారు. రాష్ట్రంలో భూమికి సంబంధించి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా ఈ కమిటీ పని చేస్తుందన్నారు. గత 9 సంవత్సరాల్లో 8 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశామన్నారు. అదే విధంగా 1997 అసైన్డ్‌మెంట్ బదలాయింపు నిషేధ చట్టం సమర్ధవంతంగా అమలు చేయడం పట్ల శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డుల జారీ విషయంలో అందరి సహకారం అవసరమని, ఇప్పటివరకూ 7 లక్షల 91 వేల మందికి రుణ అర్హత కార్డుల ఇచ్చామన్నారు. అందులో 3 లక్షల మందికి 6 కోట్ల రూపాయల మేరకు రుణాలు ఇచ్చామన్నారు. పేదవాడికి రక్షణ, ఆహార భద్రత అనే విషయాలలో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడాన్ని ఒక సామాజిక బాధ్యతగా ఈ ప్రభుత్వం తీసుకుందన్నారు. భూసంస్కరణలు సక్రమంగా అమలయ్యేందుకు రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. అదే విధంగా రెవెన్యూ ఉద్యోగులకు కూడా నిరంతర శిక్షణ అందచేయాలనే ప్రయత్నంలో భాగంగా ముసాయిదా తయారు చేస్తున్నామని, అందులో భాగంగా రెవిన్యూ అకాడమీ ఏర్పాటు యోచనలో కూడా ప్రభుత్వం ఉందని మంత్రి తెలియజేశారు.



ఈ సమావేశానికి రెవిన్యూ, ఫారెస్ట్, గిరిజన సంక్షేమం, వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో పాటు అన్ని జిల్లాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనేత దామోదరం సంజీవయ్య

**నిరాడంబరుడు, నిస్వార్థ జీవి అంచెలంచెలుగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా మాత్రమే కాదు, భారత్ దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర కెక్కిన ధన్య జీవి దామోదరం సంజీవయ్య. 1921 ఫిబ్రవరి 14వ తేదిన కర్నూలు జిల్లా లోని పేదపాడు అనే గ్రామంలో మునెయ్య, సుంకులమ్మ దంపతు లకు పుత్రుడై జన్మించాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చిన్నతనంలో పశువులు కాసిన సంజీవయ్య తన అన్నయ్యల సహకారంతో పాఠశాలలో చేరి విద్యావంతుడు అయ్యారు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయినా ఆత్మస్థైర్యం వదలక చదువులో ఎప్పుడూ మొదటి వాడిగా వుండేవాడు. బాల్య దశ నుంచి భారత్ స్వాతంత్ర సంగ్రామంలో పాలుపంచుకున్నారు.**



కర్నూలు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి మద్రాస్ న్యాయ కళాశాలలో న్యాయవిద్యను పూర్తి చేసారు. కొంతకాలం న్యాయవాదిగా పనిచేసి, 1950 నుండి రాజకీయాల్లో ప్రవేశించారు. 1950-52 లో తొలి సారిగా లోక్‌సభ సభ్యునిగా పనిచేసారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా పనిచేసారు. టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డిలు ముఖ్యమంత్రులుగా పనిచేసిన సమయంలో వారి కేబినెట్‌లలో మంత్రిగా పని చేసారు. రాష్ట్రరాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి స్థానంలో ముఖ్యమంత్రిగా వచ్చారు.

రెండు పర్యాయాలు అఖిల భారత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన మహనీయుడు దామోదరం. నలుగురు ప్రధానుల వద్ద కేబినెట్ మంత్రిగా పనిచేసారు. కార్మిక ఉపాధి శాఖా మంత్రిగా పరిశ్రమల శాఖా, మంత్రిగా పనిచేసి ఆయా శాఖలకు వన్నె చేకూర్చారు. డా. బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల తరువాత ఎంతో పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్న దళితనాయకుడు ఆయన.


చిన్నతనం నుండి తనకంటూ ఒక ప్రత్యేకత నిలుపుతూ ముందుకు పోవడం సంజీవయ్యకి అలవాటు. 1938లో కర్నూలులో ఎస్.ఎస్.ఎల్.సి పూర్తి చేసిన అయన వార్షిక పరీక్షల్లో ఆ రోజుల్లోనే కర్నూలు జిల్లాకు ప్రథముడిగా ఉత్తీర్ణత సాధించారు.

1942లో బి.ఎ. పూర్తి చేసిన సంజీవయ్య కర్నూలు రేషనింగ్ ఆఫీస్ గుమస్తాగా, తర్వాత మద్రాసు కేంద్ర ప్రజా పన్నుల శాఖలో తనిఖీ అధికారిగాను చిరు ఉద్యోగాలు చేసి, పిదప మద్రాసులో న్యాయశాస్త్రం చదివారు. ప్రముఖ రచయిత రావిశాస్త్రి ఈయన సహాధ్యాయి. ఆ రోజుల్లోనే నాటక రంగం మీద ఆసక్తితో చంద్రగుప్త, శివాజీ నాటకాల్లో నటించారు. న్యాయవాదిగా పనిచేస్తుండగా, రాజకీయ నాయకులతో ఏర్పడ్డ పరిచయాల ప్రభావంతో రాజకీయ రంగం మీద ఆసక్తి పెంచుకుని ఆ రంగంలో ప్రవేశించారు.

రాజకీయ రంగంలో ప్రవేశించిన సంజీవయ్య తన కార్యదీక్ష, సేవాభావంతో అనేక ఉన్నత పదవులు చేట్టారు. రాజాజీ మంత్రి వర్గంలో మద్రాసు రాష్ట్ర మున్సిపల్ సహకార శాఖ మంత్రిగా (1952-1923), ప్రకాశం మంత్రి వర్గంలో ఆరోగ్య, హరిజనోద్ధరణ, పునరావాస శాఖ మంత్రిగా (1953-1954), బెజవాడ గోపాల రెడ్డి మంత్రి వర్గంలో రవాణా, వాణిజ్యపన్నుల శాఖ మంత్రిగా (1955-1956), నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, స్థానిక స్వయం పరిపాలన మంత్రిగా (1956-1960) పనిచేసారు.

38 సంవత్సరాల చిన్న వయసులోనే 1960 జనవరి 10న ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన అదృష్టశాలి శ్రీ సంజీవయ్య. 1962 మార్చి 12 వరకూ ఆయన ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. 1962లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 175 సీట్లు సాధించింది. ఆయన మంత్రి వర్గంలో కొండా వెంకటరంగారెడ్డి, కాసు బ్రహ్మానంద రెడ్డి, ఎ.సి. సుబ్బారెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు,

కొండాలక్ష్మణ్ బాపూజీ, కల్లూరి చంద్రమౌళి తదితర ఉద్దండులు పనిచేసారు.



1962లో అఖిలభారత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు సంజీవయ్య. 1964 జూన్ 9 నుండి 1966 జనవరి 23 వరకూ కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రిగా పని చేశారు.

మన రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని, సహకార రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేసారు. శ్రీ సంజీవయ్య రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో జలవనరులను అభివృద్ధి చేయాలని గుర్తించి ఎన్నో ప్రాజెక్టులను ప్రతిపాదించారు. నాగర్జున సాగర్ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించడానికి అయన ఎంతగానో కృషి చేసారు. సాగర్ కుడికాలువ నుండి నల్గొండ జిల్లాకు నీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో పోచంపాడు ప్రాజెక్టు, శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార, నెల్లూరు జిల్లాలో ఖానాపూర్ కెనాల్ ప్రాజెక్టు, కావలి కాలువ ప్రాజెక్టులకు నాంది పలికారు. అంతేకాక, తెలంగాణా అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేసారు.

తుంగభద్ర డ్యామ్ పూర్తి చేయడానికి నిధులు సమకూర్చారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా కూడా ఎంతగానో అభివృద్ధి చేసారు. తక్కువ వడ్డీలకు పరిశ్రమలకు రుణాలు ఇవ్వడం, తక్కువ ధరలకు భూములు కేటాయించడం, విద్యుత్ సబ్సిడీలు ఇవ్వటం ఆయన హయాంలోనే ప్రారంభించారు. అంతేకాక, 1916 నుంచి 1955 వరకూ బి.సిలుగా వుండి తర్వాత ఓ.సి లుగా మార్చబడ్డ కాపులను తిరిగి బి.సి. లుగా మార్చడానికి ఎంతో కృషి చేసి, 1962లో దగ్గరుండిమరీ ఉత్తర్వులు ఇప్పించారు. ఇలా రాష్ట్ర కాపు సామాజిక వర్గానికి అయన ఎంతో సహకరించారు. నా వర్గం, నావాళ్లు అనే కుంచితబావం గాక అందరూ నావాళ్లు అనే విశాలభావంగల అసలైన రాజకీయనాయకుడు ఆయన.

రాజధాని హైదరాబాదు నగరంలో ఐడిపిఎల్, బిహెచ్ఇఎల్, ఆల్విన్ హెచ్ఎంటి గూడూరు వద్ద పోర్సిలిన్ గ్లాస్ ఫ్యాక్టరీ, కాగితం, చక్కర పరిశ్రమల అభివృద్ధికి కృషి చేసారు. బడుగు, బలహీన వర్గలకు ఆయన చేసిన సేవలు అభినందనీయం. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించిన ఘనత సంజీవయ్యకే దక్కుతుంది.

చిన్నతనం నుండి స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రలు చదివి బాగా ప్రభావితులయ్యారు సంజీవయ్య. అంతేగాక, సంజీవయ్యకు తెలుగు సాహిత్యం పట్లకూడా అపారమైన పట్టువుంది. మంచి గాయకులు కూడా!

నెహ్రూ హయాంలో 1964లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, 1966లో ఇందిరాగాంధీ వద్ద పరిశ్రమల శాఖ మంత్రిగా 1970 ఫిబ్రవరిలో రెండవ సారి కార్మిక శాఖమంత్రిగా పని చేసారు. 1971లో రెండవ సారి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. 1972లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఎంతో కృషి చేసి ఇందిరా గాంధీకి అండగా నిలిచారు.

సంజీవయ్య భార్య కృష్ణవేణి కూడా రాజకీయాల్లో ఆయనకు సాటిగా పనిచేసి మంత్రిగా కూడా సేవలందించారు. ఇలా తన యావత్ జీవితాన్ని ప్రజాసేవకే వినియోగించిన కార్యశీలి, రాజకీయ చరితార్థుడు అయిన దామోదరం సంజీవయ్య 1972 మే 7వ తేదీన ఢిల్లీలో గుండెపోటుతో మరణించారు. దళితుల అభ్యున్నతే గాక, అందరి అభివృద్ధిని ఆశించిన ఆదర్శమూర్తి సంజీవయ్య జీవితం అందరకీ ఆదర్శంగా నిలుస్తుంది.

**- అమ్మిన శ్రీనివాసరాజు**

**రెండు రోజుల కోలాహలం, చరిత్ర పరిశోధకుల సమ్మేళనం. మేధావుల ప్రసంగాలు, జాతి నిర్దేశకుల వందలాది చిత్రాలకు వేదిక. అపురూప చిత్రాల ప్రదర్శన, పరిశోధకులు త్రవ్వితీసిన చరిత్రాంశాల నివేదికల సమర్పణ. గత చరిత్రపు ఆనవాళ్ళను భావితరాల కోసం భద్రపరచేందుకు జరిగిన కార్యక్రమం. అదే 37 వ ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహా సభలు.**







జనవరి 5, 6 తేదీల్లో కృష్ణాజిల్లా - అవని గడ్డలో 37 వ ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహా సభలు కోలాహలంగా జరిగాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలనం కావించి, ప్రసంగించారు. తెలుగు జాతి వైభవాన్ని దశదిశలా చాటేలా ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించిన మనం; తెలుగు జాతి చరిత్రను కాపాడుకోవటానికి, అది ముందు తరాల వారికి భద్రపరచటానికి పరిష్టమైన చర్యలు తీసుకోవలసి వుందని, అపుడే గత కాలపు తెలుగు జాతి అత్యున్నత చరిత్ర భవిష్యత్తరాలకు అవగతమౌతుందన్నారు. స్వచ్ఛమైన చరిత్రను భావితరాలకు అందించినపుడు మాత్రమే వాస్తవ

# ఆహూతులను అలరించిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహా సభలు

కోణాలు వెలుగులోకి వచ్చి, గత కాలపు ఔన్నత్యాలు భవిష్యత్తుకు మార్గదర్శకాలవుతా యన్నారు. కొందరు అవగాహనా రాహిత్యంతో చారిత్రిక కట్టడాలను కూల్చివేయటం బాధాకరంగా వుందని, దివి సీమలోని ఒక చారిత్రక కట్టడాన్ని పడగొట్టి, దేవాదాయ శాఖ దాని స్థానే కొత్తది కట్టటానికి ప్రయత్నించటం అవగాహనా రాహిత్యమే కాదు. చరిత్ర ఔన్నత్యాన్ని కించ పరచటమని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రకు సంబంధించిన రికార్డులను 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమంలో కొందరు అధికారులు అగ్నికి అహుతి చేయటం జాతి చరిత్రకు ద్రోహం చేయటమేనన్నారు. చరిత్ర ప్రాధాన్యతలు తెలియనివారిని ఉన్నత పదవుల్లో కూర్చో బెట్టటం వల్లనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని, చరిత్ర భావితరాలకు అందకుండా పోతుందని, చరిత్రకారులకు సరైన గుర్తింపు నివ్వకపోవటం వల్లనే ఇలాంటి దురదృష్టకర పరిస్థితులు ఉత్పన్నమౌ తున్నాయని జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయ పడ్డారు. శ్రీకృష్ణదేవరాయలు దివి సీమకు వచ్చి

శ్రీకాకుళంలో తిష్టవేసి అముక్త మాల్యద అనే అపురూప గ్రంధాన్ని రచించారని, ఆ కారణంగా రాయలను తెలుగు వారంతా స్మరిస్తున్నారని, కర్ణాటక వాసులు కూడా అదేవిధంగా వ్యవహరిస్తూ రాయలు తమ వారంటూ పోటీకి వస్తున్నారని, అంత మాత్రాన చరిత్రాంశాలు మరుగునపడి పోవని చలమేశ్వర్ అన్నారు.




మొదటి రోజు సమావేశానికి తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షత వహించారు. అపురూపమైన అనేక విషయాలు తెరమరుగవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగువాడని, ప్రత్యేకించి దివి సీమవాసి అన్న విషయం నేటి విద్యార్ధులకు తెలియక పోవటం అందుకు నిదర్శనమన్నారు. గత కాలపు చరిత్రను భద్రపరచటం కోసం ఒకరిద్దరు ప్రయత్నించటం వల్ల సాధ్యం కాదని, ప్రభుత్వాలు కూడా ఇందుకు బాధ్యత వహించాలని బుద్ధ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మన తెలుగు వాడు అనే విషయం కూడా తెలియని వారు చాలా మంది ఉన్నారని, అలాంటపుడు చరిత్ర కనుమరుగు కాక, గతి తప్పక ఏం చేస్తుందన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్రను భావితరాలకు అందించాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్రవిద్యాశాఖ మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌ను ఏర్పటు చేశారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 36 ఏళ్ళ పాటు పలువురు, పలు రకాలుగా పరిశోధనలు సాగించి, ఎనిమిది సంపుటాలు సిద్ధం చేసారని, నేటితరం చరిత్ర పరిశోధకులు, పరిశోధనలను నిరంతరం కొనసాగించటమొక్కటే, భావితరాలకు చరిత్రంశాలను అందించటానికి మార్గమన్నారు.

తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పే అతి పురాతన గ్రంధాలు ఇప్పటికీ 'లండన్' గ్రంధాలయాల్లో భద్రంగా ఉన్నాయని, వాటి ప్రతులను ఇక్కడకు రప్పించి, భద్రపరచటం ద్వారా గత చరిత్రను భావితరాలకు అందించటానికి వీలు కలుగుతుందని రాజ్యసభ మాజీ సభ్యులు డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభిప్రాయపడ్డారు. అవగాహనా రాహిత్యంతో కొందరు చేస్తున్న వ్యాఖ్యలు చరిత్రను కలుషితం చేస్తున్నాయంటూ కొన్నింటిని ఉదహరించారు. పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం గురించి కొందరు అసంబద్ధమైన విషయాలను జోడించి వ్యాఖ్యానించటం అందుకు నిదర్శనమన్నారు. తమను తాము సమర్ధించుకోవటానికి ఆ యుద్ధాలకు ప్రధాన కారణం కోడి పందెములని వ్యాఖ్యానించటం సరికాదని, ఆ యుద్ధాలకు వెనక అనేక అంశాలు వున్నాయని, చరిత్రపై అవగాహన లోపించిన వారు ఇలాంటి వ్యాఖ్యలు చేయటం వల్ల చరిత్రాంశాలు మరుగున పడి, ఇలాంటి అవగాహన లోపించిన విషయాలు చరిత్రగా మారే ప్రమాదం వుందన్నారు. నిజమైన చరిత్రకారులు తెరమరుగవుతూ, అవాస్తవాలు వల్లించే నకిలీ చరిత్రకారులు వెలుగులోకి వస్తున్నారని లక్ష్మీప్రసాద్ అవేదన వ్యక్తం చేస్తూ; చరిత్రకారులు, రచయితలు ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 36వ చరిత్ర సభ సావనీరును, చరిత్ర మాండలిని, లక్ష్మీనారాయణ స్వామి చరిత్రను, కాకతీయ ప్రాభవం తెలిపే గ్రంధాలను ఈ వేదికపై ఆవిష్కరించారు.

### ఆహుతులను అలరించిన ప్రదర్శనలు

తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు వాడ్రేవు సుందర రావు ఏర్పాటు చేసిన దేశ నాయకుల చిత్ర పటాలు ఈ ప్రదర్శనకు హైలెట్. స్వాతంత్ర్య సాధనకు త్యాగాలు చేసిన సుమారు 400 యోధుల రంగుల చిత్రాలను ఇక్క ప్రదర్శించారు. రేగుళ్ళ మల్లికార్జునరావు పొందుపరచిన అమరావతీ శిల్పకళకు సంబంధించిన 18 చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దుట్టా ఉమా మహేశ్వరరావు పురాతన నాణాలను, కరెన్సీ నోట్లను ప్రదర్శనకు ఉంచారు. సింహాద్రి కృష్ణప్రసాద్ దివి సీమలోని దేవాలయాలతో పాటు, వాటిలోని దేవుళ్ళ ఫోటోల ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాల అంశాలతో కూడిన అప్పటి హిందూ, ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, హిందుస్థాన్ టైమ్స్, టైమ్స్ అఫ్ ఇండియా పాత ప్రతులను కూడా ప్రదర్శించారు.

ప్రాచీన, మాధ్యమిక, ఆధునిక చరిత్ర అంశాలను చర్చించేందుకు వేరు వేరు గదులు ఏర్పాటు చేశారు. పలువురు మేధావులు, చరిత్ర కారులు ఈ సభల్లో ప్రసంగించారు. 150 పరిశోధనా వ్యాసాలను సమర్పించారు. పాఠశాల విద్యార్ధులను, సాహితీ వేత్తలను, కళాకారులను, కళాభిమానులను ఈ ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి, ఆనందాన్ని కలిగించాయి.

**- దాసరి ఆళ్వారుస్వామి**



# వర్మికంపోస్టు తయారుచేయటం ఎలా?



**ప్రత్యేకమైన వానపాముల్ని సేంద్రియ వ్యర్థ పదార్థాల మీద ప్రయోగించి తయారు చేయబడిన కంపోస్టు ఎరువునే వర్మి కంపోస్టు అంటారు.**

పశువుల ఎరువులలో సరాసరి నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలు వరుసగా 0.75,0.17 మరియు 0.55 శాతం ఉండగా, వర్మి కంపోస్టులో అవి 1.60, 5.04 మరియు 0.80 శాతం ఉన్నాయి. ఇదే విధంగా వర్మికంపోస్టులో సూక్ష్మ పోషకాలు పశువుల ఎరువు కన్నా దాదాపు 50 శాతం అధికం. వర్మికంపోస్టులో పైరు పెరుగుదలకు దోహదపడే ఎన్నో ఇతర సేంద్రియ రసాయనాలు ఉన్నాయని పరిశోధనలో గమనించబడింది.

### వర్మికంపోస్టు తయారు చేయటానికి అవసరమైనవి

**వానపాములు:** బొరియలు చేయని వానపాముల రకాలు సేంద్రియ వ్యర్థ పదార్థాల నుండి కంపోస్టు చేయడానికి పనికి వస్తాయి. అవి 1. యూడ్రిస్ యూగినే, 2. అయిసీనిడా ఫోటిడా, 3. పెరియానిక్స్ ఎక్స్‌క్రీటస్, 4. లుంబ్రికస్ రూబెల్లస్

**సేంద్రియ శేషవ్యర్థ పదార్థాలు:** వ్యవసాయ ఉత్పత్తుల శేష వ్యర్థ పదార్థాలు, ముఖ్యంగా చెత్త, ఆకులు, పేడ, పండ్ల తొక్కలు, కూరగాయల వ్యర్థ పదార్థాలు వర్మి కంపోస్టు తయారీకి ఉపయోగ పడతాయి.

### వర్మికంపోస్టు బెడ్‌ల తయారీ

భూమికి సమాంతరంగా 3 అడుగుల వెడల్పు, 1 అడుగు ఎత్తు ఉండేటట్లు, వీలైనంత పొడవునా ఈ వర్మి కంపోస్టు బెడ్‌లను ఏర్పాటు చేసుకొనవచ్చును. ఈ బెడ్‌ల అడుగుభాగం గట్టిగా ఉంటే మంచిది. ఇలా ఏర్పాటు చేసుకున్న బెడ్‌లపై సుమారుగా 15 సెం.మీ ఎత్తు వరకు కుళ్ళుతున్న వ్యర్థ పదార్థాలను (చెత్త, ఆకులు, పేడ) వెయ్యాలి. ఈ వ్యర్థ పదార్థాలపైన 5 నుండి 10 సెం.మీ. మందం వరకు పేడను వెయ్యాలి. వ్యర్థ పదార్థాలు, పేడను వేసేటప్పుడు బెడ్‌పైన నీరు చల్లాలి. ఇలా ఒక వారం వరకు నీరు ఆడపాదడపా చల్లుతుండాలి.

వారం అయిన తరువాత పైన సూచించిన వానపాములను చదరపు మీటరుకు 1000 వానపాములు చొప్పున వదలాలి. వానపాములు వదిలేటప్పుడు బెడ్‌ను కదిపి, వదలాలి.

ఈ వానపాములు ఆహారాన్ని, తేమను వెదుక్కుంటూ లోపలికి వెళతాయి. ఇవి ప్రతిరోజూ తమ బరువుకు తగ్గ ఆహారాన్ని తీసుకుంటాయి. బెడ్‌పైన పాత గోనెసంచులు గాని, వరిగడ్డిని గాని పర్చాలి. ఇలా చెయ్యటం వలన తేమను కాపాడటమే కాక, వానపాము లకు కప్పలు, పక్షులు,చీమల నుండి రక్షణ కల్పించవచ్చును. వానపాములను వదిలిన బెడ్‌లపై ప్రతిరోజు పలుచగా నీరు చల్లుతూ ఉండాలి. వ్యర్థ పదార్థాలను 2 నుండి 3 నెలల్లో వర్మి కంపోస్టుగా తయారుచేసే వీలుంది.

బెడ్ నుండి వర్మికంపోస్టును తీయటానికి 4,5 రోజుల ముందు నీరు చల్లరాదు. ఇలా చెయ్యడం వలన వానపాములు తేమను వెదుకుతూ లోపలికి వెళ్ళి అడుగు భాగానికి చేరుతాయి. తరువాత ఎరువును శంఖాకారంగా చిన్న చిన్న కుప్పలుగా చెయ్యాలి. వానపాములు లేని ఎరువును 2-3 మి.మీ. జల్లెడతో జల్లించి సంచులలో నింపి నీడగల ప్రదేశాలలో నిల్వ ఉంచుకోవాలి.

ఎరువును తొలగించిన బెడ్‌లపైన వ్యర్థ పదార్థాలను పరచి మరల పైన చేసిన విధంగా కంపోస్టును తయారు చేసుకొనవచ్చును. ఇలా సంవత్సరానికి 5 నుండి 6 సార్లు వర్మి కంపోస్టు తయారు చేయవచ్చును.

వర్మి కంపోస్టును రైతులు హెక్టారుకు 2 నుండి 3 టన్నుల వరకు వివిధ పంటలకు వాడవచ్చును. పండ్లతోటలలో ప్రతి చెట్టుకు 5 నుండి 10 కిలోల వరకు ఈ ఎరువును వెయ్యటం వలన మంచి ఫలితాలు సాధించవచ్చును.

**- బి. లావణ్య, పి. మధు వెంకట కృష్ణ,**
**సి.ఎన్.ఆర్.యమ్., అపార్డ్**

# సహకార సంఘాలు – విహంగ వీక్షణం

**ఐచ్ఛికంగా, మానవతా విలువల ఆధారంగా సర్వమానవ సౌభ్రాతృత్వ ప్రాతిపదిక మీద స్వ, పర ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం వ్యక్తులు ఏ సంస్థలో చేరతారో అదే సహకార సంస్థ. ఎక్కడైతే అందరి కోసం ఒకరు, ఒకరి కోసం అందరూ అని భావిస్తారో, ఎక్కడైతే అందరి ధ్యేయం ఒక్కటి అవుతుందో అందరి మాట ఒక్కటి, అందరి బాట ఒక్కటి అవుతుందో అటువంటి చోటే సహకారం వర్ధిల్లుతుంది.**

సహకారం మానవ మనుగడలో ఒక భాగం అని చెప్పవచ్చు. మానవుడు సంఘజీవి. అంటే తాను పొరుగు వారికి ఇతోధిక సహాయం చేస్తూ, వారి నుంచి సహాయ సహకారాలు పొందుతూ తన జీవనాన్ని అనాది కాలం నుంచి సాగిస్తున్నాడు. ఇదే సహకారం అంటే. అలాగే ఒక సహకార సంఘంలో సభ్యులుగా చేరిన వారు పరస్పర ఆర్థిక సహకారం చేసుకుంటూ ఆర్థికంగా, సామాజికంగా, సాంఘికంగా సమాజంలో నిలదొక్కుతుంటారు.

భారతదేశం వ్యవసాయక దేశం. అధిక సంఖ్యాక దేశ ప్రజలు వ్యవసాయం పైన ఆధారపడివున్నారు. అనగా సుమారు 70 శాతం మంది ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయమే. భారతదేశ వ్యవసాయం అధిక శాతం రుతుపవనాల పైన ఆధారపడి వుంటే వ్యవసాయం జూదం వంటిదని కొందరి భావన.



రైతన్నలకు కావలసినది పరపతి. ఈ పరపతి వారికి రెండు విధాలుగా లభిస్తుంది. ఒకటి ప్రభుత్వం నుంచి పొందే సహాయం. రెండవది వడ్డీ వ్యాపారుల నుంచి పొందే రుణం. వడ్డీ వ్యాపారుల నుంచి పొందిన పరపతికి వారు అధిక వడ్డీలు వేసి రైతన్నల కష్టార్జితాన్ని పీల్చి పిప్పి చేస్తారు. వ్యవసాయం కునారిల్లి పోవడానికి కారణం వీరే. ప్రభుత్వం రైతన్నలకు పరపతి సహాయం కోసం ఆలోచించి ప్రణాళికా బద్ధమైన పరపతిని కల్పిస్తున్నది. అదే సహకార రంగం ఆవిర్భావానికి నాంది అని చెప్పవచ్చు.

మొట్టమొదటి సహకార చట్టం భారతదేశంలో 1904లో ఆవిర్భవించింది. తర్వాత కొద్దికాలానికి విస్తృత పరిధితో మరొక సహకార చట్టం 1912లో ఏర్పడింది.

తర్వాత ఆంధ్రప్రదేశ్ భూమి తనఖా బ్యాంకు చట్టం-1934, ఆంధ్రప్రాంత సహకార చట్టం-1952, తెలంగాణా ప్రాంత సహకార చట్టం ఈ మూడు కలసి 1964 ఆంధ్రప్రదేశ్ సహకార చట్టం ఏర్పడింది. ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో రెండు సహకార చట్టాలు అమలులో వున్నాయి. అవి-

1. రాష్ట్ర ప్రభుత్వం అమలులో నుంచి సహాయం పొందే సహకార సంస్థలు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం- 1964 పరిధిలో వున్నాయి.
2. సర్కారీ సహాయం ఏ విధంగా పొందని సహకార సంఘాలు ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకార సహాయచట్టం-1995 పరిధిలో వున్నాయి.

1964 చట్టం రిజిస్ట్రారు అధీనంలో గల సహకార సంఘాలు 19090.

| క్రమ. సంఖ్య | రకం | ఎపిలో సంఘాలు 1964 చట్టం |
|---|---|---|
| 1. | జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు | 22 |
| 2. | పిఎసియస్/ఎఫ్ఎస్/ఎల్ఎస్‌సిఎస్ | 2949 |
| 3. | ఉద్యోగుల పరపతి సహకార సంఘాలు | 3392 |
| 4. | పట్టణ బ్యాంకులు | 103 |
| 5. | జిల్లా మార్కెటింగ్ సహకార సంఘాలు | 22 |
| 6. | బలహీన వర్గాల సహకార సంఘాలు | 9189 |
| 7. | వినియోగదారుల సహకార సంఘాలు | 671 |
| 8. | గృహనిర్మాణ సహకార సంఘాలు | 2735 |
| 9. | గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలు | 4 |
| | **మొత్తం** | **19090** |

ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ సహకార చట్టం-1995 పరిధిలో పనిచేస్తున్న సహకార సంఘాలు 54,520.

1960 దశకంలో సహకార సంఘాలు అధిక సంఖ్యలో నమోదయ్యాయి. పరపతి సంఘాలతో పాటు, పరపతేతర సహకార సంఘాలు కూడా నమోదయ్యాయి. పరపతి సంఘాలను తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో మూడంచెల స్వల్ప కాల పరిపతి వ్యవస్థ అమలులో వుంది. అవి ఏమిటంటే శిఖర సంస్థ రాష్ట్ర సహకార బ్యాంకు(APCOB), జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (DCCB), ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (PACS) లు వున్నాయి. ఈ సహకార వ్యవస్థలు సంఘాల పనితీరును మెరుగు పరచే చొరవ, చిత్తశుద్ధితో రైతులకు మెరుగైన సేవలు అందించే బృహత్ సంకల్పంతో పనిచేస్తున్నాయి.

రాష్ట్రంలో 1987కు ముందు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 6,800 వుండగా, అవి 2005 నాటికి 3,600కి పడిపోయాయి. ఉన్న సంఘాలు సైతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సహకార రంగానిది ఇదే పరిస్థితి కావడంతో ప్రొ. వైద్యనాథన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. గ్రామీణ సహకార పరపతి వ్యవస్థను పటిష్టంగా తీర్చి దిద్దేందుకు ఈ కమిటీ కొన్ని సిఫారసులు చేసింది. ఈ సిఫారసుల ను 2006 ఆగస్టులో కేంద్రప్రభుత్వం ఆమోదించింది.

దేశంలో ప్రొ.ఎ. వైద్యనాథన్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఒప్పందం కుదుర్చుకున్న మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ ఒప్పందం ప్రకారం కొన్ని సహకార సంఘాలు రద్దయ్యాయి. కొన్ని

**2012 అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని**

విలీనం అయ్యాయి. చివరికి 2748 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు మిగిలాయి. వీటిలో 301 సంఘాల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా వుందనే ఉద్దేశంతో వైద్యనాధన్ ప్యాకేజి క్రింద వాటికి ఆర్థికసాయం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. వైద్యనాధన్ ప్యాకేజి క్రింద వచ్చిన ఆర్థిక సహాయం వల్ల రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార బ్యాంకులు లాభపడ్డాయని కొందరి భావన. కాని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మాత్రం యధావిధిగా అలాగే వున్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్న చందంగా ఆ సంఘాల పరిస్థితి వుంది.

పునరుద్ధరణ ప్యాకేజి అమలులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సంస్కరణల అమలు, పనితీరు ఏ మేరకు మెరుగు పడిందన్న అంశం గూర్చి నాబార్డ్ ఒక అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలో కొన్ని చేదు నిజాలు బయట పడ్డాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఆదాయానికి సంబంధం లేకుండా వ్యయాలు చేస్తున్నాయి. పాలక వర్గాలు సంఘ వనరులకు మించి ఖర్చు చేస్తున్నాయి. వ్యాపార అభివృద్ధి ప్రణాళికలు (Development Plan) వాస్తవ దృష్టితో లేకపోవడం వల్ల ముందుచూపుతో పెట్టిన పెట్టుబడి రాక సంఘాలు నష్టాలలో ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం పాలక వర్గాలలో ముందు చూపు కొరవడమే. ముఖ్యంగా సంఘాలు తమ వార్షిక బడ్జెట్‌ను పారదర్శకంగా నిర్వహించడం లేదు.

అధిక సంఖ్యలో సంఘాలు చట్ట పరిధిలో గల పరిమితులను అనుసరించడం లేదు. ప్రధానంగా నిబంధనలను గాలికి వదిలేసి ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో సంఘాలున్నాయి. సహకార సంస్థ నిర్వహణా వ్యయం (Management expenses) మొత్తం ఆదాయం (Total Income) లో 40 నుంచి 50 శాతం మధ్యలో వుండాలి. సిబ్బంది వేతనాలు, ఇతర వ్యయాలు సంఘం ఆదాయంలో 30% మించడానికి వీలులేదు. ఆచరణలో చూస్తే, ఈ నిష్పత్తికి ఎటువంటి సామ్యం లేదు.

నాబార్డు నిర్దేశిత సూత్రాలను ఏమాత్రం పట్టించుకోకుండా పనిచేస్తున్న సంఘాల శాతం రోజు రోజుకు ఎక్కువవుతున్నది. నిబంధనలను గాలికొదిలేసిన సంఘాలకు ఒకవేళ కేంద్రప్రభుత్వం కాని, ఆర్థిక సంస్థలు గాని ఆర్థిక సహాయం నిలిపివేస్తే ఆ సంఘాల పరిధిలో గల రైతన్నల పరిస్థితి ఏమిటనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. చట్టాలు సంఘాల స్వయంపురోగతికి ఆటంకాలుగా వున్నాయని సంఘాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారు. కాని, సంఘాలలో వృత్తి నైపుణ్యం కొరవడటం వల్ల అనుకున్న ప్రగతిని సాధించలేకపోతున్నాయి. ప్రణాళికా బద్ధమైన ముందు చూపు చాలా అవసరం.

ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల అవసరం ఎంతైనా వుంటుంది. వాటిని ముందుగా మార్క్‌ఫెడ్, మిగతా అధీకృత ఎరువుల కర్మాగారాల ద్వారా తెప్పించుకుని కొరత లేకుండా ఎరువులను పంపిణీ చేయాలి. రైతులు ఎరువుల కోసం రోడ్డున పడకుండా మార్క్‌ఫెడ్ వంటి సంస్థలతో సమన్వయ లోపం లేకుండా రైతన్నలకు ఎరువులను అందజేయాలి. విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ సామాగ్రి వంటివి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేటట్లు చూడాలి. అధిక సంఖ్యాక సహకార సంఘాలు రైతులకు పరపతి (Credit) ని అందజేయడంలో విఫలం అవుతున్నాయి. పంపిణీ చేసిన రుణం కాగితాల మీదే కన్పిస్తుంది. వడ్డీ ఇవ్వగానే అసలు కూడా జమచేసినట్లు చూపి, మరల కొత్తగా రుణం ఇచ్చినట్లు లెక్కలు వ్రాయడం సహకార సంఘాల్లో ఎప్పటి నుంచో జరుగుతున్న ఆనవాయితీ. ఈ ఆనవాయితీకి స్వస్తి చెప్పాల్సిన తరుణమిది.

## 97వ రాజ్యాంగ సవరణ

సహకార సంఘాలు స్వతంత్రంగా ప్రజాస్వామ్యయుతంగా పనిజేసేందుకు, వాటిని జవాబుదారీతనంతో పనిచేయనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 97వ రాజ్యాంగ సవరణ తెచ్చింది. కేంద్రప్రభుత్వం 2012, జనవరిలోనే ఈ మేరకు గెజిట్ జారీ చేసింది. ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం, సహకార సంఘాల సభ్యుల సంఖ్య 21కి మించి వుండరాదు. ఐదు (5) ఏళ్ల కొకసారి విధిగా ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణ మొత్తం ఒక స్వతంత్ర సంస్థ ఆజమాయిషీలో, పర్యవేక్షణలో వుండాలి.

ప్రతి ఆర్థిక సంవత్సరం తప్పనిసరిగా ఆదాయ వ్యయాల తనిఖీ జరగాలి. ఆరు (6) నెలలకోసారి తప్పనిసరిగా సర్వసభ్య సమావేశం (General Body) జరగాలి. సభ్యుల భాగస్వామ్యం గణనీయంగా పెరగాలి. అన్ని రాష్ట్రాలు 2013 ఫిబ్రవరి 14 నాటికి కేంద్రం తెచ్చిన రాజ్యాంగ సవరణలో ప్రస్తావించిన అంశాలను విధిగా తమ సహకార చట్టాల్లో పొందుపరచుకోవాలి.

ఒకవేళ ఏవైనా రాష్ట్రాలు చట్టాలను సవరించుకోలేని పక్షంలో కేంద్ర చట్టం అమలులోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు 2013 ఫిబ్రవరిలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలకు నిర్వహిస్తోంది. నూతన పాలక వర్గం నూతనోత్సాహంతో సహకార సంఘాలను ముందుకు తీసుకుని పోయే తరుణమిది.

ఈనాటి ఆర్థికమాంధ్య పరిస్థితులలో సంఘాలు మనుగడ సాధించాలంటే చాలా కష్టపడవలసి వుంటుంది. ఈ పోటీతత్వం ఎదుర్కోవాలంటే సరైన ఆర్థికస్థోమత, నిర్వహణా సామర్థ్యం అవసరం. ఆర్థిక ప్రయోజనాలు, అభివృద్ధి లక్ష్యాలతో పాటు సభ్యుల సంక్షేమం కూడా చూడవలసిన గురుతర బాధ్యత సంఘాల పైన ఉంది.

కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల నేడు సహకార సంఘాల భావ స్వరూపంలో మార్పు రావడంతో నేడు సహకార సంఘాలు 1. సేవా కేంద్రంగా (Service Centre) 2. లాభాలను ఆర్జించే కేంద్రంగా (Profit Centre) 3. అభివృద్ధి కేంద్రంగా (Development Centre) 4. సంక్షేమ కేంద్రంగా (Welfare Centre) గా వుండాలి. సభ్యుల మనోభావాలను గుర్తెరిగి సంఘాలు పనిచేయాలి.

సంఘాలలో చురుగ్గా సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. దీనికి అసలు కారణాలను అన్వేషించి, సర్వసభ్య సభ్యుల ప్రాతినిధ్యాన్ని సమావేశంలో పెంచాలి. సంఘాలు వృత్తి నైపుణ్యం గల వారికి ప్రాధాన్యత నివ్వాలి. ముఖ్యంగా పాలకవర్గం బాధ్యతాయుతంగా (Responsibility), జవాబుదారీతనంతో (Acciountabitity), పారదర్శకత (Transperency) తో పనిచేయాలి.

ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు వంటివి వాటిని మరియు వ్యవసాయ పనులకు అవసరమైన సమస్త అవసరాలు సంఘం ద్వారా తీరితేనే రైతులకు సంపూర్ణ సహకారం అందినట్లవుతుంది. సంఘాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుని పోకముందే ప్రభుత్వం నిర్మాణాత్మక నిర్దిష్ట చర్యలతో రంగంలోకి దిగాలి. అందుకోసం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను విస్తృత పరచాలి. ముఖ్యంగా సంస్థాగతంగా వీటిని తీర్చి దిద్దాలి. అప్పుడే రైతన్నల ముఖాల్లో చిరునవ్వును చూడగలం.

*- అనంత్ అంతటి*

# పథకానికి పది ప్రశ్నలు

## (పథకాలపై అవగాహన పెంచటానికో చిరు ప్రయత్నం)

**సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో భాగంగా భారత ప్రభుత్వం 'నిర్మల్ గ్రామ్ పురస్కార్'ను ప్రవేశపెట్టింది. సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించిన గ్రామాలను గుర్తించి, వారి కృషిని సత్కరించడం జరిగింది. నిర్మల్ గ్రామ పురస్కార్ సాధించిన విజయ స్ఫూర్తితో మరికొన్ని అంశాలను చేర్చి సంపూర్ణ పారిశుద్ధ్యం పేరును 'నిర్మల్ భారత్ అభియాన్' గా మార్చడం జరిగింది.**

**1. నిర్మల్ భారత్ అభియాన్ అంటే ఏమిటి ? ఈ కార్యక్రమం ఎప్పుడు ప్రారంభమైంది?**

⋆ 2017 సంవత్సరానికి భారతదేశంలో నూటికి నూరు శాతం బహిరంగ మలవిసర్జన నిర్మూలించబడి, ఆ స్థానంలో మరుగుదొడ్ల వాడకం చేపట్టేలా ప్రజలను ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం 2012 ఏప్రిల్ 1 న ప్రారంభమైంది.

**3. నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రాధాన్యత ఏమిటి?**


⋆ నిర్మల్ భారత్ అభియాన్‌లో ముఖ్యంగా దారిద్యరేఖకు దిగువనవున్న మరియు ఎగువనవున్న కుటుంబాలన్నింటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అవకాశం కల్పించడం. గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ భవనాలలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన, గ్రామ పంచాయితీలోని అన్ని ఆవాసాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టడం, ప్రస్తుతం నిర్మల్ గ్రామాలుగా అవతరించిన గ్రామాలకు ఘన, ద్రవ వ్యర్థాల యాజమాన్యానికి ప్రతిపాదనలు.

**4. ఈ కార్యక్రమం క్రింద మరుగుదొడ్డి నిర్మించుకుంటే ప్రభుత్వ ప్రోత్సాహకం లబ్ధిదారునికి ఎంత అందుతోంది?**

# నిర్మల్ భారత్ అభియాన్ పథకంపై పది ప్రశ్నలు

**2. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?**

⋆ గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకురావడం, 2017 సంవత్సరానికి దేశంలో అన్ని గ్రామపంచాయితీలు సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేలా ప్రజలను మరియు పంచాయితీరాజ్ సంస్థలను ప్రేరేపించి ఆరోగ్యం, విద్య, అవగాహన కల్పన ద్వారా సుస్థిర పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రతకు అవసరమయ్యే ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకై కమ్యూనిటీ నిర్వహణలో పారిశుద్ధ్య విధానాలను అభివృద్ధి పరచడం.




⋆ నిర్మల్ భారత్ అభియాన్ క్రింద వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంటే, లబ్ధిదారునికి ప్రభుత్వ ప్రోత్సాహకం రూ. 4600 లు అందుతోంది. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 3200, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 1400.

**5. నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంటే, మరి ఏ ఇతర పథకం ద్వారానైనా అదనంగా ఎక్కువ మొత్తం పొందే అవకాశం ఉందా?**

⋆ ఉంది ! మరుగుదొడ్ల నిర్మాణానికి నిర్మల్ భారత్ అభియాన్ క్రింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహం రూ. 4600 లకు అదనంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మరో 4500 రూపాయలు పొందవచ్చు.





**6. నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికై ప్రభుత్వ ప్రోత్సాహం లబ్ధిదారునికి ఎలా చేరుతుంది?**

⋆ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద లబ్ధిదారుని పేరుని గుర్తించి, అంచనాలను రూపొందించి, సాంకేతిక మరియు పరిపాలన ఆమోదం పొందిన తదుపరి వ్యక్తిగత నిర్మాణం చేపట్టి ఆ పనిలో పని చేసిన కూలీలకు సంబంధించిన వివరాలను మస్టర్‌లో నమోదు చేసి, పనికి కొలతలు వేసి వాటిని చెక్ మెజర్ చేసి సంతృప్తికరంగా ఉండి లబ్ధిదారుడు వాడుతున్నట్లయితే నిర్మల్ భారత్ అభియాన్ క్రింద ప్రోత్సాహం రూ. 4600, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ. 4500 మొత్తంగా రూ. 9100

లబ్ధిదారుని ఖాతాకు అందుతుంది.

**7. నిర్మల్ భారత్ అభియాన్‌లో వ్యవస్థాగత మరుగుదొడ్ల నిర్మాణ పరంగా మార్గదర్శకాలు ఏమిటి?**

⋆ పాఠశాల పారిశుద్ధ్యంలో భాగంగా విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేని పాఠశాలలో కొత్తగా నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం క్రింద మరుగుదొడ్లు నిర్మించుకునే వీలుంది. ఒక్కో యూనిట్ నిర్మాణ వ్యయానికి అయ్యే రూ. 35 వేలను ప్రభుత్వం సమకూర్చుతుంది.



అదే విధంగా ప్రభుత్వ భవనాలలో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి అయ్యే వ్యయం రూ. 8000 లను ప్రభుత్వం సమకూర్చుతుంది. ప్రైవేటు భవనాలలో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాలలో ఆయా యజమానులను నిర్ణీత నమూనాలో మరుగుదొడ్డి నిర్మించవలసిందిగా కోరి భవన అద్దెను పెంచడం ద్వారా నిర్మాణానికి పెట్టిన వ్యయాన్ని తిరిగి పొందవలసిందిగా కోరాలి. లేదంటే నిర్మల్ భారత్ అభియాన్ క్రింద ఉన్న రివాల్వింగ్ ఫండ్ నుండి యజమానికి నెలవారీ చెల్లించే అద్దె నుండి మినహాయించడం ద్వారా కొంతకాలానికి సర్దుబాటు చేయాలి.

**8. నిర్మల్ భారత్ అభియాన్‌లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణ పరంగా మార్గదర్శకాలు ఏమిటి?**

⋆ నిర్మల్ భారత్ అభియాన్‌లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు ఒక సమగ్ర అంశం. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కావలసిన ప్రదేశం గృహస్థాయిలో లేనప్పుడు గ్రామంలో ప్రజలందరి అంగీకారంతో ఆమోద యోగ్యమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. వీటి నిర్మాణానికి గరిష్ఠ వ్యయం 2 లక్షలు. మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కమ్యూనిటీ 60:30:10 నిష్పత్తిలో సమకూర్చుకోవలసి వుంటుంది. కమ్యూనిటి వాటా గ్రామ పంచాయితీ సొంత వనరుల ద్వారా, ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ఏ ఇతర నిధులు నుండైనా సమకూర్చుకోవచ్చు.

**9. నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఘన, ద్రవ, వ్యర్థ నిర్వహణ యాజమాన్యానికై ఏ విధమైన మార్గదర్శకాలు ఉన్నాయి?**

⋆ నిర్మల్ భారత్ అభియాన్‌లో ఘన, ద్రవ, వ్యర్థ యాజమాన్య నిర్వహణ ఒక కీలక అంశం ఇందులో ఉన్నప్పటికీ నిర్మల్ గ్రామ పురస్కార్ పొందిన గ్రామ పంచాయితీలు, నిర్మల్ గ్రామాలుగా అవతరించడానికి లక్ష్యంగా పెట్టుకున్న గ్రామాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎరువు సంతలు, కంపోస్టు యూనిట్‌లు, బయోగ్యాస్ ప్లాంటులు, మురుగు కాలువలు, ఇంకుడు గుంతలు మొదలైనవి చేపట్టేందుకు నిర్మల్ భారత్ అభియాన్ కల్పిస్తుంది. ఆ గ్రామ పంచాయితీ పరిధిలో నివశించే కుటుంబాల సంఖ్య ఆధారంగా ఆర్థిక సహాయం ఉంటుంది.

**10. నిర్మల్ భారత్ అభియాన్‌లో గ్రామీణ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందా?**

⋆ వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు యూనిట్, వాషింగ్ ప్లాట్‌ఫారంలు మొదలగు పారిశుద్ధ్య వస్తు సామగ్రి విక్రయ కేంద్రాలు, ఉత్పత్తి కేంద్రాలు, నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ఇతర ఆసక్తి గల వ్యక్తులు ఏర్పాటు చేసుకోవచ్చు. జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య సంస్థను, సంప్రదించి వడ్డీలేని 3.5 లక్షల రూపాయలను జిల్లా స్థాయిలో అందుబాటులో ఉన్న రివాల్వింగ్ ఫండ్ నుండి పొందవచ్చు. పొందిన రుణాన్ని సులభవాయిదాల్లో 18 నెలలలో తిరిగి చెల్లించవలసి ఉంటుంది.

◆

## ఆకుపచ్చని ఆలోచనలు

ఈ పచ్చదనం
ఈ ప్రశాంతత
ఏదో చెబుతోంది
నువ్వు నాలాగే శాంతం
అంటోంది ఆకాశం
నాలాగే చురుకైన దానివని
చెబుతోంది గాలి...
నేను అందగత్తెనని
ప్రశంసిస్తోంది ప్రకృతి
నేను ఇంత ఉన్నతమైన ఆలోచనలతో
ఎలా వుంటున్నానని ప్రశ్నిస్తోంది.
రాత్రి పూట మిలమిలలాడే నక్షత్రాలతో
పోలుస్తోంది.
ఈ పచ్చదనం
ఈ ప్రశాంతత
ఇంకా ఏదో చెబుతోంది
పగటిపూట సూర్యుడిలా తేజోవంతమని
నా జీవన విధానాల్లో అంతటి స్పష్టత వుందని
నా ఆలోచనలు ఆకాశమంత విశాలమని.

*- మంత్రవాది మహేశ్వర్*



# ఆంధ్రప్రదేశ్ భూమి సాగు లైసెన్సుదారుల చట్టం 2011 (18/2011)

**1. ఆంధ్రప్రదేశ్ భూమి సాగు లైసెన్సుదారుల చట్టం 18/2011 వల్ల లైసెన్సు పొందిన వ్యవసాయదారులకు కల్పించిన సదుపాయాలేమిటి?**

- పట్టాదారు నుండి భూమిని సాగు గుత్త తీసుకొని వ్యవసాయం చేసుకొనే వ్యక్తి లైసెన్సు కార్డు ద్వారా బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకొనవచ్చు.
- ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రేటుపై విత్తనాలు, ఎరువులు పొందవచ్చును.
- ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం కలిగినట్లయితే ప్రభుత్వం మంజూరు చేసే పంట నష్ట పరిహారం భూమి పట్టాదారుకు బదులుగా గుత్తదారు నేరుగా పొందవచ్చు.

**2. సాగుదారు గుర్తింపు కార్డు (లైసెన్సు) ఎవరు మంజూరు చేస్తారు? ఎంత కాలం వరకు అమలులో ఉంటుంది?**

- రెవిన్యూ ఆఫీసర్, అనగా డిప్యూటీ తహశీల్దారు, మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టరు గ్రామ రెవిన్యూ అధికారి మొదలైన వారిలో నిర్ణయించబడిన అధికారి అర్హత కార్డు మంజూరు చేస్తారు. వ్యవసాయదారు గుర్తింపు కార్డు (అర్హత కార్డు) ఒక్క సంవత్సరానికి మాత్రం వర్తిస్తుంది. అనగా మే నెల నుండి ఒక్క సంవత్సరం పాటు.

**3. అర్హత (లైసెన్సు) కార్డు పొందడానికి భూ యజమాని నుండి అగ్రిమెంటు పత్రం అవసరమా?**

- భూ యజమాని యొక్క అంగీకారపత్రం అర్జి వెంట తప్పక పంపాలి. గ్రామసభలో యజమాని తన సమ్మతి తెల్పితే సరిపోతుంది.



**4. ప్రభుత్వ భూములు ఆక్రమణలో వున్నవారు, ఈ చట్ట పరిధిలో సాగు లైసెన్సు కొరకు సమ్మతించిన వాటికి "లైసెన్సు కార్డు" మంజూరు చేయవచ్చునా?**

- చేయరాదు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారికి భూమిపై హక్కు లేదు. కాబట్టి వారు గుత్తకు ఇచ్చే అధికారం లేదు.

**5. ఈ చట్టం అసైను చేసిన భూములకు, దేవాదాయ భూములకు వర్తిస్తుందా?**

- వర్తించదు. అటువంటి తరగతికి చెందిన భూములకు ప్రత్యేక చట్టాలు, నియమాలు ఉన్నాయి.

**6. లైసెన్సు కార్డు అర్జీ ఫారాలు ఎవరు పంపిణీ చేస్తారు? అర్జీలను ఎవరికి, ఎక్కడ ఇవ్వాలి?**

- "గ్రామ సమైక్యం" ద్వారా అర్జీ ఫారము-1 పొందవచ్చును. ప్రతి గ్రామంలో మే నెల యందు గ్రామసభ జరుపబడును. అక్కడ అర్జి/డిక్లరేషన్ ఫారము నెం.1 మరియు పట్టాదారునుండి పొందిన ఆమోద పత్రము జత పరచి రెవిన్యూ అధికారికి ఇవ్వాలి.

**7. అర్హతకార్డు మూలంగా వ్యవసాయదారునికి భూమిపై హక్కు ప్రాప్తిస్తుందా?**

- రాదు. అతడు పండించిన పంటపై మాత్రమే హక్కు లభిస్తుంది. భూమిపై ఎటువంటి హక్కులు ప్రాప్తించవు. అంతేకాక, అతనికి ఏ విధమైన స్వాధీనపు కౌలు హక్కు లేక ఇతర స్వభావం గల ఏ ప్రయోజనం లభించదు.

**8. లైసెన్సు పొందిన వ్యవసాయదారు సదరు భూమి యజమాని / పట్టాదారు కుటుంబ సభ్యుడై ఉండవచ్చునా?**

- లైసెన్సు పొందిన వ్యవసాయదారు సంబంధిత భూమి యజమాని/ పట్టాదారు కుటుంబ సభ్యుడుగా ఉండరాదు. కుటుంబ సభ్యుడు అనగా భర్త లేక భార్య, కుమారులు, కుమార్తెలు మరియు తల్లిదండ్రులు అని అర్థం.

**9. రుణ అర్హత కార్డు పొందడానికి కార్డుదారు ఎంత చెల్లించాలి?**

- ఈ కార్డు పొందుటకు రూ. 10/-లు చెల్లించవలెను.

(ప్రభుత్వ మెమో నెం. 14369/ఎల్-రెఫ్/2008, తేదీ : 6.7.2011)

**ల్యాండ్ సెల్, అపార్డ్ సౌజన్యంతో**

# ఆదివాసీల వెలుగు బాట 'మాతోట'

**గిరిజనులకు సుస్థిరమైన జీవనాధారం కల్పించడానికి, వారి ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించి వారిలో ఆత్మవిశ్వాసం కల్గించడానికి నాబార్డు (జాతీయ వ్యవసాయ,గ్రామీణాభివృద్ధి బ్యాంకు) గిరిజనుల బంజరు భూముల్లో బంగారం పండించే దారి చూపింది. ఎనబై 'మాతోట' ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 55 వేల పేద గిరిజన కుటుంబాలు 55 వేల ఎకరాల బీడు భూములను సారవంతం చేసుకుని ఆత్మస్థైర్యంతో బతుకుతున్నారు.**

ఈ నేపథ్యంలో అదిలాబాద్, ఖమ్మం, చిత్తూరు, విశాఖ, శ్రీకాకుళం, జిల్లాల్లోని కొన్ని గ్రామాలకు చెందిన ఆదివాసీలు 'మాతోట' కార్యక్రమాల వల్ల తమ కాళ్లమీద తాము నిలబడగలిగి,తమ అభివృద్ధిని తామే సాధించుకునే క్రమంలో సంతోషాలనూ, విజయాలనూ వారి ముఖాల్లోని కొత్తవెలుగును చూద్దాం రండి....

### మాతోట అంటే..?

మన దేశంలో గిరిజనులు ఎక్కువగా మాట్లాడే గోండు భాషలో 'వాడి' అంటే తోట.

గుజరాత్ గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులచే తొలిసారిగా ఉసిరి మామిడి తోటలను పండించి గిరిజనుల బతుకులను మార్చే చిరు ప్రయత్నమే నాబార్డు 'వాడి' కార్యక్రమం. 'వాడి'ని తెలుగులో 'తోట' అంటాం కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం 'మాతోట'గా మారింది.



### తోటలో ఎలా చేరాలి?

ఐటిడిఎ అధికారుల సాయంతో గ్రామాలు సర్వే చేసి తోటల పెంపకానికి అనువైన భూములను ఎంపిక చేసి, టైటిల్ డీడ్ ఉన్న గిరిజన రైతులతో ఒప్పందాలు కుదుర్చుకొంటారు. ఈ కార్యక్రమం అంతా పారదర్శకంగా లబ్ధిదారులచే ఏర్పాటు చేసిన గ్రామాభివృద్ధి కమిటీల ద్వారా జరుగుతుంది. ఈ కమిటీలకు సంస్థాగత రూపం ఇవ్వడానికి వాటిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రతి గిరిజన కుటుంబం ఎకరా భూమిలో పండ్లతోటలు పెంచాలి. ఎంపిక చేసిన గిరిజన రైతులకు పండ్లమొక్కలను ఉచితంగా ఇవ్వడమే కాక, కంపోస్టు ఎరువుల వాడకం నుండి మొక్కలకు నీరు పెట్టడం, యాజమాన్య పద్ధతుల్లో పాటించవలసిన జాగ్రత్తలను తెలియచేస్తూ బ్యాంకులు, రైతులు, ఎన్జీఓలు, వ్యవసాయ అధికారులు, ఇతర సాంకేతిక నిపుణుల సాయంతో 'మాతోట'ను మనతోటగా తీర్చిదిద్దుతున్నారు.

ఎకరం పొలంలో పండ్లతోటల పెంపకం కోసం ప్రతి గిరిజన కుటుంబానికి నాబార్డు సుమారు రూ. 40 వేలు పెట్టుబడి పెడుతోంది.

### తోటల పెంపకంలో నిపుణుల సాయం

గిరిజనులందరికీ పొలంలో మొక్కలు నాటేందుకు, గోతులు తీసేందుకు మార్కింగ్ ఇవ్వడం, గోతుల్లో కలుపడానికి వర్మి కంపోస్టు, వేపపిండి పంపిణీలో స్థానిక స్వచ్ఛంద సంస్థలు గిరిజనులకు సహకరిస్తున్నాయి. వీరి భూమిని మూడు భాగాలుగా విభజించి 50 శాతం మామిడి, 40 శాతం ఉసిరి, జీడి, జామ, సపోటా వంటి మొక్కలు, 10 శాతం సరిహద్దులో టేకు, అల్ల నేరేడు, దానిమ్మ వంటి మొక్కలు వేస్తున్నారు. మొక్కల ఎదుగుదలకు అవసరమైన సేంద్రియ ఎరువులు, నీటి సౌకర్యాలను కల్పించారు. నీరు తక్కువగా ఉన్న చోట డ్రిప్ ఇరిగేషన్‌తో సాగు చేయిస్తున్నారు.

ప్రతి రైతుకు యాభైకిలోల బయో కంపోస్టును సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ నిపుణులతో సదస్సులు ఏర్పాటు చేసి సలహాలు సూచనలు అందిస్తున్నారు. అదిలాబాద్ అటవీ ప్రాంతంలో ఎక్కువగా పత్తిపంటలు పండిస్తున్నారు. వీటివల్ల ఆదాయం బాగా ఉన్నప్పటికీ, ఆ పంటలకు వాడే రసాయన ఎరువుల వల్ల భూసారం దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఇదే విషయాన్ని గిరిజనులకు నచ్చ చెప్పి పండ్లతోటల పెంపకం పట్ల ఆసక్తి కలిగిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేని చోట చేతి పంపులను ఏర్పాటు చేయడం, విద్యుత్ సౌకర్యం ఉన్న చోట నీటి పంపు మోటార్లను పంపిణీ చేస్తున్నారు. చీకట్లో మగ్గుతున్న ఇళ్లకు సౌరశక్తి (సోలార్) దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

నీటివనరులు పెంచుకోవడానికి, పరుగెత్తే నీటిని మెల్లగా పారే విధంగా చేస్తూ, మెల్లగా పారే నీటిని నిల్వ ఉండేలా చేస్తున్నారు. ఆపై నిల్వ ఉన్న నీటిని భూమిలోకి ఇంకే విధంగా చేస్తున్నారు.

### సాగులో జీవనోపాధి ఎలా...

మామిడి చెట్ల నుండి ఆదాయం రావడానికి ఏడేళ్లు పడుతుంది. రోజూ కూలికి పోతేగానీ కడుపు నిండని గిరిజనులు తోటల సాగులో నిమగ్నం కాగలరా? అందుకే రైతుల కనీస అవసరాలు తీరడానికి



తోటల్లో అంతరపంటలుగా రాగులు, మినుములు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, కూరగాయలు పండిస్తున్నారు. వీటి వల్ల కనీస అవసరాలు తీరడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో గిరిజన రైతులు ఆదాయం కూడా పొందుతున్నారు. విశాఖ జిల్లా అరకులోయలో గిరిజనులు తమ తోటల చుట్టూ కంచెలుగా కిత్తనార మొక్కలను పెంచుతూ, వాటిపై అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. కిత్తనార ఆకుల నుండి వచ్చే నార పడవల తయారీలో వాడుతున్నారు కాబట్టి కిత్తనారకు అంత డిమాండ్.

## తొలి చిగురు తొడిగింది శ్రీకాకుళం కొండల్లో....

'మాతోట' తొలిసారి చిగురించింది 2006లో శ్రీకాకుళం గిరిజన పల్లెల్లోనే.

పాతపట్నం, మిలియాపుట్టి, హిరమండలం, సరవకోట మండలాల్లో ఇరవై అయిదు పంచాయితీల్లోని 49 గ్రామాలలో గిరిజన రైతులు పండ్లతోటలు పెంచుతున్నారు. 2006లో మొదలైన 'మాతోట' పథకం కింద నేటికి 800 ఎకరాల్లో 883 గిరిజన కుటుంబాల ను పండ్లతోటల పెంపకంలో నిమగ్నం చేశారు. ఈ ప్రాంతపు నేల ఉసిరి, జీడిమామిడి పంటలకు ఎంతో అనువైనది. అందుకే మామిడి తోటల మధ్య ఎకరానికి 40 ఉసిరి, జీడిమామిడి మొక్కలు చొప్పున పెంచుతున్నారు. పండ్లతోటల పెంపకంలో గ్రామాల గిరిజనుల అభివృద్ధి కోసం ఆరోగ్య శిబిరాలు, మహిళల పొదుపు సంఘాలు, రైతు క్లబ్‌ల నిర్వహణను నాబార్డు చేపట్టింది. 'మాతోట'లు నిర్వహిస్తున్న గిరిజనరైతు కుటుంబాలు మలేరియా, ఇతర వ్యాధులకు గురవకుండా పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కలిగించడానికి ఆరోగ్య శిబిరాల ను ఏర్పాటు చేశారు.

## కంచె మొక్కలుగా కొండచీపుర్లు

ప్రధానమైన పండ్లతోటలకు ఈదురు గాలులు, పశువుల నుండి రక్షణగా తోటల సరిహద్దుల్లో టేకు, గోరింటాకు, శీకాయ మొక్కలు పెంచడానికి ఇక్కడి గిరిజనులు ఆసక్తి చూపుతున్నారు. ఐదేళ్ల తర్వాత టేకు కలప వల్ల అధికాదాయం వస్తుంది. కంచెలుగా కొండచీపుర్లను కూడా పెంచుతున్నారు. కొండచీపుర్ల తయారీలో వీరికి శిక్షణనిచ్చి మార్కెట్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తుండటంతో నెలనెలా ఆదాయం పొందుతున్నారు. కొన్ని గ్రామాలలో కంచెలుగా గోరింటాకు, శీకాయ మొక్కలు వేస్తున్నారు.

## కుండలతో సాగు

ఈ ప్రాంతంలో మామిడితోటలకు నీటిని కుండలతో సరఫరా చేస్తున్నారు. పద్దెమిది గ్రామాల్లో 27 వేల కుండలను రైతులకు పంచారు. కొండవాలు ప్రాంతంలో సాగు చేస్తున్న 132ఎకరాల పండ్లతోటల కోసం గ్రావిటీ పైప్‌లైన్లను కూడా ఏర్పాటు చేసుకున్నారు. మరో 96 ఎకరాల సాగుకోసం అయిదు కిరోసిన్ పంప్‌సెట్‌లను నాబార్డు ఆర్థిక సాయంతో ఎన్జీఓలు ఏర్పాటు చేశారు.

## ఆదివాసీలు ఏమంటారు.. నాసిక్‌లో తోటలు చూశాం!

ఆదిలాబాద్‌జిల్లా, నిర్మల్‌కు అరవై కిలోమీటర్ల దూరంలో కవ్వాల్ అభయారణ్యం దాటాక కన్పించే కడెం ప్రాజెక్టు నుండి మరో యాభై కిలోమీటర్లు పోతే అల్లంపల్లి అనే చిన్న పల్లె వస్తుంది. ఇక్కడికి చేరుకోవాలంటే దారిలో రోడ్డుకు అడ్డంగా పారుతున్న నాలుగు వాగులను దాటాలి. వానాకాలంలో ఈ వాగులు పెద్దవై పొంగి ఈ పల్లెను బాహ్యప్రపంచానికి దూరం చేస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా వీరు మాతోటను పెంచడంలో శ్రద్ధచూపడం విశేషం. ఇక్కడ పదహారు గిరిజన కుటుంబాలు పదహారు ఎకరాల్లో పండ్లతోటలను పెంచుతున్నారు.తన కుటుంబంతో మూడెకరాల్లో మాతోట వేసిన గిరిజన మహిళ చైనేని రాజవ్వ ఏమంటారంటే...

"మా కుటుంబానికి మూడెకరాలున్నది. రెండెకరాల్లో వరిపంటలు పండిస్తున్నాం. ఒక ఎకరంలో రెండేళ్ల క్రితం ఉసిరి, మామిడి మొక్కలు వేశాం. నాబార్డు సాయంతో కొలతలు తీసి, గుంతలు తవ్వి మొక్కలు వేశాం.

నాబార్డు వారు బాయిని తవ్వించారు.ఆ నీటితో తోటలు పెంచుతున్నాం. అంతర పంటగా నువ్వులు వేశాం. తోటకు రక్షణగా కట్టెలతో దడి కట్టుకున్నాం. కొందరు వెదురు బొంగులతో కూడా కడుతున్నారు. నా భర్త భీమయ్య కూడా నాతో పాటు పొలం పనులు చూసుకుంటూ కూలి పనికి కూడా పోతుంటాడు. తోటల పెంపకం గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకోవడానికి నాబార్డువారు నాసిక్ తీసుకెళ్లారు. మా చెట్లు బాగానే పెరుగుతున్నాయి. మామిడి పండ్లు చేతికి వస్తే మేం పనుల కోసం వెతుక్కోనక్కర లేదు"

*- రాజవ్వ, అల్లంపల్లి, కడెం మండలం, ఆదిలాబాద్ జిల్లా*

## మా పొలంలోనే మాకు పనులు

తిరుపతికి అరవై కిలోమీటర్ల దూరంలోని కేవీబీపురం మండలంలో గిరిజనులకు అడవులే ఆధారం. కలప,మారేడుకాయలు, బంక ఇతర అటవీ ఉత్పత్తులను సేకరించి బతికేవారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని గిరిజనపల్లెలు కూడా ఇంతే. అడవులే వారికి అన్నం పెట్టేవి. ఒక్కోసారి అడవుల్లోకి వెళితే వారం రోజుల వరకు బయట ప్రపంచం చూసేవారు కాదు. తాగునీరు లేక ఉండటానికి సరైన నీడలేక రోగాలతో సతమతమవుతుండేవారు. ఇదంతా ఒకప్పటి పరిస్థితి. 2009లో ఇక్కడ 'మాతోట' కార్యక్రమం మొదలయ్యాక వారి చీకటి బతుకుల్లో మార్పువచ్చింది. నేడు సొంత భూముల్లో పండ్లతోటలు, కూరగాయలు పెంచుకుంటూ తమ కాళ్లమీద తాము నిలబడుతున్నారు. ఈ జిల్లాలో అయిదు వందల కుటుంబాలు పండ్లతోటల సాగులో నిమగ్నమయ్యాయి. 'మాతోట'తో ఆదివాసుల భవిష్యత్‌కి ఓ దారి కూడా చూపడమే కాక, సంస్కృతిని కాపాడడానికీ ఇక్కడి మాస్ సంస్థ కృషి చేస్తుంది. ఇక్కడి గిరిజన సంప్రదాయ నృత్యం

దుబంగిన, ఇతర కళారూపాలను ప్రదర్శించడానికి కావాల్సిన వస్తువుల ను 27 గ్రామాలకు అంద చేశారు. పగలంతా శ్రమించిన గిరిజనులు సాయం సమయాల్లో ఆహ్లాదంగా గడపడానికి వీరి కళారూపాలు ప్రదర్శించుకునే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు

''పండ్ల మొక్కలు పెరిగి కాయలు చేతికి రావడానికి ఏడేండ్లు పడుతుంది. ఈ లోపు అంతర పంటలుగా వంగ, మిరప, అలసంద, సొర, కాకర, బీర, చిక్కుడు పండిస్తున్నాం.మొక్కలను చీడపురుగుల నుండి కాపాడడానికి వేపనూనె, ఆకులతో తయారు చేసిన ద్రావకాన్ని మొక్కలపై పిచికారీ చేయడం వల్ల చెట్లు చక్కగా ఎదుగుతున్నాయి. దీనికితోడు గొర్రెలు, కోళ్ల పెంపకం చేపట్టాం. తిండికి లోటు లేకుండా గడుస్తోంది. ఇదివరకైతే అడవులకు పోయి కట్టెలు కొట్టుకుని బతకాల్సివచ్చేది... ఉపాధి హామీ పనులకు పోవాల్సి వచ్చేది. ఇపుడు ఇంటిల్లిపాదికీ మా పొలంలోనే పనులు దొరుకుతున్నాయి''

***- బుజ్జమ్మ, బట్టయ్య, కొండల ఆదవరం, చిత్తూరు జిల్లా***

## మద్యం మాని, సేద్యం చేసి....

ఖమ్మం జిల్లాలో గిరిజన గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో 'మాతోట' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్జీఓలు నాబార్డు అండతో గిరిజనరైతులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కలిగిస్తున్నారు. 'మాతోట'ల నిర్వహణ వల్ల గిరిజనుల జీవన శైలిలో మార్పు కలుగు తోందనడానికి వర్స చినవీరస్వామి జీవితమే ఒక ఉదాహరణ.

ఖమ్మం జిల్లా బయ్యారం మండలంలోని నామాలపాడు పల్లెకు చెందిన కోయ గిరిజన రైతు వర్సవీరస్వామి. అతనికి ముగ్గురు పిల్లలు. తనకున్న ఎనిమిది ఎకరాల భూమిలో ఏడు ఎకరాలు మెట్ట, ఒక ఎకరం వరి పండించడానికి అనువుగా ఉండేది. ఆయన భార్యాపిల్లలు ఈ భూమిలో వరి పండించేవారు. వీరస్వామి మద్యానికి బానిసై రోజూ అందరితో తగువులు పెట్టుకునేవాడు. కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిగా తిరగడంతో తోటి గ్రామస్థులు అతడికి దూరంగా ఉండసాగారు. పంటలు సరిగ్గా పండక పోవడంతో ఆ కుటుంబం అప్పుల పాలైంది. వీరస్వామి భార్య ఎకరం పొలం అమ్మి అప్పులు తీర్చింది. అయినప్పటికీ, సమస్యలు తీరకపోవడంతో ఉన్న పశువులను కూడా అమ్మింది. అయినా వీరస్వామిలో మార్పు రాలేదు. అతని భార్య మరో ఎకరం అమ్మి కూతురు పెళ్లి చేయాల్సి వచ్చింది.

ఆ సమయంలో అదే గ్రామంలో ఎన్జీఓలు ఆ గ్రామస్థులకు పండ్లతోటల నిర్వహణ వల్ల కలిగే లాభాలు, నాబార్డు ఇచ్చే ఆర్థిక సాయం గురించి వివరించగా, కొందరు గిరిజన రైతులతో పాటు వీరస్వామి కూడా ముందుకు రావడంతో అధికారులు 'మాతోట' నిర్వహించే రైతులెవ్వరూ మద్యం ముట్టరాదని నిబంధన పెట్టి అతడిని చేర్చుకున్నారు. అలా 2007లో వర్స చినవీరస్వామి తన ఎకరం పొలంలో మామిడి, ఉసిరిమొక్కలు నాటాడు. మొక్కలు నాటినందుకు నాబార్డు అతనికి మిగతా రైతులతోపాటు రూ. 2,790 ఆర్థిక సాయం చేసింది. ఎన్జీఓలు వర్మి కంపోస్టు, వేపపిండి, కిరోసిన్ పంప్‌సెట్‌లిచ్చారు. అప్పటి నుండీ వీరస్వామి వ్యసనాలు మానేసి పండ్లతోట సాగులో తలమునకలయ్యాడు. భార్యాపిల్లలతో వ్యవసాయమే జీవితంగా బతికాడు. నేడు వీరస్వామి తోట ఎదిగిన మామిడి, ఉసిరి చెట్లతో పచ్చగా కళకళలాడుతోంది. ఇతర జిల్లాల గిరిజన రైతులు అతని తోటను చూడడానికి వస్తుంటారు. మొక్కల పెంపకంలో అతడి సలహాలు తీసుకుంటున్నారు.

## ఆకుపచ్చని అరకు లోయ ...చిరునవ్వుల గిరిజనం

విశాఖ జిల్లాలో డుంబ్రిగుడ, అరకువ్యాలీ, పెదబయలు, చింతపల్లి, మంచింగిపుట్, అనంతగిరి, వి.మాడుగుల, కొయ్యూరు మండలాల్లో 2,792 ఎకరాల్లో 'మాతోట' పూర్తయింది. మరో 4,208 ఎకరాల్లో మొక్కలు పెరుగుతున్నాయి. కాలిబాటలో మలుపులు తిరిగే ఎత్తైన కొండల్లోకి వెళ్ళి ఇక్కడి గిరిజనులు పండ్లతోటలు పెంచుతున్న తీరు అద్భుతం. విశాఖజిల్లాలోని ఆకుపచ్చలోయ అరకులో సిల్వర్ ఓక్ చెట్లనీడలో కొందరు గిరిజన రైతులు కాఫీ పంటలు పండిస్తుండగా, మరోవైపు కొండ దిగువ ప్రాంతంలో పేద గిరిజనులు మాతోటలను నిర్వహిస్తున్నారు. చెట్లపొదల మధ్య కాలిబాట తప్ప మరో మార్గం లేని లోయ ప్రాంతంలో వీరు సాగు చేస్తున్న పొలాలకు వెళ్లాలంటే ఏరులు దాటి ఎగుడు దిగుడు కొండలు ఎక్కిదిగాల్సిందే. అరకులోయలో తోటల చుట్టూ కిత్తనార మొక్కలను పెంచుతున్నారు. వీటి ఆకులకు ముళ్ళుండటం వల్ల పశువులు, పాములు కూడా తోటలోకి రాకుండా



కాపాడతాయి. అంతేకాక ఈ మొక్కల ఆకుల నుండి వచ్చే నారకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. దీనిని పడవల తయారీలో వాడుతున్నారు. ఎకరా తోటకు కంచెగా వేసిన కిత్తనార ఆకులను కోసి అమ్మితే అయిదు వేల వరకు ఆదాయం వస్తుంది.

కిత్తనార ఆకులను కోసిన తరువాత మళ్లీ చిగురించి రెండువారాల్లోనే ఆకులు ఏర్పడతాయి. ఇవేకాక టేకు, జిల్లేడు వంటివి కూడా ఈ ప్రాంత రైతులు లైవ్ ఫెన్సింగ్‌గా వాడుతున్నారు. తోటకు కంచెలుగా పెంచే మొక్కలపై అదనపు ఆదాయం పొందడం విశేషం. కొండల మీద నుండి ఊటనీటిని గ్రావిటీ పద్ధతిలో పైపుల ద్వారా తమ పొలాలకు మళ్లించి సాగుచేస్తున్నారు.

## సపోటా, మామిడి విరగకాస్తున్నాయి

''మామిడి మొక్కలు వేసి మూడేళ్లయింది. రోజూ నీళ్లు పెడ్తున్నపుడు కాయలు కాసిన మొక్కలను చూస్తుంటే ఎంతో తృప్తిగా ఉంటుంది. మొక్కలను నాటే సమయంలో నెలలు తరబడి పడిన కష్టమంతా ఇపుడు మర్చిపోతున్నాం. సపోటా, మామిడి విరగకాస్తున్నాయి,



నా ఎకరా పొలంలో మామిడి మొక్కలతోపాటు నలభై చొప్పున సపోటా, ఉసిరి చెట్లు కూడా పెంచుతున్నాం. నాబార్డు మాకు ఇస్తున్న ప్రోత్సాహం ఎంతో ఉత్సాహాన్నిస్తున్నది. అంతర పంటలుగా వేరుశెనగ, కాయగూరలు సాగుచేస్తున్నాం.ఆదాయం బాగుంది. పశువులు రాకుండా కొండచీపుర్లు, టేకు మొక్కలను తోటకు కంచెగా పెంచుతున్నాం. కొండమీద ఊటనీరుని మా పొలాలకి మళ్లించడానికి పైప్‌లైన్లు ఏర్పాటు చేసుకున్నాం. ఈ నీళ్లనే తాగునీరుగా కూడా వాడుకుంటున్నాం. నాతోపాటు 'మాతోట' నిర్వహిస్తున్న రైతులందరికీ మొక్కల పెంపకంలో సలహాలివ్వడం, మా గ్రామాభివృద్ధికి కావాల్సిన సాయం కోసం కృషి చేస్తున్నాను.''

*- పంతం అప్పలస్వామి, భల్లుగుడ,*
*మాతోట గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, అరకు లోయ.*

## అరకులో తోటలు చూశాం

''ఎకరం పొలంలో ఏడాది క్రితం మామిడితో పాటు టేకు, జీడిమామిడి పెంచుతున్నాను. వీటికి నీళ్ల కోసం ఎన్నో బాధలు పడ్డాం. ఒకపూట కూలీకి పోతూ మరోపూట ఈ మొక్కలను పెంచాం. మాకష్టం ఫలించి నేడు మొక్కలు చక్కగా పెరుగుతున్నాయి. మమ్మల్ని అరకు వ్యాలీ తీసుకెళ్లి అక్కడ పండ్లతోటల సాగు చేస్తున్న తీరును చూపించారు. వారు తోటల చుట్టూ కంచెగా టేకు, గోరింట పెంచుతున్నారు. ఆ పద్ధతులను మా రైతులు కూడా అనుసరిస్తున్నారు.''

*- గెమ్మల ఎంకటేశం, మాడుగుల మండలం, రామచంద్రపురం*

## అంతరపంటలతో నిరంతర ఆదాయం

"నేను, నా భార్య తోటలను పెంచుతున్నాం. నాకు మగ పిల్లలు లేక పోవడంతో పొలం పనుల్లో నా అన్న కొడుకుని సాయంగా పెట్టుకున్నాను. మేమంతా కలిసి మా పొలంలో రాగులు, ఇతర అపరాలు పండించే వాళ్లం. కానీ పెద్దగా ఆదాయం లేదు. 2008లో వికాస కార్యకర్తలు మా గ్రామానికి వచ్చి 'మాతోట' గురించి చెప్పినపుడు నాతో పాటు 15 మంది మా గ్రామ రైతులు పండ్లతోటలు పెంచడానికి ముందుకొచ్చారు. కుటుంబానికి ఎకరం చొప్పున పండ్లతోటలు సాగు చేస్తున్నాం. నాబార్డ్ వారు మొక్కలు ఇచ్చి వాటిని ఎలా నాటాలో నీళ్లు ఎలా పెట్టాలో వివరించారు. వారు చెప్పిన ప్రకారం తోటల్లో అంతర పంటలు పండిస్తున్నాం. తోటల సాగుకు కిరోసిన్ ఇంజన్‌లను ఇచ్చారు.

''పండ్లతోటల చుట్టూ జిల్లేడు, టేకు మొక్కలను కంచెలుగా వేసి అంతరపంటలుగా అల్లం, వేరుశనగతోపాటు క్యాబేజీ, బీన్స్, చిలగడదుంపలు పండిస్తున్నాను. వీటివల్ల నెలనెలా ఆదాయం సంపాదిస్తున్నాను. అరటిచెట్లు కూడా పెంచుతున్నాం. అరటి పండ్లు ఇంటి అవసరాలకు సరిపోతున్నాయి. 'మాతోట' గురించి నాకు తెలియక ముందు రాగులు, నువ్వులు మాత్రమే పండించే వాడిని. వాటివల్ల రెండువేల లోపు మాత్రమే ఆదాయం వచ్చేది. కానీ ఇపుడు నా పొలంలో అనేక రకాల పంటలు పండించి పదివేలకు పైగా సంపాదించడమే కాక ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయల దొరుకుతున్నాయి. మామిడి చెట్లు ఎదిగి పంట చేతికి వచ్చే లోపు కూరగాయలతో బతికేస్తాం''.

*- డొంబు, అంత్రిగుడ, అరకు లోయ*

## మా తోట వల్ల ఇవీ ఫలితాలు

- గిరిజనులకు సొంత భూములను నిర్వహించుకోగల సామర్థ్యం పెరిగింది. పండ్లతోటల పెంపకంలో నైపుణ్యాలు తెలిశాయి.
- గిరిజనుల మధ్య ఐక్యత పెరిగి, కలిసి పనిచేస్తే ఏదైనా సాధించగల మనే నమ్మకం కలిగింది. వ్యక్తిగత భద్రత,ఆదాయ భద్రత పెరిగింది.
- గిరిజన మహిళలు ఆదాయంలో కొంత మిగిల్చి పొదుపు చేస్తున్నారు. ఆహారం కోసం అడవుల వెంట వెతుకులాడే శ్రమ తగ్గింది. నిశ్చింతగా పనులు చేసుకుంటున్నారు.మగవారిలో మహిళాశక్తిని గుర్తించే మార్పు కలిగింది.
- సేంద్రియ ఎరువుల వల్ల భూసారం కాపాడుకోవచ్చని గిరిజన రైతులు తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ ఆదాయం వస్తుందని పత్తిపంటలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ ఆ పంటకు వాడే రసాయన ఎరువుల వల్ల భూమి సారాన్ని కోల్పోయి భవిష్యత్‌లో మరే పంటకు పనికి రాదని అక్కడి నాబార్డు అధికారులు, ఎన్జీఓలు వివరించడం వల్ల వారు కూడా పండ్లతోటల పెంపకం పట్ల మక్కువ పెంచుకుంటున్నారు.
- కేవలం పండ్లతోటల సాగుకే కాక గిరిజనులు ఆరోగ్యం,మహిళల స్వయం సమృద్ధికి కూడా నాబార్డు కృషి చేస్తుంది.పొగరాని పొయ్యిలను తక్కువ ధరకే అందించడం, శ్రీకాకుళం జిల్లాలో శానిటరీ నేప్‌కిన్స్‌ని మార్కెట్ ధరకంటే చౌకగా ఇవ్వడానికి ఒక యూనిట్‌ని ఏర్పాటు చేయడం వల్ల గిరిజన మహిళల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. పాడిపశువుల పెంపకానికి కూడా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆరోగ్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.
- అరకులోయలో కొండలపై ప్రవహించే ఊటనీటిని గ్రావిటీ సిస్టం ద్వారా పల్లపు ప్రాంతంలోని పొలాలకు, గ్రామాలకు మళ్లిస్తున్నారు. దీనివల్ల కరెంట్ ఆదా కావడమే కాక, నీటి సమస్యలు తీరుతున్నాయి. ఈ పద్ధతి అధిక ఖర్చుతో కూడుకున్నది కావడం వల్ల, తక్కువ మంది రైతులకు మాత్రమే అందుబాటులో ఉంది. దీనిని విస్తరిస్తే ఎక్కువ మంది రైతులు లాభపడతారు.
- విశాఖ, ఖమ్మం జిల్లాలో గిరిజనులు పనికి ఆహారపథకంలో పనులకు పోయే వారు. ఆ పని లేనపుడు దగ్గరలోని పట్టణాలకు వలస పోయి భవన నిర్మాణ పనులు చేసేవారు. 'మాతోట' పథకం మొదలయ్యాక వలసలు తగ్గాయి. వారున్న చోటే పంటలు పండించి ఉపాధి పొందే అవకాశం కలిగింది.

*- శ్యాంమోహన్ (రూరల్‌మీడియా)*



# సేంద్రియ వ్యవసాయాన్ని (ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోత్సహించేందుకు అమల్లో ఉన్న పథకాలు

**వర్మి కంపోస్టు యూనిట్లు (50% రాయితీ)**

**మార్గదర్శకాలు :**

- వర్మి కంపోస్టు యూనిట్స్ : గ్రామ పంచాయితీకి ఒకటి చొప్పున కేటాయింపు
- రాయితీ వివరాలు :

  యూనిట్ ధర : రూ. 50,000/- రాయితీ 25,000/-

| వ. నెం. | వివరాలు | మొత్తం (రూ.) | రాయితీ విలువ (రూ.) |
|---|---|---|---|
| 1. | 64 కేజీల వానపాములు (150 కేజీల ఫిల్లర్ మెటీరియల్‌తో సహా | 8,000 | 4,000 |
| 2. | 50 పోస్టు గుంతలు (4) | 14,000 | 7,000 |
| 3. | సెమీ పక్కా షెడ్ | 28,000 | 14,000 |
| | | 50,000 | 25,000 |

- **వర్మి కంపోస్టు గుంత కొలతలు :** (4 గుంతలు - 600 చ. అడుగులు) పొడవు 50 అడుగులు, వెడల్పు 3 అడుగులు, లోతు 1 అడుగులు మొత్తం నాలుగు గుంతలు తయారు చేయాలి.
- షెడ్డు కొలత 1100 చదరపు అడుగులు ( పొ 54'× వె 21')
- వాన పాములను ముఖ్యంగా గత సంవత్సరాలలో వర్మి హ్యాచరీలు నెలకొల్పిన రైతుల నుండి కొనుగోలు చేయడానికి మొదటి ప్రాధాన్యత యివ్వాలి.
- వాన పాములను సంరక్షించుకోవటంలో, వర్మి కంపోస్టు తయారీలో



అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు మేలైన సేంద్రియ వర్మి ఎరువు తయారు చేసుకోవాలి.

- వర్మి కంపోస్టు యూనిట్స్ నిర్మించిన రైతులు తమ ఫోటోను యూనిట్‌తో సహా తీయించి పంపించవలెను.
- వర్మి కంపోస్టు తయారీకి సగం కుళ్ళిన వ్యర్థ పదార్థాలను మాత్రమే వాడాలి.

## నాడెప్ కంపోస్టు యూనిట్లు (50% రాయితీ)

- నాడెప్ కంపోస్టు తయారీ ద్వారా వ్యవసాయ వ్యర్థ పదార్థాలన్నీ ఉపయోగకరమైన కంపోస్టుగా మారి తద్వారా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటాయి. మరియు నేలకు పద్ధతిలో సాధారణ కంపోస్టు కంటే మూడింతలు ఎక్కువ ఫలితం లభిస్తుంది.

**మార్గదర్శకాలు :**

- నాడెప్ యూనిట్ గ్రామ పంచాయితీకి ఒకటి చొప్పున కేటాయింపు.

**రాయితీ వివరాలు :**

- యూనిట్ ధర : రూ. 10,000 /- ; సబ్సిడీ : రూ. 5000/-
- యూనిట్ కొలతలు : పొడవు 10 అడుగులు, వెడల్పు 4 అడుగులు, ఎత్తు 3 అడుగులు, గోడ మందము 10''
- నాడెప్ యూనిట్ నిర్మాణానికి నీరు నిల్వ ఉండే ప్రదేశాన్ని ఎన్నుకోరాదు.
- ఇటుకలు, మట్టి, సిమెంట్‌తో ఎత్తుగల గుంతను నిర్మించాలి.
- నాడెప్ పిట్ నిర్మించేటప్పుడు గాలి తగిలేందుకు వీలుగా సరిపడినన్ని పరిమాణం (12.5×10 సెం.మీ) గల రంధ్రాలను గోడలలో ఉండేలా జాగ్రత్త పడాలి.
- రైతుకు రాయితీ డబ్బు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మాత్రమే చెల్లించాలి.

## వర్మి కంపోస్టు హ్యాచరీలు (75% సబ్సిడీ)

**మార్గదర్శకాలు :**

- ప్రతి గ్రామ పంచాయతీలకు ఒకటి చొప్పున వర్మి హాచరీ కేటాయించారు.
- ముందుగా రైతు పేరుపై కలెక్టరు ద్వారా అనుమతి పొందాలి.
- రాయితీ వివరాలు : యూనిట్ ధర రూ. 1,00,000/- (స్థూలంగా), రాయితీ రూ. 75,000/-
- రైతు ముందుగా రూ. 25,000/- లతో యూనిట్ నిర్మాణం మొదలు పెట్టాలి.
- వాన పాములు ప్రొడక్షన్ గుంత కొలతలు : మొత్తం 5 గుంతలు (ఒక్కొక్కటి పొడవు - 50 అడుగులు, వెడల్పు - 3 అడుగులు, లోతు - 1 అడుగు) వర్మి బెడ్‌ల మొత్తం వైశాల్యం : 750 చదరపు అడుగులు, షెడ్డు వైశాల్యం (పక్కాషెడ్) : 1500 చదరపు అడుగులు (54'×27')
- వాన పాముల నిల్వ వుంచే గది ఒకటి నిర్మించాలి.
- హ్యాచరీ ఉత్పత్తి సామర్థ్యం : 500 కిలోల వాన పాములు, కంపోస్టు ఉత్పత్తి అంచనా : 15-20 టన్నులు
- రాయితీని 3 విడతలుగా చెల్లిస్తారు.

1. ముందుగా రైతు రూ. 25,000/- లకు సరిపడా నిర్మాణాన్ని పూర్తి చేసి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు (జడి-ఎ) సర్టిపై చేసిన తర్వాత మొదటి విడత సబ్సిడీ రూ. 25,000/- విడుదల చేస్తారు.
2. షెడ్డు కట్టడం పూర్తి చేసాక రూ. 25,000/- విడుదల చేస్తారు.
3. చివరి రూ. 25,000/- మొత్తం వర్మి కంపోస్టు హ్యాచరీ నిర్మాణం మరియు నిల్వ ఉంచే గది నిర్మాణం పూర్తయి, యూనిట్ ద్వారా వాన పాముల ఉత్పత్తి ప్రారంభించినపుడు విడుదల చేస్తారు.

**యస్. హరిప్రియ**
**ఫ్యాకల్టీ, అపార్డ్**

# ఆగేదెన్నడు మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలు?

**ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను రూపొందించినపుడా?**

**ప్రస్తుతం అమలులోవున్న చట్టాలను మరింత కఠినంగా అమలు చేసినపుడా? రాజకీయ నాయకులు తప్పుచేసిన తమ అనుచరగణానికి కొమ్ముకాయకుండా న్యాయాన్ని కాపాడినపుడా?**

**రక్షణ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసినపుడా? రక్షకభటులు జరిగిన/జరుగుతున్న అరాచకాల పట్ల వెంటనే స్పందించినప్పుడా? తప్పు చేసిన వారు ఎవరైన సరే చట్టం ముందు సమానమే అన్నట్లుగా న్యాయవ్యవస్థ మరింత సక్రమంగా పని చేసినప్పుడా?**

చట్టాలలోని లొసుగులకతీతంగా న్యాయమూర్తులు/న్యాయవాదులు వ్యవహరించినపుడా? విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులను తీసుకువచ్చినపుడా?

విద్యను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా పరిశోధనాత్మక రీతిలో అందించగలిగినపుడా? తమ వ్యాపారం కోసం బాలికలను/మహిళలను అసభ్యకరంగా చిత్రించి ప్రచారం చేస్తూ విలువలకు తూట్లు పొడుస్తున్న మీడియా/సినిమాల రీతి రివాజులను మార్చగలిగినపుడా?

ఏళ్ళ తరబడిగా పితృస్వామ్యపు పోకడలకు అద్దంపడుతున్న మగవారి ప్రవర్తనలో మార్పు వచ్చినపుడా? (అందరూ కాదు) ఫ్యాషన్ పేరుతో తమ అంగాంగాలు ప్రస్ఫుటంగా కనిపించే విధంగా వుంటున్న అమ్మాయిల వస్త్రధారణను మార్చగలిగినపుడా?

తల్లిదండ్రులు తమ విలువైన సమయాన్ని సంపాదనకే కాకుండా, తమ పిల్లల మంచి చెడులను గమనించటానికి కేటాయించ గలిగినపుడా? సమాజంలోనూ, యువతలోనూ విలువలను పెంపొందించగలిగినపుడా?

ఈ మధ్య కాలంలో దేశ రాజధానిలోనూ, రాష్ట్రాలలోనూ మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను గమనించినట్లయితే ప్రతి ఒక్కరి మదిలోనూ పై ప్రశ్నలు ఉదయించక మానవు. అయితే ఇటీవలి కాలంలో జరిగిన అన్ని అరాచక సంఘటనలలో కెల్లా ప్రతి ఒక్కరినీ అత్యధికంగా స్పందింపచేసిన ఘటన 'ఢిల్లీ గ్యాంగ్ రేప్ సంఘటన'.

'అర్ధరాత్రి కూడా ఆడది నిర్భయంగా తిరగగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని పూజ్య బాపూజీ పేర్కొన్నట్లు మనకు తెలుసు. మరి జాతిపిత మాటలను అనుసరించి చూసినట్లయితే, దేశం ఇంకా స్త్రీ, పురుష వివక్ష అనే దాస్యశృంఖలాలలో మగ్గుతూనే వుంది. మరి ఈ లెక్కన మన దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించి నట్లేనా? మన దేశం బ్రిటిష్ వారి ఇనుప సంకెళ్ళ నుండి బయటపడి 65 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ, స్త్రీ, పురుష సమానత్వ సాధనలో ఇంకా వెనుకబడే వుంది. ఇందుకు తార్కాణం 2012 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి రూపొందించిన 'జెండర్ అసమానత్వ సూచి' లో మన దేశానిది 105 స్థానం. పాల్గొన్న దేశాలు 135. ఇదే స్థానం 2011లో 113 (పాల్గొన్న దేశాలు 135). 2011 లో పోలిస్తే ప్రస్తుత స్థాయి కాస్త మెరుగే అయినా, మహిళల ఆరోగ్యం, జీవన భద్రత వంటి విషయాలలో మాత్రం గతేడాది, ఈ సంవత్సరం కూడా 134వ స్థానంలోనే వుంది. అంటే మహిళల ఆరోగ్యం, జీవన భద్రత అంశాలలో ఎంత అసమానత వుందో దీనిని బట్టి అర్థం అవుతున్నది.

ఒక పక్క ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా జెండర్ సమానత్వాన్ని పెంపొందించటానికి/సాధించటానికి కృషి చేస్తూ వున్నా, అది ఇంకా అందని ద్రాక్ష పండే అవుతున్నది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో 2015 నాటికి సాధించవలసిన 8 లక్ష్యాలను 'సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు' పేరుతో సాధించటానికి ప్రయత్నం చేయటం అందరికీ తెలిసిన విషయమే. అందులో మూడవ లక్ష్యం 'స్త్రీ, పురుష సమానత్వం, మహిళా సాధికారత సాధన'. ప్రస్తుతం భారతదేశంలో మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను చూస్తూ వుంటే 2015 నాటికి భారతదేశం ఈ లక్ష్యాన్ని సాధించడం అనుమానాస్పదంగానే కనపడుతుంది. ఎందుకంటే ఏ ఏటి కాయేడు మహిళల పట్ల జరుగుతున్న నేరాల సంఖ్య పెరుగుతూనే వుంది. వాటిని అరికట్టే చర్యలు మాత్రం నానాటికీ తీసికట్టు, నాగంభొట్లుగా వున్నాయి.

ఈ 21వ శతాబ్దంలో కూడా ఇంతటి అనమానతను ఎదుర్కొంటున్నామంటే ఇందుకు కారణాలుగా పై ప్రశ్నలతోపాటు ఈ క్రింద వాటిని కూడా చెప్పుకోవచ్చును.

- ☆ సమాజంలో మహిళల పట్ల వున్న చిన్న చూపు.
- ☆ పితృస్వామ్య వ్యవస్థ తాలూకు అసమాన పోకడలు.
- ☆ ఎంత ఎదిగినా మహిళలు అబలలేనన్న భావన.
- ☆ తరాలు మారుతున్నా స్త్రీల పట్ల మారని పూర్వపు భావనలు.
- ☆ స్త్రీలు వంటగదికి, పడకటింటికి మాత్రమే పరిమితమనే ఛాందసవాదుల అభిప్రాయాలు.
- ☆ స్త్రీలు పురుషుల కంటే అన్ని విధాలుగా తక్కువనే భావన.
- ☆ సమాజం స్త్రీ, పురుషులకు నిర్దేశించిన అసమాన పాత్రలు
- ☆ శతాబ్దాలు గడుస్తున్నా మారని స్త్రీ, పురుషుల ఆలోచనా ధోరణులు.

స్త్రీ, పురుష బేధం లేకుండా రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ఇచ్చిన హక్కులు కూడా మహిళల విషయంలో కాలరాయబడుతున్నాయి. చదువుకున్న మహిళలు తమ హక్కులను కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటే అణచివేతకు గురవుతున్నారు. అదే మారుమూల గ్రామీణ మహిళలకైతే తమకూ హక్కులున్నాయన్న విషయం చాలా మందికి ఇంకా తెలియదు. కొద్దో గొప్పో తెలిసిన వారు కూడా సమాజం సృష్టించిన జెండర్ మూస పాత్రల ఒరవడిలోపడి తమ జీవితాలను వెళ్ళదీస్తున్నారు.

అయితే జీవితంలో ఏదో ఒక ఘట్టంలో హింసను ఎదుర్కొంటూ తమలో తామే కుమిలిపోయే మహిళలు కూడా 'ఢిల్లీ గ్యాంగ్ రేప్' బాధితురాలి విషయంలో తమ గళాన్ని జత కలిపారు. ఆమెకు న్యాయం జరగాలంటూ ఆక్రోశం చెందుతున్నారు. అందుకు తగిన చట్టాన్ని తయారు చేసి ఆమె పేరు పెట్టాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దోషులకు మరణ శిక్ష విధించాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దోషులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. వీటన్నింటి వల్ల మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలు సమసిపోతాయా లేదా అనేది తప్పని సరిగా ప్రతి ఒక్కరూ ఆలోచించవల సిన విషయం.

ఇదంతా నాణేనికి ఒక వైపు అయినట్లయితే, మరోవైపు చూసినట్లయితే ఈ సంఘటనలో నిందితులుగా గుర్తించబడిన వారిలో ఒకరు మైనర్

# మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా అపార్డ్ సిబ్బంది ప్రదర్శన

**దేశ రాజధానిలో సామూహిక అత్యాచారానికి గురైన 'నిర్భయ' మృతి నేపథ్యంలో మహిళలకు రక్షణ కల్పించే చట్టాల అమలుపై ప్రభుత్వం తక్షణమే సమీక్షను చేపట్టాలని, నిందితులకు తగు శిక్ష సత్వరమే విధించాలని కోరుతూ ఎ.ఎమ్.ఆర్ అపార్డ్ సిబ్బంది ర్యాలీ చేశారు. అత్యాచారానికి గురైన నిర్భయకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధితురాలి మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించారు.**

ఈ సందర్భంగా అపార్డ్ కమీషనర్ శ్రీ కె.చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ, ఈ సంఘటనపై యావత్తు భారత ప్రజానీకం మౌనంగా రోదిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు ఢిల్లీ గ్యాంగ్ రేప్ ఉదంతం దేశాన్ని కుదిపేస్తుంటే, మరోవైపు మరెన్నో అఘాయిత్యాలు వెలుగు చూస్తూనే ఉన్నాయన్నారు. దీనికి నిదర్శనంగా ఈ సంఘటన తరువాత దేశం మొత్తం మీద మహిళలపై దాదాపు 16 అత్యాచార సంఘటనలు జరిగాయని, అందులో 4 సంఘటనలు ఆంధ్రప్రదేశ్‌లోనే జరగడం చాలా బాధాకరమైన విషయం అని ఆయన తెలిపారు.

ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని, అందుకే సమాజంలో ఇటువంటి సంస్కృతిని పెంపొందించేందుకు వీలుగా 30,000 మంది సుశిక్షితులైన భారత్ నిర్మాణ్ వాలంటీర్లను అపార్డ్ తయారు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున అపార్డ్ సిబ్బంది ర్యాలీ చేపట్టడం చాలా సంతోషదాయకమని చెప్తూ, ర్యాలీలో పాల్గొంటున్న 500 మంది ఒక్కొక్కరు 5 గురి చొప్పున వారి వారి గ్రామాల్లో బి.ఎన్.వి.లుగా తయారుచేస్తే, వారే గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా బాధ్యత తీసుకుంటారని శ్రీ చంద్రమౌళి తెలిపారు.

ఈ సంఘటనను ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో జరిగిన సంఘటనగా తీసుకుని, సమాజంలో మార్పు తీసుకురావాలని ఆయన సందేశాన్నిచ్చారు. దేశంలో మహిళల రక్షణకు పెనుమార్పులు తేవలసిన ఆవశ్యకతను ఈ ఉదంతం చాటి చెబుతోందన్నారు. తదుపరి అపార్డ్ సిబ్బంది తలపెట్టిన ర్యాలీని తెల్ల జెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం సిబ్బంది అపార్డు కార్యాలయం నుండి రాజేంద్రనగర్ ప్రధాన మార్గాల గుండా ప్లకార్డులు చేత బుచ్చుకొని, నినాదాలు చేస్తూ రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పించారు.








ఈ కార్యక్రమంలో అపార్డ్ సిబ్బంది, శిక్షణకు విచ్చేసిన శిక్షణార్థులు, టిస్ విద్యార్థినీ విద్యార్థులు, మొత్తం 500 మంది వరకు పాల్గొన్నారు. ◆

బాలుడన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ముక్కు పచ్చలారని పిల్లలు కూడా యిటువంటి అరాచకాలకు పాల్పడుతున్నారు, భాగస్వాములవుతున్నారంటే ఎక్కడుంది లోపం అనే విషయాన్ని కూడా ప్రతి ఒక్కరూ పునరాలోచించుకోవలసిన పరిస్థితుల్లో మనమున్నాం. జరుగుతున్న అరాచకాలన్నింటికీ కలసికట్టుగా అందరమూ బాధ్యులమే. కాదంటారా?

భవిష్యత్తులోనైనా ఈ సమస్యలు ఉత్పన్నం కాకుండా వుండాలంటే, ప్రస్తుతం మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలు సమసిపోవాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ అంటే స్త్రీలు, పురుషులు, యువతరం, వృద్ధులు అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరి ఆలోచనా ధోరణిలోనూ మార్పు వచ్చినపుడే ఇది సాధ్యమౌతుంది. ఈ మార్పును తీసుకుని రావడానికి అవసరమైన వివిధ అంశాలపై ముఖ్యంగా విలువలపై అవగాహనా కార్యక్రమాలను, సదస్సులను ఊరూరా, వాడ వాడా ప్రభుత్వ, ప్రభుత్వేతర, విద్యా సంస్థలతోపాటు బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ నిర్వహించాలి, పాల్గొనాలి. అపుడే మనమందరమూ కలలు కంటున్న స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించగలుగుతాము. మన భావితరాలకు విలువలతో కూడిన సమ సమాజాన్ని అందించ గలుగుతాము.

మరి ప్రస్తుతం అరాచకాలకు గురైన బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవటంతో పాటు, దోషులకు కఠిన శిక్షలు విధించటం ద్వారా మరొకరు అటువంటి దురాగతాలకు పాల్పడకుండా చూసినపుడే మహిళల పట్ల జరుగుతున్న అరాచకాలను అరికట్టగలుగుతాం.

ఇదే నాటి విశాఖ, నేటి నిర్భయలకు మనమర్పించే నిజమైన నివాళి.

*- జి. సత్యవాణి, ఫ్యాకల్టీ మెంబర్, ఎ.ఎం.ఆర్ -అపార్డ్*




# ఇందిర జలప్రభ ద్వారా 6 లక్షల పేద, దళిత, గిరిజన కుటుంబాలలో చిరునవ్వుల కళకళ

**అక్టోబర్ 2, 2011న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి 'ఇందిర జలప్రభ' అనే కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎర్రగొండ పాలెం మండలం, కాసిగండ్ల తండాలో ప్రారంభించారు. ఈ పథకంలో ఉపాధి హామీ నిధులు, నాబార్డు నిధులు కలిపి మూడు సంవత్సరాల వ్యవధిలో సుమారు రూ. 1838 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు.**



మన రాష్ట్ర ప్రభుత్వం బీడు భూములకు సాగు నీరు అందించి, వ్యవసాయానికి అనుకూలంగా మార్చిన భూమి నుంచి అధికంగా పంట దిగుబడి సాధించాలని కృషి చేస్తోంది. తద్వారా దళిత, గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచి, వారి సామాజిక స్థాయిని, గుర్తింపును పెంచే ప్రయత్నంగా నిరుపేదల బతుకులో వెలుగు నింపిన పేదల పెన్నిధి దివంగత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ స్ఫూర్తితో బృహత్తర 'ఇందిర జల ప్రభ' పథకాన్ని రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది.

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకంతో పాటు 'నాబార్డు' నిధులు కూడా జత చేసి, రాష్ట్రంలోని 22 జిల్లాలు, 895 మండలాలు, 16,472 గ్రామాల్లో ఆరు లక్షల దళిత, గిరిజన రైతు కుటుంబాలకు చెందిన 38000 బ్లాకులను గుర్తించి, 10 లక్షల ఎకరాల బీడు భూములను, అల్ప ఉత్పాదక భూములను సాగునీటితో సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.



రూ. 1838 కోట్ల రూపాయల భారీ వ్యయంతో, ఒక లక్ష నీటి వనరులు - బావులు, బోరుబావులు, ఫిల్టర్ పాయింట్లు ఏర్పాటు చేసి, చిన్న స్థాయి ఎత్తి పోతల పథకాలను ప్రారంభించి, పంపు సెట్లు కొనుగోలు చేసి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి భూములను తడిపే భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

## ఇందిర జలప్రభ పథకాలు - బంగారు భవిష్యత్‌కు పునాదులు

రాళ్ళు రప్పలతో నిండి, పంటలు పండకుండా, ఎండి నెర్రెలు దేలిన బీడు భూములను బంగారు పంటల సౌభాగ్య సీమలుగా మార్చేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని ఆచరణలోకి తెచ్చిన మహా ప్రజాపథకం 'ఇందిర జలప్రభ'.

మరి పాతాళ గంగను ఇలా తోడేస్తే నేల తల్లి వేడెక్కదా? భూమాత కడుపులోని నీళ్లన్నీ ఇంకిపోవా? అందుకే నీరు తోడే ప్రతి బోరు, ప్రతి బావి సమీపంలో, భూగర్భ జలాలను పెంచే నిర్మాణాలు చేపడుతున్నారు. కురిసే వర్షంలోని ప్రతి నీటి చుక్కను, ఏ చేనుకు ఆ చేనులోనే నేల తల్లి కడుపులోకి పంపే ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల మనకూ, రానున్న తరాల వారికి కూడా భూగర్భ జలాల కొరత లేకుండా ఉంటుంది. నీటని పొదుపుగా వాడుకునేందుకు డ్రిప్ (బిందు) సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను అవలంబించాలి. నీటిని తక్కువగా వినియోగించుకునే పండ్ల మొక్కలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల వంటి అరు తడి పంటలు వేసుకోవడానికి ఎక్కువగా అలవాటు పడాలి.



మీ జీవితాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, మీ జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగు పరిచే 'ఇందిర జలప్రభ' తో కలిసి అడుగులు వేయాలి.

## ఇందిర జలప్రభ ఉద్దేశ్యాలు

- ★ షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అసైన్డ్, వ్యక్తిగత భూములను సాగుకు అనువుగా అభివృద్ధి పరచడం.
- ★ నీటి వసతుల కల్పన ద్వారా భూములలో ఉత్పాదకత పెంచుకునే విధంగా తయారు చేయడం.
- ★ సహజ వనరులను సక్రమంగా వినియోగించుకునే దశలో మైక్రో ఇరిగేషన్ పద్ధతులైన బిందు సేద్యం, తుంపర సేద్యం విధానాల ను అమలు చేయడం.
- ★ సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి, నేలలో తేమ సంరక్షణ, ఆహార భద్రతలను అందించే విధంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆదాయాలను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపికచేసి, సమిష్టి వ్యవసాయ విధానాలను అనుసరించేలా లబ్ధిదారులను ప్రోత్సహించడం.
- ★ నీటి వనరులను సమిష్టిగా ఉపయోగించుకుని ఉమ్మడి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం.

## ప్రాధాన్యతలు

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, బంజరు భూములు, సాగులో వున్న పట్టా భూములు, ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పరచిన సొంత భూములను తీసుకుంటారు.

## ఆశిస్తున్న ఫలితాలు

- ★ పథకం పరిధిలోని భూములు చెట్ల పచ్చదనంతో నిండి, భూముల ఉత్పాదకతను పెంపొందించటానికి అవసరమైన అన్ని పనులు చేపట్టే పరిస్థితి ఉండాలి.

★ పథకం పరిధిలోని భూములన్నీ కుటుంబ ఆహారం, వంట చెరుకు, పశుగ్రాసం వంటి అవసరాలను తీర్చేలా పశుపోషణతో కూడిన వైవిధ్య వ్యవసాయ విధానాల్లో ఉంటాయి.

★ జీవనోపాధులు పెంపొందించడం, వలసలు పూర్తిగా తగ్గించడం, ఏడాదికి ఎకరానికి రూ. 25,000 తగ్గకుండా ఆదాయం పెంపొందించడం.

### ఇందిర జలప్రభలో చేయాల్సిన పనులు

*1. బోరు బావి తవ్వకం :* ప్రభుత్వం నియమించిన జియాలజిస్టుల ద్వారా ముందుగా భూగర్భజల వనరుల కోసం సమగ్ర సర్వే చేయించి బోరుబావి పాయింట్లను గుర్తిస్తారు. తర్వాత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న రిగ్గుల ద్వారా బోరు బావి తవ్విస్తారు. బోరుబావి తవ్విన తర్వాత దాని నీటి సామర్ధ్యానికి సంబంధించిన కొలతలను జియాలజిస్టులు తీసుకుంటారు. దీని వలన సరైన పంపు సెట్లు ఎంపిక చేసుకోవడానికి వీలవుతుంది.

*2. కరెంటు సరఫరా అందించడం :* ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థ ద్వారా కరెంటు సరఫరా చేయబడుతుంది. బోరుబావి తవ్విన తర్వాత, ఆ బోరు సామర్ధ్యం పంపు సెట్టు అమర్చుకోవడానికి సరిపోతే, విద్యుత్ సంస్థ, విద్యుత్ సరఫరాకు కావలసిన అంచనాలు తయారు చేస్తుంది. దీని కోసం అవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్ ఫార్మర్ మొదలైనవన్నీ ఏర్పాటు చేస్తారు.

*3. పంపు సెట్లు అమర్చడం :* విద్యుత్ సరఫరా పూర్తయిన తర్వాత పంపు సెట్లు కొనుగోలు చేసుకోవచ్చును. పంపు సెట్టుకు అవసరమైన హెచ్.పి., స్టేజిని జియాలజిస్టులు తెలియజేయాలి.

*4. భూమి అభివృద్ధి పనులు :* ఉపాధి హామీ పథకం ద్వారా భూమి అభివృద్ధికి సంబంధించిన పనులన్నీ చేస్తారు. వివిధ పనులు, ఈ క్రింది విధంగా ఉంటాయి.

★ ముళ్ళ పొదల తొలగింపు

★ బండరాళ్ళ తొలగింపు

★ గులక రాళ్ళ తొలగింపు

★ భూమిని చదును చేయడం

★ లోతుగా దుక్కి దున్నటం

★ సారవంతంగా లేని భూములకు ఒండ్రు మట్టిని తరలించడం.

★ రాతి కట్టలు

  ★ మళ్లింపు కాలువలు

  ★ రాక్ ఫిల్ డ్యాం

  ★ ఫారం పాండ్ / నీటి కుంట

  ★ చిన్న కుంటలు

  ★ ఎరువు గుంతలు

  ★ సరిహద్దు కింద కాలువ గట్టుపై మొక్కలు నాటడం.





*5. పండ్ల మొక్కల పెంపకం:* పై పనులన్నీ పూర్తయిన తర్వాత నేల స్వభావాన్ని బట్టి దానికి అనుకూలమైన పండ్లతోట నిర్ణయిస్తారు. కావలసిన మొక్కలు, వాటిని నాటు కోవడానికి కావలసిన ఏర్పాట్లు పథకం ప్రకారం చేస్తారు. మూడు సంవత్సరాల వరకు పండ్ల తోటలకు కావలసిన సహకారాన్ని పథకం ద్వారా అందిస్తారు.

*6. సూక్ష్మ సేద్యం:* కావలసిన బిందు/తుంపర సేద్యం కూడా ఈ పథకంలో సమకూర్చుతారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలంటే సూక్ష్మ సేద్యం చాలా అవసరం.

### ఉమ్మడి ప్రయోజనాల బృందం (సిఐజి/లు)

ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి పని చేసుకోవడం చాలా అవసరం. కాబట్టి పథకం అమలవుతున్న బ్లాకులలోని లబ్ధిదారులందరూ ఒక ఉమ్మడి సంఘంగా ఏర్పాటు కావలసిన అవసరం ఉంది. ఈ ఉమ్మడి చర్య ద్వారా బ్లాకుల్లో ఉన్న భూమి యజమానులందరినీ కలిపి అందరికీ ఆమోదయోగ్యమైన గ్రూపు ఏర్పాటు చేయాలి. వీటినే ఉమ్మడి ప్రయోజనాల బృందం లేదా సిఐజిలు అంటారు.

### ఉమ్మడి ప్రయోజన బృందాల విధులు-బాధ్యతలు

★ సిఐజిలు 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలి.

★ తమ బ్లాకులో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షిస్తూ,

జరగాల్సిన పనులను ప్రణాళికల ద్వారా తయారు చేసుకోవాలి.

- బోరు బావి వినియోగదారుల సంఘాలను (బియుజి) సరియైన సమయంలో సమన్వయ పరచాలి.
- బ్లాకులోని సభ్యులందరూ, నీటి వనరులని ఉమ్మడిగా వినియోగించుకోవడానికి ఒక ఒప్పందం చేసుకోవాలి.
- బియుజి గ్రూపులు తమ నిధులను సక్రమంగా విని యోగించుకొంటున్నదీ, లేనిదీ పర్యవేక్షణ చేసుకోవాలి.
- బియుజి వారు తమ భూములలో వేసే పంటలు ఎంపిక చేసుకొనే సమయంలో ఎక్కువ నీరు వినియోగించుకొనే పంటలు ఎంపిక చేసుకోకుండా తక్కువ నీటి వినియోగం, ఎక్కువ (అరుతడి పంటలు వేయండి - అధిక లాభాన్ని పొందండి) ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకునే విధంగా బియుజి వారికి అవగాహన కల్పించాలి.





## బోరు బావి వినియోగదారుల సంఘం

ఒక బ్లాకులోని లబ్ధిదారులందరూ ఒక గ్రూపుగా ఏర్పాటు అవుతారు. అలాగే ఒక బోరుబావికి ఎంత నీటి లభ్యత ఉన్నదో అంచనా వేసుకుని ఆ నీటి ద్వారా ఎంత భూమిని సాగుచేయవచ్చునో ఆ బ్లాకు పరిధిలోని రైతులందరూ ఆ బోరుబావి క్రింద గ్రూపులుగా ఏర్పడాలి. వీరినే ఆ బోరు బావికి సంబంధించిన 'బోరుబావి' వినియోగ దారుల సంఘాలుగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. వీటినే బియుజిలు అంటారు. ('జల సంరక్షణ చేపట్టు- నీటి కరువును తరిమి కొట్టు')

## బియుజి గ్రూపుల నిర్వహణ

- ప్రతి 15 రోజులకు ఒక సారి సమావేశాలు నిర్వహించడం.
- బోరుబావిని బట్టి ఏర్పడిన సంఘాలు ప్రతి ఒక్కటి ఒక్కొక్క బ్యాంకు ఖాతా నిర్వహించాలి.
- బియుజి గ్రూపులను ఏర్పాటు చేసుకున్న తర్వాత గ్రూపుకు ఇద్దరు లీడర్లను ఎన్నుకొని గ్రూపునకు ఒకే పేరు నిర్ణయించుకోవాలి.

'ఇందిర జలప్రభ' ద్వారా రాష్ట్రంలో 22 జిల్లాలలో 46,575 బ్లాకులు చేసి (ప్రభుత్వ జి.ఓ ప్రకారం -315), 10 లక్షల ఎకరాల ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములు తీసుకోవడం జరిగింది. 1,88,124 మంది ఎస్సీ, రైతులకు 3,94,956 ఎకరాలు, తీసుకోవడం జరిగింది. ఎస్.టి రైతులు 1,31,194 మందికి 3,78,657 ఎకరాలు, ఇతరులకు 276 మంది రైతులకు 836 ఎకరాలు, మొత్తం 7,74,450 ఎకరాలను ఇప్పటి వరకు గుర్తించడమైనది.

ఇప్పటి వరకు 12117 బోర్‌వెల్స్, 931 ట్యూబ్‌వెల్స్, ఓపెన్ వెల్స్ 119, ఫిల్టర్ పాయింట్స్ 49, మొత్తం 13223 నీటి సౌకర్యం కోసం అంచనాలు చేయడము జరిగింది. అందులో నుండి 9593 బోరుబావులు, ట్యూబ్‌వెల్. 862, ఓపెన్ వెల్స్ 45, మొత్తం 10,573 వనరులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు ఇచ్చారు.

గ్రౌండ్ వాటర్ సర్వే 176 క్లస్టర్లకు గాను 167 క్లస్టర్లలో సర్వే పూర్తి చేశారు. ఇప్పటి వరకు 1010 మండలాలలో 688 మండలాలలో పూర్తి చేయడం జరిగింది. 20,194 గ్రామాలకు గాను 24,298 సర్వే పాయింట్స్ పూర్తి చేయడం జరిగింది.

రాష్ట్రంతో మొదటి దశ క్రింద నాబార్డ్ నుండి 400 కోట్లకు గాను, 80 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో నుండి 67 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు నాబార్డ్, ఇజిఎస్ నిధులు రూ. 151 కోట్లు ఖర్చు చేశారు.

ఇప్పటి వరకు 8,700 బోర్లు డ్రిల్లింగ్ చేస్తే, అందులో నుండి 1200 బోర్లు విఫలమయ్యాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1200 మోటార్లు బిగించి పంటలు కూడా పండించుకున్నారు.

రాష్ట్రంలో పేద రైతులు, దళిత, గిరిజన రైతులు వలసపోకుండా బీడు భూములకు సాగునీరు అందించి, వ్యవసాయానికి అనుకూలంగా మార్చిన భూమి నుంచి అధికంగా పంట దిగుబడి సాధించాలని కృషి చేస్తూ, తద్వారా దళిత, గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచి, వారి సామాజిక స్థాయిని పెంచి, నిరుపేదలకు బతుకులో వెలుగు నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. కావున రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ఎదగడానికి పాటుపడాలి.

*- ఎమ్. మొగలయ్య, ఎమ్.యస్.సి (అగ్రికల్చర్)*
*ఫ్యాకల్టీ, సిఎన్ఆర్ఎం, అపార్డ్*

# గ్రామీణ యువతకు సోషల్ ఆడిట్‌పై సర్టిఫికెట్ కోర్సు




**గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువతలో ఉపాధి నైపుణ్యాలను పెంపొందింపచేసే ప్రక్రియలో భాగంగా, సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ మరియు పారదర్శకతా సంస్థ మరియు అపార్డు, ఇ.జి.ఎం.ఎం. లు సంయుక్తంగా ఒక క్రొత్త కోర్సుకు శ్రీకారం చుట్టాయి. ఈ శిక్షణా కాల పరిమితి 21 రోజులు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమంపై అవగాహన కల్గించటంతో పాటు, వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్గించే విధంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.**

ఈ శిక్షణా కాలం పూర్తయిన తదుపరి సామాజిక తనిఖీ మరియు రాజీవ్ యువకిరణాలు కార్యక్రమాలలో వీరికి ఉపాధి కల్పించి వీరి సేవలను ఉపయోగించుకోవడానికి రాష్ట్రగ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది. 3 వారాల పాటు జరిగే ఈ కోర్సులో గ్రామీణ యువతకు వివిధ పాఠ్యాంశాల బోధన, కంప్యూటర్ అవగాహనతో పాటు క్షేత్ర పర్యటనలు కూడా నిర్వహిస్తారు. ఈ శిక్షణా కార్యక్రమ ప్రారంభానికి గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి శ్రీ ఆర్. సుబ్రమణ్యం, ఐ.ఎ.ఎస్., అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్. గ్రామీణాభివృద్ధి కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్, ఐ.ఎ.ఎస్., లు హాజరైనారు.

ఈ సందర్భంగా శ్రీ ఆర్. సుబ్రమణ్యం మాట్లాడుతూ, సామాజిక తనిఖీ ద్వారా ఉపాధి హామీ పథకంలో ఒక సామాజిక మార్పు రావాలని, అది గ్రామాల్లో ఉన్న యువత ద్వారానే సాధ్యపడుతుందని తెలిపారు. ప్రశ్నించడం ద్వారా రాజ్యాంగ పరంగా, చట్టపరంగా ప్రజల హక్కులు ఏవైతే ఉన్నాయో అవి వారు దక్కించుకోగల్గుతారని, అందుకు యువత



గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని పిలుపిచ్చారు. ఉపాధి హామీ పథకంలో నిస్వార్థంగా అమలవుతున్న సామాజిక తనిఖీ అనేక శాఖలు అమలు పర్చి వాళ్ల కార్యక్రమాలను మెరుగు పర్చుకునేందుకు ప్రణాళికలు తయారుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఏమేమి పనులు జరిగాయి, వాటికి ఎంత మొత్తంలో చెల్లింపులు జరిగాయి, అవి ఎవరెవరికి అందాయి మొదలగు విషయాలు గ్రామీణాభివృద్ధి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని పర్యవేక్షణ చేయాలని సూచించారు. పర్యవేక్షణతోనే మంచి పరిపాలన అందించగలమని ఆయన తెలిపారు.

అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, ఈ దేశానికి గొప్ప భవిష్యత్తు ఉందని, అది అందిపుచ్చుకునే సత్తా ఒక యువతలోనే ఉందని అన్నారు. గ్రామీణ యువతీ, యువకులు పూనుకుంటే గ్రామాన్ని అభివృద్ధి పథంవైపు తీసుకెళ్ళగలరని తెలిపారు. కీ - క్యాప్ లో భాగంగా అపార్డు తయారు చేసిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వారి వారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, మీరు కూడా ఒక్కొక్కరు ఒక్కో భారత్ నిర్మాణ్ వాలంటీర్ వలే పనిచేసి మీ మీ గ్రామాల్ని ముందుకు తీసుకెళ్ళాలని సూచించారు. శిక్షణా సంస్థలో తీసుకున్న శిక్షణను కార్యాచరణలో పెట్టడానికి శిక్షణా సంస్థలోనే ఒక అభిప్రాయానికి శిక్షణార్థుడు రాగలిగితే, అది అమలు చేయటం సులభం అవుతుందన్నారు. యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నాక అది సాధించేవరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, విద్య పరిశుభ్రత పోషకాహారం, త్రాగునీరు, జండర్, పర్యావరణం మొదలగు అంశాలపై యువత దృష్టి సారించాలని ఆయన సూచించారు.

గ్రామీణాభివృద్ధి కమీషనర్ శ్రీ శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ, తప్పు జరిగినప్పుడు ధైర్యంగా మాట్లాడి తప్పును ఖండించాలని సూచించారు. నైపుణ్యతతో కూడిన శిక్షణ పొందితే అది జీవితాంతం తోడుంటుందని, జీవితాంతం ఎదుగుదలకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాజీవ్ యువకిరణాలు సి.ఇ.ఓ శ్రీ రఘునందనరావు ఐ.ఎ.ఎస్., ఎన్.ఐ.ఆర్.డి. ప్రొఫెసర్ హనుమంత రావు, సోషల్ ఆడిట్ సంస్థ డైరెక్టర్ కుమారి సౌమ్య, అపార్డు జాయింట్ డైరక్టర్ డా॥ నాగరాజు, సెంటర్ హెడ్స్ డా॥ లక్ష్మీపతి, శ్రీమతి ఉషారాణి, ఫాకల్టీ సభ్యులు ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా కముజువాని లంక గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందచేస్తున్న బి.ఎన్.విలు, ఎంపి.డి.ఓ. రాంబాబు



మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు కార్యాలయంలో స్వామి వివేకానంద 150వ జన్మ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న బి.ఎన్.విలు.





కరీంనగర్ జిల్లాలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నిరోధానికి వేసిన నిర్భయ కమిటీల శిక్షణలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా బి.ఎన్.వి.లు, సి.ఇ.ఒ, జిల్లా పరిషత్

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల







కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఇటీవల నిర్వహించిన భారత్ నిర్మాణ్ పౌర సమాచార ఉత్సవంలో పాల్గొనటమే కాక, ఈ ఉత్సవాలలో ప్రత్యేక స్టాల్‌ని ఏర్పాటు చేసిన బి.ఎన్.వి.లు



భారత్ నిర్మాణ వాలంటీర్లను ప్రోత్సహిస్తున్నందుకు కీ క్యాప్, లాండ్ టు ల్యాండ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు 64వ రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ఎంపిడిఓ అవార్డును అందుకుంటున్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఎం.పి.డి.ఓ శ్రీ కె. యాదయ్య






విజయనగరం జిల్లా ఇద్దనవలస గ్రామంలో ఉచిత వైద్య శిబిర నిర్వహణకు సహకరిస్తున్న వాలంటీర్లు & గ్రామసభ నిర్వహణలో తోడ్పడుతున్న బి.ఎన్.వి.లు



కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలంలోని బి.ఎన్.వి.లు చేసిన అవగాహనా ర్యాలీ దృశ్యం

# అపూర్వ విజయాలు



అనాధలకు అండగా నెల్లూరు జిల్లా ఈడగాలి గ్రామంలో గుప్పెడు బియ్యం సేకరిస్తున్న బి.ఎన్.వి.లు



నల్గొండ జిల్లా తాళ్ళ ఖమ్మం పహాడ్ గ్రామంలో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహణలో తోడ్పడుతున్న బి.ఎన్.వి.లు

శ్రీకాకుళం జిల్లా కొమర్తి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ప్రమాద బీమా కార్యక్రమం గూర్చి ప్రచారం చేస్తున్న బి.ఎన్.వి.లు



# 64వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బి.ఎన్.వి. లపై ప్రశంసల జల్లులు



నల్గొండ జిల్లా కలక్టరు శ్రీ ముక్తేశ్వరరావు ఐ.ఏ.ఎస్. నుండి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న నల్గొండ జిల్లా తాళ్ళ ఖమ్మం పహాడ్ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్.



కర్నూలు జిల్లా కలక్టరు శ్రీ సుదర్శన రెడ్డి ఐ.ఏ.ఎస్. నుండి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న రుద్రవరం మండలం కోరుకొండ గ్రామం, భారత్ నిర్మాణ్ వాలంటీర్ శ్రీమతి చెంచు నాగమ్మ



తూర్పుగోదావరి జిల్లా కలక్టరు శ్రీమతి నీతూ కుమారి ప్రసాద్ ఐ.ఏ.ఎస్. నుండి అవార్డు అందుకుంటున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్



విజయనగరం జిల్లా సి.ఇ.ఓ. శ్రీ ఎన్. మోహనరావు నుండి అవార్డు అందుకుంటున్న నోంద్రుకోన, గుమ్మ లక్ష్మీపురం మండలం బారత్ నిర్మాణ్ వాలంటీర్ ఎన్. శంకర రావు



64వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా యంత్రాంగం నుండి అవార్డులు అందుకొన్న రంగారెడ్డి జిల్లా ఎం.పి.డి.ఓ.లు, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు





## మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే

### మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !

రాదని, ఉపాధి హామీ నిరంతరంగా వుండదని, తాము నమ్ముకున్న పొలం పనులే జీవనానికి సరైన మార్గమని గ్రామ ప్రజలు నమ్ముతున్న దశలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఈ గ్రామంలో చక్కని అవగాహన కలిగించటానికి నడుం బిగించారు.

ఇంటింటికీ తిరిగి, ఉపాధి హామీ గొప్పతనం గురించి, కూలీలకు జరిగే మేలు గురించి, పథకం పట్ల అవగాహన గురించి విస్తృత ప్రచారాన్ని జరిపారు. ఫలితంగా 20-30 మంత్రి కూలీల హాజరుతో నిద్రావస్థలో వున్న పథకం బి.ఎన్.విల ద్వారా రోజుకు 200 మంది కూలీలతో ఒక్కసారిగా ఊపందుకుంది. గ్రామంలో ప్రతి కూలీ ఈ కార్యక్రమంలో పాల్గొని మంచి దినసరి కూలి వేతనం పొందడమే కాకుండా గ్రామంలోని వనరుల సంరక్షణ, ఆస్తుల సంరక్షణ చేపట్టారు.

ఒకప్పుడు గ్రామంలో పరిశుభ్రత ఆమడ దూరంలో కన్పించేది. సాయంత్రం వేళ దోమల రొద తప్ప మరొకటి వినిపించేది కాదు. ఎక్కడ అపరిశుభ్రత అక్కడే పేరుకుపోయి ఉండేది. కుళాయిల నుండి వృధాగా పోయే నీటితో గ్రామంలో వీధులు నిండిపోయేవి. ప్రభుత్వ పథకాలు ఎన్ని వున్నా సరైన మార్గదర్శకం లేక, వాటిని వినియోగించుకోక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యేవారు.

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో అందరికీ ఉపాధి





**దేశానికి పట్టు కొమ్మలు గ్రామాలు, గ్రామభివృద్ధే దేశాభివృద్ధి. గ్రామాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రజలకు చేరాలి. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలన్నా, గ్రామ సమస్యలు పరిష్కారం కావాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా ప్రభుత్వ కృషికి గ్రామస్తుల స్వచ్ఛంద సేవ కూడా తోడయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని నిరూపించారు - ప్రకాశం జిల్లా మాదాలవారిపాలెం భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పట్ల ఈ గ్రామంలో సరైన అవగాహన లేక ప్రజలు అర కొర జీవనోపాధులపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామంలో 323 జాబ్ కార్డులు ఉన్నా ఉపాధి హామీ పనులు నామమాత్రంగా వున్నాయి. పనికి వెళితే సరైన కూలి

ఈ తరుణంలో వాలంటీర్లు గ్రామంలో మురికిని తొలగించటానికి పంచాయితీ సర్పంచ్ సారధ్యంలో నడుంబిగించారు. ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా విరాళాలు సేకరించి మురికి కాలువలు నిర్మించడం ప్రారంభించారు. గ్రామస్థులు ఒక్కొక్కరిగా వచ్చి సహకరించడం ప్రారంభించారు. రోజులు గడిచే కొద్దీ చక్కని మురికి కాల్వలు నిర్మాణమయ్యాయి.

ఈ విధంగా గ్రామంలో అనుకున్న కార్యక్రమాలను పూర్తిచేసి ఇంకా చేయవలసిన కార్యక్రమాలకు ప్రణాళికలు చేపడుతూ విజయపరంపర దిశగా కొనసాగుతూ బిఎన్‌విలు గ్రామాన్ని పురోగమనం దిశగా పయనింపజేస్తున్నారు. సంపూర్ణ పారిశుద్ధ సాధన దిశగా అడుగులు వేస్తున్న ఈ గ్రామం త్వరలోనే నిర్మల్ గ్రామ పురస్కారాన్ని అందు కుంటుందని ఆశిద్దాం. ■



# కేవలం 9 నెలల్లో గ్రామ స్వరూపాన్ని మార్చి వేసిన కొటాల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు









**మూలం దొరికితే భూమిని సైతం అరచేతితో పైకెత్తుతాం. మార్గం దొరికితే పట్టుదలతో ఏదైనా సాధించి ప్రగతి మార్గాన పయనిస్తాం అంటూ మట్టిలో మాణిక్యాల్లా, ఆరితేరిన సైనికుల్లా విజయపరంపరను కొనసాగిస్తున్నాయి. చంద్రగిరి మండలంలో కోటాల మరియు పాండురంగా వారి పల్లె గ్రామాలు. 2010-11 కి పూర్వం ఈ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ఎన్నో అమలు జరుగుతున్నా అవగాహనలేమితో అభివృద్ధికి దూరమైన గ్రామ ప్రజల్లో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఒక్కసారిగా చైతన్యం కలిగించి గ్రామ రూపురేఖల్ని మార్చేశారు.**

ఒకప్పుడు కోటాల గ్రామం నుండి చంద్రగిరి గుండా తిరుపతికి వెళ్ళే రోడు మార్గం పాడవడంతో ఈ మార్గంలో బస్సు సౌకర్యం నిలిచిపోయింది. దీంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు, ఉన్నత విద్యకు కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు, మహిళలు అనేక ఇబ్బందుల పడేవారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చొరవ తీసుకొని అధికారుల ద్వారా రోడ్డు మార్గానికి మరమ్మత్తులు చేయించి నిలచిపోయిన బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు. దీంతో వ్యాపారులకు, విద్యార్థులకు, గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగింది. ఎన్.టి.ఆర్.ట్రస్ట్, గ్రామస్తుల ఆర్థిక సహాయంతో గ్రామంలో 3000 లీటర్ల కెపాసిటి గల ఆర్.ఓ. ప్లాంట్‌ను బి.ఎన్.విలు ఏర్పాటు చేసారు. దీని ద్వారా 20 లీటర్లు శుద్ధి చేసిన నీటిని మొత్తం గ్రామ పంచాయితీలో కుటుంబాలకు కేవలం 3 రూపాయలకే అందజేయడం జరుగుతోంది. పాండురంగవారి పల్లెలో బి.ఎన్.వి. లు స్వంతంగా విరాళాలు సేకరించి వివేకానంద లైబ్రరీని 1000 పుస్తకాలతో ఏర్పాటు చేసుకున్నారు. దానికి కావలసిన అలమరాలు, కుర్చీలు, ఫ్యాన్లు, పుస్తకాలు విరాళాల ద్వారా సమకూర్చుకున్నారు.

ఈ విధంగా అపార్థు తోడ్పాటుతో చంద్రగిరి మండలంలో కొటాల, పాండురంగవారి పల్లె గ్రామాలు అభివృద్ధి పథంవైపు ముందుకు సాగుతున్నాయి. కేవలం 9 నెలల కాలంలో కొటాల సాధించిన ఈ ప్రగతిని చూసి అచ్చెరువొందిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఈ గ్రామంలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు భారత్ నిర్మాణ్ గ్రామ రత్న పురస్కారాన్ని అందచేసింది. తరచుగా వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం, పశువైద్య శిబిరాలు నిర్వహించటం, అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు సరైన పోషకాహార, తదితర అనుబంధ సేవలు అందేలా చూడటం వంటి ఎన్నో కార్యక్రమాలను వీరు చేపడుతున్నారు. మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించటానికి కృషి విజ్ఞాన కేంద్రం సహాయంతో ఇంటింటా పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించారు. ఇది ఇప్పటికే సత్ఫలితాలను ఇవ్వటం మొదలు పెట్టింది.

మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !



# ఒక ఆలోచన ఊరినే మార్చింది





**ఆదిలాబాద్ జైనాథ్ మండలం రాంపూర్ గ్రామం ఒకప్పుడు నిత్యం కొట్లాటలు, కోర్టుకేసులతో సతమత మవుతుండేది. గ్రామంలో ఎక్కడ చూసినా పెంటకుప్పలు, అపరిశుభ్రత రాజ్యమేలేది. మద్యం మత్తులో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. వాటి దుష్ఫలితాలను చూసిన గ్రామ యువతలో ఒక ఆలోచన వచ్చింది. అది ఊరినే మార్చేసింది. అందరినీ చైతన్యపర్చడం, భాగస్వామ్యం చేయడం ద్వారా గ్రామాభివృద్ధి సాధించాలనుకున్నారు.**

గ్రామానికి చెందిన 17 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అపార్డులో శిక్షణ తీసుకున్నారు. ముందుగా గ్రామంలో మద్యం అమ్మకం నిలిపేయాలని నిర్ణయించుకున్నారు. వారు తీసుకున్న నిర్ణయాన్ని పెద్దలు కూడా సమర్థించారు. ఒక రోజు గ్రామంలో గ్రామసభ ఏర్పరిచి గ్రామస్థులతో మద్యం అమ్మవద్దని, మద్యం తాగొద్దని, తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని తీర్మానం చేశారు. ఈ మేరకు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వీరు తీసుకున్న నిర్ణయానికి స్థానిక పోలీసులు కూడా మద్దతు ఇచ్చారు. మద్యం అమ్మకాలు ఆగిపోయిన నాటినుండి గ్రామస్థులు ఇతర విషయాలపై దృష్టి సారించారు. యువకులు చేసే ప్రతి పనికి గ్రామస్థుల సహకారం అందజేయడం మొదలైంది. ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యమే ప్రధానమని గుర్తించిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో పెంటకుప్పలు, అపరిశుభ్రత లేకుండా చేశారు. మురికి కాలువల్లో పూడిక తీశారు. ఆరోగ్య అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశారు. ప్రతినెలా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో బోర్‌వెల్స్ పాడైతే మరమత్తు సిబ్బంది కోసం ఎదురుచూసే పని ఉండదు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఆ పనులన్నీ నేర్చుకున్నారు. ఏదైనా వారే మరమత్తులు చేసుకుంటారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలనుకున్నారు. గ్రామం తరపున నెలకు రూ. 2000/- వేతనం ఇస్తూ ప్రత్యేకంగా ఒక విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల అనంతరం విద్యార్థులకు సాయంత్రం వేళ రెండు గంటలు అదనంగా ట్యూషన్ చెప్పిస్తున్నారు.

ఆ క్రమంలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగి విద్యపై దృష్టి సారిస్తూ బడిఈడు పిల్లందరూ బడిలోనే ఉండేటట్లు తల్లిదండ్రులలో అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యేట్లుగా చూడటంలో పై అధికారుల సహకారంతో విజయం సాధిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తున్నారు. గ్రామంలో అర్హులందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తున్నారు. గ్రామంలో చందాలు చేసి పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఒక ఆదర్శ గ్రామంగా తమ ఊరిని చూడాలనే తపనతో పనిచేస్తున్న బి.ఎన్.విల కలలు నిజం కావాలని ఆశిద్దాం.

**డా॥ వి. శివశంకరప్రసాద్ & ప్రదీప్‌కుమార్**

# ఏమి ఆశించి వీరు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు అయ్యారు?

**వారంతా యువకులు. విభిన్న వృత్తులతో స్వగ్రామంలోనే జీవనం సాగిస్తున్న వారు. సమాజ సేవ చేయాలనే ఉత్సాహం, తపన మెండుగా వున్న గ్రామీణులు. వారంతా భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు కావాలని, పుట్టి పెరిగిన గ్రామానికి, గ్రామ ప్రజలకు అంతో ఇంతో సేవ చేయాలని సహాయ సహకారాలు అందజేయాలనే తలపుతో ముందుకు వచ్చిన సైనికులు.**

వివరాలలోకి వెళ్ళితే, కర్నూలు జిల్లాలోని వెలుగోడు (మండలం) వెలుగోడు గ్రామ దశాబ్దాలుగా ప్రసిద్ధి చెందిన గ్రామం. గతంలో ఇది కమ్యూనిస్టులకు కంచుకోట. విప్లవ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులైన కీ.శే॥ గుర్రం వెంకట రెడ్డి, చంద్రపుల్లా రెడ్డి, మండ్ల సుబ్బారెడ్డి, సుదర్శన వర్మ, జనాబ్ అజాజ్ ఖాన్, ప్రముఖ న్యాయవాది జంగం రెడ్డి ఈ గ్రామ వాస్తవ్యులే. గ్రామ సమీపంలో తెలుగు గంగ బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంతో సాగునీరు పుష్కలంగా అందడంలో గ్రామదశ తిరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాలకు ఆర్థిక సామాజిక కేంద్రంగా మారింది. ఇటువంటి స్ఫూర్తి దాయక గ్రామం నుండి కొందరు యువకులు వారు చేస్తున్న వృత్తికి అతీతంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు కావాలను కోవడం, స్వచ్ఛంద గ్రామ సేవకు ముందుకు రావడం నిజంగా అభినందనీయం.

స్వగ్రామ కాపురస్తుడు విశ్రాంత జిల్లా పరిషత్ సి.ఇ.ఓ., ఏఎమ్ఆర్-అపార్డ్ సలహాదారు గుర్రం జయపాల రెడ్డిని సంక్రాంతి



పర్వదినాన వీరంతా గ్రామంలో కలవడం, కార్యక్రమం పట్ల అవగాహన పెంచుకోవడం, స్వచ్ఛంద సేవ చేయాలనే సంకల్పంతో వెనువెంటనే 18 మంది వాలంటీర్లుగానమోదు కావడం నమ్మలేని నిజం. వీరు గతంలో కూడా వ్యక్తిగతంగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం, స్థానిక ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎన లేని కృషి చేయడం గ్రామస్తులకు ఎరుకే. అయితే, భారత్ నిర్మాణ్ గొడుగు క్రింద చేరితే వారికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల 'అపార్డ్' ద్వారా అవగాహన పొంద వచ్చుననే ఉద్దేశ్యంతో వారు వాలంటీర్లుగా నమోదు కావడం నిజంగా హర్షణీయం.

భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా నమోదు కావడానికి, స్వచ్ఛంద సేవ చేయడానికి కులం, మతం, వయస్సు, వృత్తి అడ్డురావనడానికి చక్కటి నిదర్శనం ఈ గ్రామ వాలంటీర్ల వివరాలు. ఆ వివరాలేంటో ఒక సారి చూద్దాం.

**వాలంటీర్ల వివరాలు**

| వ.సం. | వాలంటీర్లు పేరు | కులం | వయస్సు | వృత్తి |
|---|---|---|---|---|
| 1. | షేక్ మహమ్మద్ రఫీ | ముస్లిం | 36 | మెకానిక్ |
| 2. | పి. జుల్ఫికర్ అలీఖాన్ | ముస్లిం | 36 | ప్రోగ్రామ్ మేనేజర్ |
| 3. | టి. రహమ్‌తుల్లా | ముస్లిం | 42 | క్యాబిల్ ఆపరేటర్ |
| 4. | వి. జయపాల్ | ఎస్.సి | 37 | ఐ.టి.ఐ. ఇన్స్‌ట్రక్టర్ |
| 5. | జె. ఇంతియాజ్ | ముస్లిం | 30 | వ్యాపారం |
| 6. | కె. బద్దే నాయక్ | ఎస్.టి | 45 | వాచ్‌మన్ జెడ్.పి.హెచ్.ఎస్‌సి |
| 7. | పి. నూరుల్లా | ముస్లిం | 35 | టైలర్ |
| 8. | బి. జబివుల్లా | ముస్లిం | 20 | సేల్స్ మాన్ |
| 9. | బి. నసురుల్లా ఖాన్ | ముస్లిం | 45 | వ్యాపారం |
| 10. | జి. రామలింగారెడ్డి | కాపు | 45 | కండక్టర్, ఎపిఎస్ఆర్‌టిసి |
| 11. | ఎమ్. జయరామి రెడ్డి | కాపు | 45 | వ్యాపారం |
| 12. | జె. సుల్తాన్ మొహియుద్దీన్ | ముస్లిం | 45 | వ్యాపారం |
| 13. | ఎస్. మక్బూల్ భాషా | ముస్లిం | 44 | స్కూల్ అసిస్టెంట్ (టీచర్) |
| 14. | ఎస్. అదూర్ రహమాన్ దర్గ్ | ముస్లిం | 45 | ఉర్దు ఎస్.జి. అసిస్టెంట్ (టీచర్) |
| 15. | సి.వి. లక్ష్మీనారాయణ | బి.సి. | 42 | ఫొటోగ్రాఫర్ |
| 16. | ఇ. శ్రీనివాసులు | బి.సి. | 32 | వ్యాపారం |
| 17. | ఎల్. రామకృష్ణయ్య | ఓ.సి. | 44 | వ్యాపారం |
| 18 | టి. చంద్రమోహన్ | ఓ.సి. | 44 | వ్యాపారం |

ఇదే విధంగా గ్రామ గ్రామాన కులమతాలకు, వృత్తులకు అతీతంగా వాలంటీర్లు జతకడితే, స్వచ్ఛంద సేవకు పూనుకుంటే, ప్రభుత్వ పథకాల పట్ల గ్రామీణులకు చైతన్యం, అవగాహన కల్పిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల లక్ష్యం కొంత వరకైనా నెరవేరే అవకాశం ఉంది.

**జి. జయపాల్ రెడ్డి,** సలహాదారులు, అపార్డ్

# 'ఉపాధి హామీ పథకం'తో వెలుగుబాట

## చిన్న ఊటకుంట చింతలన్నీ తీర్చింది

చంద్రశేఖర్ తనకు చిన్నతనం నుంచి, అంటే బుద్ధి వచ్చినప్పటి నుంచి చూస్తున్నాడు. ఊళ్లో వున్న చాలా మందికి పొలాలున్నాయి. అందరి పొలాలూ నల్లరేగడి పొలాలే! అయితే కొందరి పొలాలకు మాత్రం జీబీసీ (గుంతకల్లు బ్రాంచి కెనాల్) నీళ్లు పారతాయి.

ఆ పొలాల్లో సంవత్సరానికి రెండు పంటలు మిరప, పత్తి, వరి పండిస్తారు. కొందరి పొలాల్లో ఏ నీటి సౌకర్యమూ లేదు. అందువల్ల సంవత్సరానికి ఒకే ఒక పంట ... వేరుశనగో, పొద్దుతిరుగుడు పంటో పెట్టుకుంటారు.

మొదటి రకానికి చెందిన వారిని చూస్తే అసూయగా ఉంటుంది రెండో రకం వారికి. చంద్రశేఖర్ వాళ్ల భూమి రెండో రకానికి చెందినది. అతను పెరిగి పెద్దవాడయి, పెళ్లి చేసుకున్నాక కూడా వాళ్ల పొలాలకు నీటి సౌకర్యం విషయంలో పెద్ద తేడా ఏమీలేదు.

తన తండ్రి నుంచి 3.00 ఎకరాల నల్లరేగడి పొలం వారసత్వంగా వచ్చింది. ఎంత కష్టపడ్డా వాన మీదే ఆధారపడి పంట పండటం వల్ల వేరుశెనగ లేదా పొద్దుతిరుగుడు పంటకు రూ. 10,000 లు వచ్చేవి. అదీ ఏడాదికి ఒక పంట మాత్రమే!

ఒక వైపు పిల్లలు పెద్దవుతున్నారు. కుటుంబ పోషణకుగాను చేసిన అప్పులకు పంట నుంచి వచ్చే ఆదాయం సరిపోకపోగా, వడ్డీలు నడ్డివిరిచేలా ఉన్నాయి. ఏం చేయాలో పాలుపోని సమయంలో అదృష్టం వచ్చి ఇంటి తలుపు తట్టినట్టు 2006 సంవత్సరంలో 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పనులు వచ్చాయి. దాంతో భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధి హామీ కూలీలుగా మారారు. ఇక కష్టాలకి భయపడలేదు వాళ్లు.

చంద్రశేఖర్ పొలానికి ఆనుకునే దక్షిణ దిక్కుకు ఒక వంక తూర్పు నించి పడమటి వైపునకు పారుతుంది. అది వానాకాలం ఎక్కువగా పారుతూ ఉంటుంది. దానికి తోడు పూర్తిగా దక్షిణం వైపు ఉన్న చాలా వరిమళ్లకు తుంగభద్ర జీబీసీ (గుంతకల్లు బ్రాంచి కెనాల్) నీళ్లు పారుతాయి. ఆ మడులలో ఎక్కువైన నీరు వంకకు వదులుతారు. దాంతో ఆ వంక ఒక సంవత్సరంలో ఎక్కువకాలం పారే అవకాశం ఉంటుంది.

ఉపాధి హామీ పనులలో వంకకు దగ్గరగా చంద్రశేఖర్ పొలంలో ఊటకుంట తవ్వితే ఎక్కువ ప్రయోజనముంటుందని ఉపాధి హామీ అధికారులు చెప్పడంతో వెంటనే చంద్రశేఖర్, రమాదేవి ఇద్దరూ ఒప్పుకొన్నారు.

వెంటనే చిన్న ఊటకుంట మంజూరు కూడా కావడంతో దాన్ని నిర్మించడం జరిగింది. వర్షాలు కూడా రావడంతో గత ఏడాదే చిన్న ఊటకుంట నిండింది.

అది వెలితి అవకుండా, వంకలో నుంచి చిన్న ఊటకుంటలోకి పైపు పెట్టడంతో నీళ్లు వస్తూనే ఉంటాయి. రూ. 20,000 లతో ఆయిల్ ఇంజనూ, పొలంలోకి పారేందుకూ రూ. 30,000 ల ఖర్చుతో



జాబ్‌కార్డు నెం. 10555

| | | |
|---|---|---|
| భర్త పేరు | : | కురవ చంద్రశేఖర్ (38 సంవత్సరాలు) |
| భార్య పేరు | : | రమాదేవి (30 సంవత్సరాలు) |
| కులం | : | కురువ (బీసీ) |
| గ్రామం | : | కరకముక్కల |
| గ్రామపంచాయితీ | : | కరకముక్కల, |
| మండలం | : | విడపనకల్లు, |
| జిల్లా | : | అనంతపురం |

తోటలోకి పారేట్టు పైపులూ అమర్చారు. వెంటనే 2.50 ఎకరాలు మిరప పెట్టారు. అర్ధ ఎకరా వరి పెట్టారు. అప్పట్లో అంటే నిరుడు మిరప వల్ల రూ. 1,50,000 లు ఒక పంటకే వచ్చింది. అర్ధ ఎకరా వరి వల్ల 5 బస్తాల ధాన్యం పండింది. ఏడాదికంతా తిండికి లోటేలేదు.

"ఈ సారి 2.50 ఎకరాల మిరపపెట్టాం. అర్ధ ఎకరా వరి పెట్టాం. తుంగభద్ర నీళ్లు పారుతున్న వారి పొలాలతో పోటీపడి పండిస్తున్నా. నా పొలానికి కాలువ నీరు పారలేదే అన్న దిగులులేదు. నీటి ఊటకుంటతో నిశ్చింతంగా పండించుకుంటున్నాం.

ఈ చిన్న ఊటకుంట నీళ్లు మా పొలాలకు సరిపోవడమేకాదు, పక్కనే ఉన్న మరో పొలానికి కూడా ఉచితంగా నీళ్లు ఇస్తున్నాం. ఇదంతా ఉపాధి హామీ పథకం చలువే" అంటూ ఆనందంగా చెప్పాడు చంద్రశేఖర్.

## నిలకడలేని తనను నిటారుగా నిలబెట్టింది 'ఉపాధి హామీ'

ఏదో నిస్పృహ జగన్నాథ్‌కి. చదవడానికైతే ఇంటర్ వరకూ చదివాడు. 18 ఏళ్లు దాటాయి. నిజానికి తనకి ఇట్లా పోతే, ఇలా చేస్తే ఫలానా ఉద్యోగం వస్తుంది అంటూ దారి చూపించే వారే లేరు. తన తండ్రికి చదువురాదు. ఏదో పట్నంలో హాస్టల్లో ఉంటూ చదువుకొన్నాడు.

ఇంటర్ పూర్తిచేయడం అన్నది ఎందుకో తనకు అలివిగాని పని అనిపించింది. తనకు భూములు లేవు. ఏదో పనిచేసి సంపాదించి



# మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం డైరీ విడుదల

తెలంగాణ మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల సంఘం రూపొందించిన 2013 వార్షిక డైరీని రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖా మంత్రి శ్రీ కె. జానారెడ్డి ది 11.1.2013 న విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి శ్రీ జానారెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ శాఖలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఎం.పి.డి.ఓ ల పదోన్నతుల విషయాన్ని సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం నేతలు శ్రీ రాఘవేంద్ర, శ్రీ కె. యాదయ్య, తెలంగాణ గజెటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు, వి. శ్రీనివాసగౌడ్, పలువురు రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు, పలువురు జిల్లా ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.

మండల పరిషత్తు అభివృద్ధి అధికారుల దైనందిన విధుల నిర్వహణలో ఉపయుక్తమయ్యే పలు అంశాలను ఈ డైరీలో పొందుపర్చారు.



ఇదే సందర్భంగా రాష్ట్ర పంచాయితీ కార్యదర్శుల సంఘం రూపొందించిన వార్షిక డైరీని కూడా మంత్రి శ్రీ జానారెడ్డి విడుదల చేశారు. పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు శ్రీ భాస్కరరెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ◆



**జాబ్‌కార్డు నెం. 10370**

| | | |
|---|---|---|
| భర్త పేరు | : | సాకే జగన్నాథ్(30 సంవత్సరాలు) |
| భార్య పేరు | : | ఉమ (25 సంవత్సరాలు) |
| కులం | : | మాదిగ (ఎస్సీ) |
| గ్రామం | : | మాళాపురం |
| గ్రామపంచాయితీ | : | మాళాపురం |
| మండలం | : | విడపనకల్లు |
| జిల్లా | : | అనంతపురం |

ఇంటికి సాయపడాలన్న కోరిక అతన్ని బెంగుళూరుకి చేర్చింది. అక్కడ గుంతలు తవ్వాడు, మట్టి పనిచేశాడు. బేల్దారి అయ్యాడు.

అక్కడి నుంచి ముంబై చేరుకున్నాడు. అక్కడా బేల్దారి పనిచేశాడు. ఎక్కడా తనకి మనశ్శాంతి లేదు. తన మనసంతా సొంత ఊరి మీదే ఉండేది. ఒక సారి వచ్చేశాడు సొంతూరికి.

సరిగా అప్పుడే అంటే 2006 సంవత్సరంలో 'ఉపాధి హామీ పథకం' పనులు అమలు అయ్యాయి. తల్లిదండ్రులతోపాటు తనూ ఉపాధి కూలీ అయ్యాడు. బెంగుళూరు, ముంబైలు మహానగరాలు అక్కడ జీవనం నిత్యం తంతిమీద నడకలాంటిది. ఇప్పుడు సొంత ఊరిలో ఉపాధి పనులు చేసుకోవడం చాలా హాయిగా అనిపించింది.

2006 సంవత్సరంలోనే పెండ్లి కూడా చేసేసుకున్నాడు. తనూ ఒక ఇంటివాడయ్యాడు. ఇప్పుడు రూ. 3000 లతో ఒక టీవీ, రూ. 3000 లతో ఒక మిక్సీగ్రైండరు కొన్నాడు. తన చెల్లి పెళ్లికి తనవంతు సహాయంగా రూ. 5000 లు తండ్రికి ఇచ్చాడు.

"నా జీవితానికి నిలకడ నిచ్చింది ఉపాధి హామీ" అంటూ సంతోషంగా చెబుతాడు జగన్నాథ్.

*- చిలుకూరి దేవపుత్ర*

*డి.డబ్లు.ఎం.ఏ. అనంతపూర్*

# "మార్పు" కు శ్రీకారం - మహిళా సాధికారతకు మరింత ఉపకారం

**రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ ప్రభుత్వ శాఖలన్నీ ఐక్యతగా కలసి సమన్వయ, సహకారాలతో సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో భాగంగా మాతాశిశు మరణాల రేటు తగ్గించటం కోసం 20 ప్రధానాంశాలలో ప్రస్తుతం అందిస్తున్న ఆరోగ్య సేవలను, ప్రజలు తమ హక్కుగా పొందునట్లుగా ఒకేచోట ఆరోగ్య సేవలు అందించబోయే కార్యక్రమానికి "మార్పు" అని పేరు పెట్టి అమలు జరుపుతున్నారు.**

**'మార్పు' ఉద్దేశ్యాలు మరియు లక్ష్యాలు:**

- వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయం, ప్రజల భాగస్వామ్యంతో సమావేశాల నిర్వహణ, సమాలోచన చేసి ఆవాస ప్రాంత స్థాయిలో ఒకేచోట అన్ని శాఖల విధుల నిర్వహణ -
- 20 కీలక అంశాలపై దృష్టి సారించి, మాతా శిశు మరణాల రేటు తగ్గించటం.
- 20 అంశాలపై పర్యవేక్షణతో సమాజప్రవర్తనలో పరివర్తన తీసుకుని రావటం (బి.సి.సి.)
- స్వశక్తి (ఎస్‌హెచ్‌జి) గ్రూపులు, గ్రామైక్య సంఘాల (బిఒఎస్) భాగస్వామ్యం సాధించటం.
- సమీకరణలు - క్రోడీకరణలు
- మాతాశిశు సంరక్షణ రికార్డు (ఎం.సి.పి) కార్డుల వినియోగం
- సమన్వయం సాధించడానికి పరిపాలన, నిర్మాణాత్మక కమిటీ ఏర్పాటు (సేవల అమలు / ప్రణాళిక తయారీ)
- ఇరవై కీలక అంశాలలో గ్రామైక్య సంఘాల ద్వారా మార్పు సమావేశాలు నిర్వహించటం.

### ప్రభుత్వ శాఖల పరంగా అందించే సేవలపై చర్యలు

ఎ) ఆరోగ్య శాఖ (ఎన్ఆర్‌హెచ్ఎం) బి) సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐ.సి.డి.ఎస్) సి) గ్రామీణ నీటి సరఫరా విభాగం మరియు డి) పంచాయితీ రాజ్ సంస్థల సహకారం

- గ్రామ ఆరోగ్య పరిస్థితి, ఆరోగ్యం, పోషకాహారంపై కార్యనిర్వాహక ప్రణాళిక తయారుచేయటం.
- ప్రవర్తనలో మార్పు, సేవల సమాచారం అందించటం.



- సాంఘిక సమస్యలు - బెల్టుషాపుల నుండి విముక్తి, గృహహింస, ఆత్మహత్యల నివారణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై చర్చ.
- ప్రజారోగ్యం, పోషకాహార పద్ధతి యొక్క ఫలితాల లెక్కింపు మరియు సామాజిక తనిఖీ.

### మాతా శిశు మరణాలు మరియు పోషకాహార లోపంలో కీలకమైన (20) అంశాలు - పర్యవేక్షణ - చర్చ

**1. గర్భిణీ స్త్రీ రిజిస్ట్రేషన్ వెంటనే జరపాలి :**

- నిశ్చయ్ కిట్స్ వినియోగం, వివరాలు నమోదు, ఎం.సి.పి. కార్డు ఇప్పించడం, ఎఎన్ఎం లు, ఆశావర్కర్లు సేవలు అందిస్తారు.

**2. గర్భిణీ స్త్రీకి పరీక్షలు - పోషకాహారం :**

- రక్తహీనత, మూత్రపరీక్ష, ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీ, టి.టి. ఇంజక్షన్ జరుపుతారు.

**3. తల్లులకు పోషకాహారం :**

అంగన్‌వాడీ టీచర్ ద్వారా అనుబంధ పోషకాహారం అందజేయటం, న్యూట్రిషన్ కం డే కేర్ సెంటర్స్ (ఎన్.డి.సి.సి.) ద్వారా పోషకాహారం ఇస్తారు.

**4. అసాధారణ చిహ్నాలు గల గర్భిణీలను గుర్తించటం :**

- పి.హెచ్.సి వైద్యాధికారి సలహాతో ప్రమాదస్థాయి ఉంటే పై స్థాయి చికిత్సకు తరలిస్తారు. రిఫరల్ సిస్టం, ప్రత్యేక నిపుణులతో చికిత్స చేస్తారు.

**5. పుట్టబోయే బిడ్డకై ప్రణాళిక :**

- ఆసుపత్రి ప్రసవానికై ముందస్తు ప్రణాళిక నిర్ణయిస్తారు.
- 7 నెలలు దాటిన ప్రసూతికై 108 ద్వారా ఉచిత రవాణా కల్పిస్తారు.
- 108 సర్వీసు అందకపోతే - ఆటో / జీపు ఖర్చులకు హెచ్.డి.ఎస్ నిధుల ద్వారా డబ్బు అందజేస్తారు.

**6. ఆస్పత్రిలో ప్రసవం :**

- ఆసుపత్రిలో ప్రసవం అయిన వారికి రూ. 1000/- చొప్పున డిశ్చార్జికి ముందే చెల్లిస్తారు. (1,2 కాన్పులకు వర్తిస్తుంది).
- జననీ శిశు సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత ప్రసూతి చేసి, తల్లీ బిడ్డకు సంరక్షణ చేస్తారు. 108 ద్వారా ఇంటికి చేరుస్తారు.

**7. తల్లి పాలపై అభ్యాసం :**

- పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాలు పట్టించాలి.
- ఆరోగ్య సిబ్బంది తల్లిపాలు పట్టించి, కౌన్సిలింగ్ ఇస్తారు.

**8. పుట్టిన పాపకు మొదటి 6 నెలల వరకు తల్లిపాలే శ్రేష్టం :**

- సబ్ సెంటర్ స్థాయిలో ఎఎన్ఎం / ఆశా / అంగన్‌వాడీ వర్కర్ తల్లి పాల ప్రాధాన్యత, 6 నెలల వరకు తప్పక ఇచ్చేలా కౌన్సిలింగ్ ఇస్తారు.

**9. ప్రసవానంతర సేవలు మరియు అప్పుడే పుట్టిన బిడ్డ సంరక్షణ :**

- అసాధారణ రుగ్మతలుగల తల్లులు, శిశువుల గుర్తింపు, తగు సలహాలు, ఆరోగ్య బోధన చేస్తారు.

**10. టీకా కార్యక్రమం : (ఇమ్యూనైజేషన్)**

- ప్రభుత్వ ఆసుపత్రిలో, గ్రామ ప్రధాన కేంద్రంలో బుధ, శనివారాలు ఇమ్యూనైజేషన్ నిర్వహిస్తారు.



- ఓ.పి.వి, డి.పి.టి, మీజిల్స్ వాక్సిన్, "ఎ" విటమిన్ ద్రావణం, 5 సంవత్సరాలలోపు వారికి పోలియో చుక్కలు వేస్తారు.

**11. పిల్లల పెరుగుదల చూడటం :**

- పిల్లల బరువు తూచి ఎం.సి.పి కార్డులో ఎడబ్ల్యూ/ఎఎన్ఎం ద్వారా నమోదు చేస్తారు.
- పోషకాహార లోపం గల పిల్లల గుర్తింపు, కౌన్సిలింగ్, రిఫరల్ సేవలు

**12.** చంటి పిల్లలకు తల్లిపాల అభ్యాసక్రమము మరియు 7 నెలల నుండి 2 సంవత్సరాల వరకు పోషక విలువలు గల అనుబంధ పోషకాహారంపై తల్లులకు కౌన్సిలింగ్ ఇస్తారు.

**13. శ్వాస సంబంధ వ్యాధి / నీళ్ళ విరోచనాలకు చికిత్స అందించటం :**

- ఇంటి వద్దనే చికిత్స - ఓ.ఆర్.ఎస్. తయారీపై అవగాహన కల్పిస్తారు.

**14. రిఫరల్ సిస్టంను బలోపేతం చేయటం :**

- పిల్లలకు డయేరియా, శ్వాస కోశ వ్యాధులను గుర్తించి 108 ద్వారా రవాణా, సేవలు అందిస్తారు.

**15. కుటుంబ నియంత్రణ ప్రణాళిక :**

- అర్హులైన దంపతులకు మొదటి గర్భం పొందటానికి ఎక్కువ కాలం తీసుకోవటం, తదితర విషయాలపై
- బిడ్డకు - బిడ్డకు ఎడం కోసం తాత్కాలిక పద్ధతులు నిరోధ్, నోటి మాత్రలు, కౌన్సిలింగ్ ఇస్తారు.
- కుటుంబ నియంత్రణ పద్ధతులు (కు.ని) మగవారికి ఎన్.ఎస్.వి.లు, ఆడవారికి ట్యూబెక్టమీలు, డి.పి.ఎల్. ల గురించి తెలియజేస్తారు.
- కుటుంబ నియంత్రణ పారితోషికం : వాసెక్టమి - మగ వారికి రూ. 1100/- ప్రోత్సహించిన వారికి రూ. 200/-లు ఇస్తారు.
- ట్యూబెక్టమి - ఆడ వారికి (బిపిఎల్) రూ. 600/- లు ఎపిఎల్ వారికి రూ. 250/- లు, పోత్సహించిన వారికి రూ. 150/ లు చొప్పున ఇస్తారు.

**16.** మాతా శిశు మరణాలపై సమీక్షలు నిర్వహించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం గ్రామైక్య సంఘం పర్యవేక్షణ, నివారణకై కృషి చేస్తారు.

**17. పరిశుభ్రత మరియు ఆరోగ్యం :**

- ప్రజలలో అవగాహన కల్పిస్తారు. చేతులు శుభ్రంగా కడుక్కోవటం, త్రాగునీటి వనరుల క్లోరినేషన్, పైపు లీకేజిల మరమ్మత్తులు, నాలాలు, నీటిగుంతల తొలగింపు, మురికి కాలువల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, వినియోగంపై అవగాహన కల్పిస్తారు.

**18. సరైన వయస్సులో వివాహం :**

- బాల్య వివాహ చట్టం 2006 పై అవగాహన, అనర్థాలు వివరిస్తారు
- ప్రతి పెళ్ళి రిజిస్ట్రేషన్ తప్పని సరి చేస్తారు

**19. కిశోర బాలికలకు జీవనస్థాయి సామర్థ్యాల పెంపుదలకు**

- రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులకు హెచ్‌బి % పరీక్షలు, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందిస్తారు.
- బి.పి.ఎల్. వారికి కిశోరశక్తి యోజన పథకం ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణలు అందిస్తారు.
- ఆరోగ్యం - విద్యలో నెలసరి పరిశుభ్రత, విద్యాహక్కు చట్టంపై అవగాహన, ఎ.డబ్ల్యూ. ద్వారా కల్పిస్తారు.

**20.**లింగ వివక్షతపై అవగాహన కలిగించటం కోసం పి.సి. అండ్ పి.ఎన్.డి.టి. చట్టం అమలు ప్రక్రియలపై అవగాహన, స్కానింగ్ సెంటర్ల నిర్వహణ తనిఖీలు, లింగనిర్ధారణ నిరోధించి ఆడపిల్లల అబార్షన్‌లు నిరోధించటం, నెల వారీ నివేదికల పరిశీలన, నోటీసులు జారీ చేయటం జరుగుతుంది.

- గృహ హింస చట్టం, లింగ వివక్షత, బాలికా విద్యా హక్కు చట్టాలపై అవగాహన కల్పించటం.

## 'మార్పు' అమలు - గ్రామ, క్లస్టర్, జిల్లాస్థాయి కమిటి

**1) గ్రామస్థాయి సమన్వయ కమిటీల ఏర్పాటుతో అమలు నిర్వహణ గ్రామైక్య సంఘం (విఓ) ద్వారా చేస్తారు.**

1) సర్పంచ్ / జిపి స్పెషల్ ఆఫీసర్ - ఛైర్ పర్సన్
2) ఎస్ సి / ఎస్ టి మహిళ వార్డు మెంబర్స్ - మెంబర్
3) మహిళ ఎం పి.టి.సి / జడ్ పి.టి.సి. / ఎం.పి.పి - మెంబర్స్
4) అధ్యక్షులు - గ్రామ స్థాయి విద్యాకమిటి - మెంబర్
5) కార్యదర్శి - గ్రామ స్థాయి విద్యా కమిటి - మెంబర్
6) గ్రామ రెవెన్యూ అధికారి - మెంబర్
7) ఎ.ఎన్.ఎం. - మెంబర్
8) అంగన్ వాడి వర్కర్ - మెంబర్
9) ఆశ కార్యకర్త - మెంబర్
10) గ్రామైక్య సంఘం - మెంబర్ కన్వీనర్

**2. క్లస్టర్ స్థాయి సమన్వయ కమిటీ.**

1) క్లస్టర్ సమన్వయ అధికారి - ఛైర్ పర్సన్ (డిప్యూటీ కలెక్టరు స్థాయి అధికారి).
2) మెడికల్ సూపరింటెండెంట్ (ఎ.హెచ్./సి.హెచ్.సి.)-మెంబర్
3) మెడికల్ ఆఫీసర్ - పి.హెచ్.సి.ఎస్. - మెంబర్
4) మండల సమాఖ్య (ఓబి) - మెంబర్
5) డిపై. ఇఇ. (ఆర్‌డబ్ల్యూఎస్) డిపై. ఇఇ. (పిఆర్) - మెంబర్స్
6) ఐసి డిఎస్ - సూపర్ వైజర్స్ - మెంబర్స్
7) సిడిపిఓలు - మెంబర్స్ కన్వీనర్స్
8) ఏరియా కో ఆర్డినేటర్ - (ఎస్ఇఆర్‌పి) మెంబర్ - కన్వీనర్

**3. జిల్లా స్థాయి సమన్వయ కమిటి**

1) జిల్లా కలక్టర్ - ఛైర్ పర్సన్
2) జాయింట్ కలక్టర్ - మెంబర్
3) అదనపు జాయింట్ కలక్టర్ - మెంబర్
4) క్లస్టర్ కన్వర్‌జన్స్ ఆఫీసర్ - మెంబర్
5) డి.సి. హెచ్.ఎస్ - మెంబర్
6) పి.డి. డి డబ్ల్యూ ఎం ఎ - మెంబర్
7) జిల్లా పంచాయితీ అధికారి - మెంబర్
8) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఓ) మెంబర్
9) జిల్లా విద్యాధికారి - (డిఇఓ) - మెంబర్
10) పిఓ ఆర్‌విఎం, ఎస్ఇ(పిఆర్) ఎస్(ఇఆర్‌డబ్ల్యూఎస్,) డిఐఓ - మెంబర్
11) జిల్లా మహిళా సమాఖ్య - మెంబర్
12) మెడికల్ సూపరింటెండెంట్, ట్రైనింగ్ హాస్పిటల్స్ - మెంబర్
13) డి ఎం అండ్ హెచ్ ఓ - మెంబర్ కన్వీనర్
14) పిడి ఐసిడిఎస్ - మెంబర్ కన్వీనర్
15) పి డి డి ఆర్ డి ఎ - మెంబర్ కన్వీనర్

పై కమిటీల ద్వారా అమలు వ్యూహాల తయారీ, ప్రజల భాగ స్వామ్యంతో పలు ప్రభుత్వసేవలు ఒక చోట సమన్వయంతో అందించి మాతా శిశు ఆరోగ్యం మరియు జీవన ప్రమాణాలు పెంపొందించి మహిళా సాధికారితకు మార్పు కార్యక్రమం దోహదం చేస్తున్నారు.

కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర స్థాయిలోనే వినూత్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ నిర్వహించటం జరిగింది.

- 'అమ్మ లాలన' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల పెంచటం జరిగింది.
- ప్రభుత్వ ఆసుపత్రులతో (పిహెచ్‌సి) లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు విశ్వసనీయత పెంచారు.
- ప్రసూతి మాస ఉత్సవాలు నిర్వహించి వైద్యసేవలు మెరుగు పరిచారు.
- ఐ.ఇ.సి. లో భాగంగా "సాధారణ కానుపు ముద్దు - పెద్ద ఆపరేషన్ కానుపులు వద్దు" నినాదం ఇచ్చి, స్కైప్ వీడియో కాలింగ్ సిస్టం ద్వారా, నిరంతర పర్యవేక్షణ చేస్తూ మహిళలను ఎంతో చైతన్య పరిచారు. పై కార్యక్రమాలలో పాటు సరికొత్త "మార్పు" అమలుతో మిలీనియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎండిజి) త్వరలోనే సాధించాలని ఆశిద్దాం.

**- కోట సురేందర్** - డి.టి.ఎం., కరీంనగర్ జిల్లా

# ప్రభుత్వ పథకాల్లో బిఎన్‌విల బహుముఖ పాత్ర

## సమగ్రశిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్)లో భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర



సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ప్రపంచం మొత్తంలోనే విలక్షణమైన ప్రత్యేక పథకం ఐ.సి.డి.ఎస్. అంటే, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్.

1975 అక్టోబర్ 2న పూజ్య బాపూజీ జయంతి రోజున సమగ్ర శిశు అభివృద్ధి పథకానికి శుభారంభం జరిగింది. మన దేశంలో 33 బ్లాకుల్లో (తాలుకాలలో) ఈ పథకం ప్రారంభించారు. రాష్ట్రంలో ఉట్నూరు (ఆదిలాబాద్ జిల్లా), కంబదూరు (అనంతపురం జిల్లా)లో రెండు ప్రాజెక్టులుగా ఆరంభమైనది. ఈ సేవా పథకం, అనతి కాలంలోనే సంతృప్తికరమైన సేవలతో గ్రామస్థాయిలో విస్తరించిన ఏకైక పథకం.

మన రాష్ట్రంలో అన్ని జిల్లాలలో 387 బ్లాకులలో (తాలుకాలలో) 80,481 అంగన్‌వాడీ కేంద్రాలు, 10,826 మినీ అంగన్‌వాడీ కేంద్రాలతో ఈ పథకం విస్తృతంగా అమలులో ఉంది.

ఈ 387 ప్రాజెక్టులలో 80,481 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంచుమించుగా అదే సంఖ్యలో అంగన్‌వాడీ సహాయకులు, 10,826 మినీ అంగన్‌వాడి సహాయకులతో సమగ్ర శిశు అభివృద్ధికి ఈ పథకం ద్వారా కృషి చేస్తున్నారు.

వీటిలో గ్రామీణ ప్రాంతాలలో 67,319 పట్టణ ప్రాంతాలలో 7,920 గిరిజన ప్రాంతాలలో 5,242 అంగన్ వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి.

**ఈ పథకం ఉద్దేశ్యాలు**

- 0-6 సంవత్సరాల వయస్సులోపు పిల్లల పోషణ, ఆరోగ్యస్థాయిని మెరుగుపరచడం
- శిశువు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, ఎదగడానికి పునాది వేయడం.
- శిశు మరణాల రేటును, పిల్లల్లో పోషకాహార లోపాన్ని అనారోగ్య పరిస్థితులను, పాఠశాల మానివేతను తగ్గించడం.
- మాతా, శిశు అభివృద్ధికై కృషి చేస్తున్న వివిధ ప్రభుత్వ శాకల మధ్య సమన్వయం సమకూర్చడం.
- శిశువును ఆరోగ్యంగా పెంచడంలోనూ, పిల్లలకు అవసరమైన పోషకాహారాన్ని సమకూర్చడంలో తల్లికి సరైన శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని పెంపొందించడం.

పై ఉద్దేశ్యాలను దృష్టిలో ఉంచుకొని ఈ క్రింద తెలిపిన సేవలను సమగ్ర శిశు అభివృద్ధి పథఖం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

| | |
|---|---|
| 1. అనుబంధ పోషకాహారం | 4. సలహాలు - సంప్రదింపులు |
| 2. వ్యాధి నిరోధక టీకాలు | 5. పూర్వ ప్రాథమిక విద్య |
| 3. ఆరోగ్య పరీక్షలు | 6.ఆహార - ఆరోగ్య విద్య |

అంగన్‌వాడీ కార్యకర్త గ్రామంలో 'సర్వే' నిర్వహించాలి. కార్యకర్త గ్రామంలోని ప్రజలందరితో కలసి మెలసి ఉంటూ వారి స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ప్రతి కుటుంబాన్ని వ్యక్తిగతంగా కలసి ఆ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించుకోవాలి. గర్భిణీ స్త్రీలను, బాలింతను , 6 సంవత్సరాలలోపు పిల్లలను, కిశోర బాలికలను గుర్తించాలి.

ఈ పథకంలో లబ్ధిదార్ల ఎంపికకు ఎలాంటి టార్గెట్ లేదు. ఎంత మంది అర్హులు ఉన్నా అంతమందికి వారి అర్హత ప్రకారం సేవను అందించాలి.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహార మిశ్రమాలు అనగా రెడీ టు ఈట్ మిక్స్‌లు, (కిచిడి, హల్వా, స్వీట్ పారిడ్జీ, మురుగులు) గుడ్లు, బియ్యం, పప్పు, రవ్వ, నూనెలు తదితర పదార్థాలు లబ్ధిదారులకు నెలకు సరిపడునట్లు సరఫరా సక్రమంగా జరిగేటట్లు చూడటం.
- స్టాకు విషయంలో ఏమైనా లోపాలు, అవకతవకలు జరిగినట్లు తెలిస్తే పై అధికారి దృష్టికి తీసుకు వెళ్ళి లోపాలు సరి అయ్యేటట్లు చూడటం.
- అంగన్ వాడీ కేంద్రంలో పంపిణీ అయ్యే పౌష్టకాహారం లబ్ధిదారులు అందరికి (గర్భవతులు, బాలింతలు, 6 నెలలు - 5 సంవత్సరాల పిల్లలు, కిరోర బాలికలు) అందేలా చూడటం.
- పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు గృహ సందర్శనల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్గించడం.
- వ్యాధి నిరోధక టీకాలకు అర్హులైన పిల్లలు, గర్భవతులను గుర్తించి ఎ.ఎన్.ఎమ్. ద్వారా వేయించుటకు అంగన్‌వాడీ వర్కర్‌లకు సహకరించడం.
- ప్రతి నెలా తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించడం.
- 5 సంవత్సరాల పిల్లలందరినీ బరువులు తూకం వేయటంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు సహకరించడం. గ్రేడ్ 3, గ్రేడ్ 4 లలో ఎవరికి పిల్లలు ఉన్నట్లయితే వారికి సంతులన ఆహారం అందచేసేట్లుగా తల్లి తండ్రులలో అవగాహన కల్గించటం.
- అంగన్ వాడీ కేంద్రంలో హాజరు శాతం పెరిగేలా పోషకాహార దినోత్సవం (పోషణ ఆరోగ్యదినం) సమావేశానికి గర్భవతులు, బాలింతలు, పిల్లలు, కిశోరబాలికలు, హాజరయ్యే విధంగా చూడటం.
- ఆరోగ్యం, పోషణ, శుభ్రత గురించి విని పాటించేలాగా వారికి ప్రేరణ కల్గించడం.
- ప్రతి సంవత్సరం ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో జరిగే తల్లి పాల వారోత్సవాలు, పోషకాహార వారోత్సవాల లో గ్రామప్రజలు పాల్గొనేలా చూడటం.
- అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాల (ముర్రుపాలు) ప్రాముఖ్యతపై గ్రామస్థులలో అవగాహన కల్గించడం.
- బాల్య వివాహాలు, మేనరికపు వివాహాల వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం

## ఉపాధి హామీ పథకం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం అవసరం లేని కూలి పని చేయడానికి సిద్ధంగా ఉన్న కుటుంబాలలో పెద్ద వాళ్ళు ఒక ఆర్థిక సంవత్సరంలో



కనీసం 100 రోజుల వేతన భృతిని ఖచ్చితంగా పొందేలా చేయడం ద్వారా జీవనోపాధి భద్రత పెంచడం పథకం మౌలిక లక్ష్యం.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ నైపుణ్యంతో అవసరం లేని పని చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని కల్పిస్తూ చట్టబద్ధమైన హక్కు కల్పించడమైనది. ఈ చట్టం ఫిబ్రవరి 02, 2006 నుండి అమలులోనికి వచ్చింది. ఈ చట్టం వారి వారి రాష్ట్రాలలో నిర్ణయించబడిన కూలీ రేట్ల ప్రకారం వేతనాలు పొందుతారు. ఈ కూలీ రేట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము వారిచేత నిర్ణయించబడతాయి.

గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ నైపుణ్యంతో అవసరం లేని మట్టి పని చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబం వారు అర్హులు. ఏదైనా ఉపాధి కలిగి ఉన్న వ్యక్తి కూడా అతనికి/ఆమెకి ఉపాధి కల్పించమని డిమాండ్ చేసే హక్కు ఈ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం కల్పించబడింది. ఈ పథకం క్రింద వారి పేర్లు నమోదు చేసుకొని పని కావాలని దరఖాస్తు చేసుకొన్ని వారిలో కనీసం 1/3 వంతు మహిళలు లబ్ధిదారులు పని ప్రదేశంలో ఉండే విధంగా మొదటి ప్రాధాన్యత మహిళలకు తప్పనిసరిగా కల్పించాలి.

పథకం నుండి లబ్ధి పొందాలన్న ఉత్సాహం కలిగి ఉన్న ఏ కుటుంబమయినా వారి పేరు వ్రాత పూర్వకంగా గాని లేదా నోటి మాట ద్వారా గాని నమోదు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నమోదు పత్రం మరియు ప్రక్రియకు సంబంధించి ఎటువంటి పైకం చెల్లించనవసరం లేదు.

దరఖాస్తు చేసుకొన్న 15 రోజుల లోపల ఈ జాబ్‌కార్డు తప్పనిసరిగా జారీచేయవలసి ఉంటుంది. ఈ జాబ్‌కార్డు 5 సంవత్సరాల వరకు చెల్లుతుంది. ప్రతి కుటుంబం యొక్క జాబ్ కార్డులో వారి పేరు మరియు నమోదు చేసుకొన్న సభ్యుల ఫొటోలు తప్పనిసరిగా ఉంటాయి. దరఖాస్తుదారునికి జాబ్ కార్డు మరియు ఫొటో ఉచితంగా ఇవ్వబడుతుంది.

ఈ పథకం క్రింద పనికోసం ఎదురుచూసేవారు గ్రామ పంచాయితీకి పని కల్పించమని వ్రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి. మండల స్థాయిలో అదనపు పథకం అధికారికి పనికొరకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు ఆ కుటుంబం 100 రోజుల పనికి హక్కుదారులు అవుతారు. వ్యక్తిగతంగా కూడా సభ్యులు పనికొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 14 రోజులకు తక్కువ కాకుండా పని కల్పించమని డిమాండ్ చేయవచ్చు కోరవచ్చు.

ఈ చట్టం ప్రకారం ఒక కుటుంబం ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని పొందడానికి హక్కు కలిగి ఉంటుంది. ఆ 100 రోజులను ఆ కుటుంబంలోని సభ్యులందరూ కలిసి పంచుకొని పనిచేసు కొనవచ్చును.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- ఉపాధి హామీ కార్యక్రమంపై ప్రజలలో అవగాహన పెంపొందించటం.
- గ్రామంలో ఉపాధి కోరే అన్ని కుటుంబాలు గ్రామ పంచాయితీలో నమోదయి జాబ్ కార్డులు పొందేలా చూడటం.
- ప్రతి ఒక్క జాబ్ కార్డుదారునికి కనీసం 100 రోజులు పని కల్పించేలా చూడటం.
- గ్రామ లేబర్ బడ్జెట్ రూపకల్పనలో గ్రామ పంచాయితీకి సహకరించటం.
- జాతీయ ఉపాధి హామీ పథకం ప్రణాళికల రూపకల్పనలో పాలు పంచుకోవటం.
- పనులు ఎంపిక చేయటానికి నిర్వహించే గ్రామసభ నిర్వహణలో గ్రామ పంచాయితీకీ, ఉపాధి హామీ సిబ్బందికి సహకరించడం.
- లేబర్ డిమాండ్‌ను లెక్కించటంలో సహకరించటం.
- సకాలంలో ఉపాధి హామీ పనులు, కొలతలు జరిగేలా చూడటం, పనుల నాణ్యతను పరిరక్షించడం.
- బ్యాంక్ ప్రతి నిధులకు సహకరిస్తూ చెల్లింపులు జరపటంలో సహకరించటం.
- ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెంచడం.
- ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో ఉన్న బీడు భూములు సాగులోకి తీసుకురావడం కొరకు కృషి చేయడం.
- ఉపాధి హామీ నిబంధనలపై శ్రామికులలో, ప్రజలలో అవగాహన పెంపొందింపజేయటం.
- శ్రామికుల హక్కులు, బాధ్యతల గూర్చి అవగాహన కల్గించటం.
- ఉపాధి హామీ పథకంలో అవకతవకలు నివారించడం, దిద్దుబాటు చర్యలు తీసుకోవడం.
- సామాజిక తనిఖీ బృందానికి సహకరించడం.
- సామాజిక తనిఖీ కార్యక్రమంలో ప్రజలు పూర్తిగా పాల్గొని సామాజిక తనిఖీ బృందానికి సహకరించటం.
- పని ప్రదేశంలో వసతులు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవడం.

## నిర్మల్ భారత్ అభియాన్ - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

భారతదేశంలో నూటికి నూరు శాతం బహిరంగమలన విసర్జ నిర్మూలించి ఆస్థానంలో మరుగుదొడ్ల వాడకం చేపట్టి గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకురావడం దేశంలో అన్ని గ్రామ పంచాయితీలు సంపూర్ణ పారిశుధ్యం సాధించేలా ప్రజలను, పంచాయితీ రాజ్ సంస్థలను ప్రేరేపించి ఆరోగ్య, విద్య అవగాహన కల్పిన ద్వారా సుస్థిర పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన, పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలలో పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రతకు అవసరమగు ఘన, ద్రవ, వ్యర్థాల నిర్వహణకై కమ్యునిటీ నిర్వహణ లో పారిశుద్ధ్య విధానాలు అభివృద్ధి పరచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం.
- భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వారి వారి గ్రామాల్లో బహిరంగ మూత్రవిసర్జన, మలవిసర్జనను నిర్మూలించి మరుగుదొడ్ల వాడకాన్ని పెంపొందించడం.
- మరుగుదొడ్లు నిర్మించుకునే లబ్ధిదారుల ఎంపిక విషయంలో పంచాయతీకి సహకరించి లబ్ధిదారులను గుర్తించడం.
- సమాచార - విద్య - భావప్రసారం కార్యక్రమాల్లో పాల్గొనడం.
- మరుగుదొడ్ల నిర్మాణ దశలో లబ్ధిదారులకు సహాయపడటం.
- ఒంటరి మహిళలు, ముసలివారు, ఆర్థిక స్తోమత లేని కడుపేద



కుటుంబాలకు ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం అందేలా చూడటం.

- పాఠశాల పారిశుద్ధ్య పరంగా పిల్లలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్గించడం.
- స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీకి నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమం గురించి వివరించడం, తద్వారా పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడటం.
- భోజనానికి ముందు మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకునే విధంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం.
- గ్రామంలో ఎవరైనా నిర్మల్ భారత్ అభియాన్ ద్వారా ప్రాంతీయ పారిశుద్ధ్య విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోదలిస్తే వారికి తోడ్పాటు ఇవ్వడం.
- పారిశుద్ధ్యానికి సంబంధించిన ముఖ్యమైన రోజులను ర్యాలీలు, మీటింగ్‌లు ద్వారా మరుగుదొడ్లు వాడక పోవడం వల్ల వచ్చే అనర్థాలు, వ్యాధుల గురించి గ్రామప్రజలకు వివరించడం.
- పరిసరాల పరిశుభ్రతకు అవసరమయ్యే ఘన, ద్రవ, వ్యర్థాల యాజమాన్యానికి అవసరమైన చర్యలు తీసుకోవడం.
- గ్రామాన్ని నిర్మల గ్రామంగా తీర్చిదిద్ది నిర్మల గ్రామపురస్కార్ వచ్చే విధంగా ప్రజల అలవాట్లలో మార్పు తీసుకొని రావటం.
- నిర్మల్ గ్రామంగా ప్రకటింపబడిన తరువాత కూడా గ్రామంలో పారిశుద్ధ్య సౌకర్యాలు మెరుగ్గా నిర్వహించబడేలా పంచాయితీకి, ప్రజలకు సహకరించటం.

## జాతీయ గ్రామీణ త్రాగునీటి సరఫరా పథకం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

సదుపాయంలేని అన్ని ఆవాస ప్రాంతాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. దీనికి తోడు వనరుల వైఫల్యం వలన పూర్తి స్థాయి నుంచి పాక్షిక సదుపాయానికి దిగజారిన ఆవాస ప్రాంతాలతో పాటు నీటి నాణ్యత సమస్యలు వున్న ఆవాసాలకు రక్షిత మంచినీటి ఈ పథకం ద్వారా క్రింద సరఫరా చేస్తారు. సుమారుగా రూ. 3,724 కోట్లతో ఈ పథకం ద్వారా 72,407 ఆవాస ప్రాంతాలకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించారు. 40,287 (55%) గ్రామాలు (రోజుకు ఒక వ్యక్తికి 40 లీటర్ల చొప్పున) సంపూర్ణంగా, 32,120 (45%) గ్రామాలు పాక్షికంగా ఈ పథకం క్రిందకు తీసుకువచ్చారు.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- ప్రతి కుటుంబానికి సురక్షితమైన త్రాగునీరు అందేలా చూడటం.
- పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ నీటి సరఫరా జరగని కుటుంబాలను గుర్తించి ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్. అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం.
- వేసవి కాలంలో త్రాగునీటి పరంగా తలెత్తే సమస్యలను గుర్తించి, ఆ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం.
- త్రాగునీటి పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్గించడం. వినియోగ రుసుము చెల్లించేలా నిర్వహణపై ప్రజలను ప్రొత్సహించటం.
- ఫ్లోరైడ్‌తో కూడిన నీటిని త్రాగడం వల్ల వచ్చే ప్రమాదాల గూర్చి వివరించడం.




- నీటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ నీటిని వృధా చేయకూడదని ప్రజలకు అవగాహన కల్గించడం.
- త్రాగు నీటి నాణ్యత పరీక్షల కిట్ ద్వారా గ్రామంలో ఉపయోగించే నీటిని పరీక్షించి ఆ పరీక్షలలో ఏమైనా నీటి కాలుష్యం ఉన్నట్లు వెల్లడైతే ఆ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయడం.
- త్రాగునీటి విషయంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ వారు ఇచ్చే సలహాలను, సూచనలను గ్రామస్థులతో పంచుకోవడం.
- గ్రామంలో నీటి కమిటీలను ఏర్పాటు చేయడం. ఆ కమిటీ ద్వారా త్రాగు నీటి సమస్యలను పరిష్కరించడం.
- గ్రామ సభలో లేదా నీటి కమిటీలో ఉత్పన్నమైన అంశాలను మండల లేదా జిల్లా పరిషత్ లేదా జిల్లా నీటి, పారిశుద్ధ్య సంస్థ దృష్టికి తీసుకెళ్ళడం.

## జాతీయ సాంఘిక సహాయక కార్యక్రమం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

జాతీయ సాంఘిక సహాయక కార్యక్రమం 1995 వ సంవత్సరం ఆగష్టు 15 తేదీ నుండి అమలు లోనికి వచ్చింది. ఈ కార్యక్రమం క్రింద ప్రస్తుతం 5 పథకాలు అమలులో ఉన్నాయి. అవి: ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షను పథకం, ఇందిరా గాంధీ జాతీయ వితంతు పెన్షను పథకం, ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షను పథకం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం మరియు అన్నపూర్ణ పథకం.

ఇందిరా గాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం క్రింద లబ్ధి పొందాలి అంటే :-

- దరఖాస్తు దారుని (పురుషుడు/స్త్రీ) వయస్సు 65 సంవత్సరాలకు పైబడి ఉండాలి.
- దరఖాస్తు దారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబానికి చెందియుండాలి.

ఇందిరా గాంధీ జాతీయ వితంతు పెన్షన్ పథకం క్రింద లబ్ది పొందాలంటే

- దరఖాస్తుదారు (వితంతువు) వయస్సు 40 సంవత్సరాల నుండి 64 సంవత్సరాల మధ్య ఉండాలి.
- దరఖాస్తుదారు దారిద్ర్య రేఖకు దిగువన నివశిస్తూ ఉండాలి.

ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకం క్రింద లబ్ది పొందాలంటే

- దరఖాస్తు దారుని వయసు (ఆడ/మగ) 18 సంవత్సరాల నుండి 64 సంవత్సరాల మధ్య ఉండాలి.
- దరఖాస్తుదారు ఖచ్చితంగా ఏదేని ఒక తీవ్రమైన అంగవైకల్యం లేదా అనేక రకాల అంగవైకల్యాలతో బాధ పడుతూ ఉండాలి.
- దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబానికి చెంది యుండాలి.

భారత ప్రభుత్వ నిర్ణయం మేరకు లబ్ధిదారుకు అందుబాటులో





ఉన్న పోస్ట్ ఆఫీసు ఖాతా లేదా బ్యాంకు ఖాతాకు పెన్షను మొత్తం క్రెడిట్ చేయవలసి ఉన్నది. ఆ మేరకు ప్రస్తుతం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షను మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు లేదా పోస్ట్ ఆఫీసు సేవింగ్ ఖాతాకు లేదా గ్రామసభలో నగదు రూపంగా లేదా మనీ ఆర్డర్ ద్వారా గానీ చెల్లిస్తున్నాయి.

- జాతీయ సాంఘిక సహాయక కార్యక్రమంలో అమలయ్యే వివిధ పథకాలు.
  1. ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం.
  2. ఇందిరాగాంధీ జాతీయ వితంతు పెన్షను పథకం.
  3. ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పథకం.
  4. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం.

  మొదలైన పథకాల గురించి వివరించడం.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- ఎవరెవరు ఏ ఏ పథకానికి అర్హులో వారు ఆ పథకాల్లో అందే ప్రతిఫలాలు పొందే విధంగా తగు సూచనలు, సలహాలు ఇవ్వడం.
- లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రభుత్వానికి సహకరించి సరైన లబ్ధిదారులను గుర్తించడం.
- ప్రభుత్వం నుండి వచ్చే పెన్షన్ నేరుగా లబ్ధిదారునికి అందేలా చూడటం.
- అర్హులైన వారికి క్రొత్త పెన్షన్‌ల కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టడం.
- మరణించిన వ్యక్తి కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద రూ. 10,000/- ఆర్థిక సహాయం అందేలా చూడటం.
- వృద్ధులకు, వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలు, సేవల గురించి సమాచారం అందించడం.
- అన్నపూర్ణ పథకం క్రింద లబ్ధిదారులకు 10 కిలోల బియ్యం ఆహారధాన్యాలు సక్రమంగా అందేలా చూడటం.
- ప్రభుత్వం ప్రత్యేకంగా వికలాంగుల కోసం రూపొందించిన పునరావాస కార్యక్రమాల గూర్చి వికలాంగులకు వివరించి వారిని ప్రోత్సహించడం.
- వికలాంగుల అభివృద్ధికి ఆంక్షలు, అవరోధాలు లేని వాతావరణం కల్పించడం.

## సాక్షర్ భారత్ కార్యక్రమం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు ఉద్దేశించిన 'సాక్షర భారత్' అమలుకు రాష్ట్రంలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. దీనిపై జిల్లా పరిషత్ సీఈవోలు, పంచాయతీ ఆఫీసర్లు, వయోజన విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సదస్సు జరిగింది. వయోజన విద్యా శాఖ సంచాలకులు జనార్ధనరెడ్డి మార్గదర్శకాలను విడుదల చేశారు. మార్చి ఒకటి నుంచి రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఈ పథకం అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఈ కార్యక్రమం కింద మహిళల్లో సంతకం చేయడం, తెలుగులో చిన్న చిన్న పదాలను రాయడం వరకు నేర్పిస్తారు. ప్రధానంగా స్వయం సహాయక బృందాలను లక్ష్యంగా చేసుకుని కార్యకాలాపాలు జరుగుతాయి.

రాష్ట్రంలో సుమారు 7 లక్షల మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించారు. వీరిలో 85% మంది మహిళలు, 15% పురుషులు ఉంటారు.

ఈ పథకం అమలుకు రాష్ట్ర స్థాయిలో, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పడతాయి. రాష్ట్రంలో సీఎం, జిల్లాలో పరిషత్ ఛైర్మన్, మండల, గ్రామ పంచాయతీలో అధ్యక్షులు కమిటీలకు నేతృత్వం వహిస్తారు. జిల్లా కమిటీకి కలెక్టర్ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర కమిటీని రాష్ట్రీయ సాక్షరతా కోశ్‌గా కేంద్రం వ్యవహరిస్తోంది.

ఈ పథకం అమల్లో భాగంగా ఐదువేల జనాభా కలిగిన పంచాయతీల్లో లోక్‌శిక్ష (వయోజన విద్య) కేంద్రాలు ఏర్పడతాయి. 5 వేలు మించిన జనాభా ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఇలా 18 వేల కేంద్రాలు ఏర్పడతాయని అంచనా వేస్తున్నారు. వీటికి అవసరమైన గదిని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చాలి. దీనికి గ్రామ పంచాయతీలు సహకరించలి. కాలక్రమంలో శాశ్వత నిర్మాణాలను చేపడతారు. ప్రతి కేంద్రానికి రూ. 2 వేల గౌరవ వేతనం మీద ఇద్దరు సమన్వయకర్తలను నియమిస్తారు.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- సాక్షర్ భారత్ కార్యక్రమం, ముఖ్య ఉద్దేశ్యం గూర్చి ప్రజలకు తెలియజేయడం.
- ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను, పురుషులను రాత్రి బడులకు హాజరు అయ్యేలా ప్రోత్సహించడం.
- వయోజన విద్యా కేంద్రం ఏర్పాటులో సహాయపడటం.
- వయోజన విద్య అవశ్యకతను/ప్రాముఖ్యతను గురించి వివరించడం.
- తరచుగా కేంద్రాలను సందర్శించి, కేంద్రాలలో చదువుకుంటున్న వారిని ప్రోత్సహించడం.
- కేంద్రాలు సక్రమంగా నడిచే విధంగా తగిన సూచనలు, సలహాలు అందించడం.
- నిరక్షరాస్యులను చైతన్యవంతులను చేయడం / నిరక్షరాస్యులను క్రమం తప్పకుండా కేంద్రానికి వచ్చేట్టు ప్రోత్సహించడం / ప్రేరేపించడం.
- స్వచ్ఛంద సంస్థలను, నాయకులను, పెద్దలను, యువతీ, యువకులను కలసి వయోజన విద్యా కార్యక్రమానికి వారు సహాయపడేటట్లు చూడటం.
- బోధన, అభ్యసన సామగ్రి అందరికీ అందేలా చూడటంలో వాలంటీరుకు సహకరించడం.
- అక్షరాస్యత కేంద్రం నిరంతరంగా జరిగేట్టు చూడటం.
- నిరంతర విద్యా కార్యక్రమాలు నిర్వహించడం.
- నూతన అక్షరాస్యులు, తాము నేర్పిన చదువును మర్చిపోకుండా

దానిని పెంపొందించుకోవడానికి ప్రోత్సాహన్ని ఇవ్వడం.

- సాక్షర భారత్ సమన్వయకర్తలకు చేయూతగా ఉంటూ గ్రామాన్ని సంపూర్ణ అస్యరాస్యతా గ్రామంగా తీర్చిదిద్దటం.
- గ్రామంలో ఇంటింటా సర్వే చేసి, నిరక్షరాస్యుల జాబితాను రూపొం దించటం, ఇప్పటికే అందుబాటులో ఉన్న జాబితాలను సవరించటం.

## జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

భారత ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఆజీవిక) ప్రపంచంలోనే అతి పెద్ద పేదరిక నిర్మూలనా కార్యక్రమం. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన కార్యక్రమాల్లో కూడా పెద్దది. జూన్ 3, 2011 న రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో యు.పి.ఎ. చైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారిచే ప్రారంభించబడినది.

**జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ముఖ్య ఉద్దేశ్యం**

గ్రామీణ పేద, నిరుపేద కుటుంబాలను గుర్తించి వారిని సంఘటితం చేసి వారి సంస్థల శక్తి, సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచి వారికి అందుబాటులో వున్న వనరులను ఉపయోగించుకుని సుస్థిర ఆదాయాన్ని కలిగించే స్వయం ఉపాధి లేక నైపుణ్యం కలిగిన వేతన ఉపాధి అవకాశాల ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటూ పేదరికాన్ని తగ్గించుకునే సుస్థిర సంస్థలుగా ఎదిగేలా చేయడం.

జాతీయ జీవనోపాధుల మిషన్ గ్రామీణ పేదలు ముఖ్యంగా మహిళలను సమకరించి, సంఘటిత పరచి స్వయం సహాయక సంఘాలుగా, సమాఖ్యలుగా చేయడం ద్వారా మిలీనియం డెవప్‌మెంట్ గోల్స్ అయిన పోషణ, జెండర్, పేదరిక నిర్మూలన అనే అంశాలలో కావాలనుకున్న ఫలితాలను రాబట్టగలదు.

ఈ పేదల సంస్థ ప్రభుత్వ, ప్రభుత్వేతర సౌకర్యాలను జీవనోపాధులను సులభంగా పొందడానికి, వారి కోరికలను అవసరాలను గట్టిగా అడగడానికి సహాయపడుతాయి. అంతేకాకుండా పేదల సౌకర్యాల పంపిణీ యంత్రాంగంగా కూడా చాలా బాగా పని చేయగలుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్ల పంపిణీ, మధ్యాహ్న భోజనం, ఇన్సూరెన్స్ పథకాల ఎన్‌రోల్‌మెంట్, క్లెయిమ్, సెటిల్‌మెంట్లు మొదలగు సేవలను సమాఖ్యలు బాగా నిర్వహించగలుగుతున్నాయి.

గ్రామీణ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించే నైపుణ్య పెంపుదల కార్యక్రమాలపై జీవనోపాధుల మిషన్ పనిచేస్తుంది. 20% మిషన్ నిధులను ఇందుకు ఖర్చు పెడుతుంది. కొత్త పైలెట్ ప్రాజెక్టులను కూడా చేపడుతుంది. ప్రత్యేకంగా జాతీయ నైపుణ్యాభివృద్ధి మిషన్‌ను ఏర్పాటు చేసి 2022 నాటికి 50 కోట్ల మంది ఉపాధి అవకాశాలతో కూడిన శిక్షణ ఇస్తుంది.

దీని ద్వారా 100% పేద వారు సంఘాల్లో వుండటం, సంఘాలన్నీ పంచసూత్రాలు పాటించడం, గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి సమాఖ్యల ఏర్పాటు, వివిధ దశల్లో ఆర్థిక సహాయాన్ని అందించడం, సుస్థిర జీవనోపాధులను కల్పించడం, కుటుంబ స్థాయిలో ఆదాయాన్ని పెంచి ఆస్తుల కల్పన జరగడం అన్నవి సాధించగలగాలి.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఆజీవిక) ఉద్దేశ్యాలను ప్రజలకు వివరించడం.
- దారిద్ర్య రేఖ దిగువున ఉన్న కుటుంబాలను స్వయం సహాయ సంఘాల్లో చేర్చి వారి అభ్యున్నతికి కృషి చేయడం.
- బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా సంఘంలోని సభ్యులందరినీ ప్రోత్సహించడం.
- గ్రామస్థాయి సంఘాలను,(వి.బా)(వి.ఓ) సంస్థలను ప్రోత్సహించడం.
- స్వయం సహాయక సంఘాలకు కావలసిన సమాచారాన్ని అందించడం.
- పొదుపు సంఘాలు నిర్వహించుకునే నెలవారీ సమావేశానికి సభ్యులందరూ హాజరయ్యే విధంగా ప్రోత్సహించడం.
- సంఘంలో సభ్యులు స్నేహం, ఆత్మీయత పంచుకుంటూ మహిళలంతా సంఘటితమై పేదరికం అజ్ఞానం, ఒంటరితనం, నిస్సహాయత, మూఢనమ్మకాలు వంటి వాటిని దూరంచేసేలా ప్రోత్సహించడం.
- స్వయం సహాయక సంఘాలు తీసుకునే రుణాలు, పొదుపు చేసే మొత్తాల లావాదేవీల లెక్కల నిర్వహణలో లో సహాయపడటం.
- వివిధ రంగాల్లో నైపుణ్యత కొరకు శిక్షణా సమాచారాన్ని స్వయం సహాయక సంఘాలకు అందజేయడం.
- అధిక వడ్డీ రుణాల నుండి పేదలు బయటపడేందుకు బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించడం.
- జాతీయ గ్రామీణ జీవనోపాధుల లక్ష్యానికి అనుగుణంగా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అభివృద్ధి సాధించడం.
- రుణాల వసూళ్ళలో బ్యాంకులకు సహకరించటం.
- స్వయం సహాయక సంఘాలలోని మహిళలు తమ ఆర్థిక అవసరాల కోసం సూక్ష్మ రుణ సంస్థలను ఆశ్రయించకుండా వారిలో అవగాహన పెంపొందింప చయడం.
- మహిళల అక్రమ రవాణా, భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు, హెచ్ ఐ వి / ఎయిడ్స్, తదితర విషయాలపట్ల మహిళల్లో ఆవగాహన పెంపొందించటం.

## సమగ్ర నీటి పరివాహక ప్రాంత యాజమాన్య కార్యక్రమం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

ప్రజల భాగస్వామ్యంతో వర్షాధార భూములు/సాగులో లేని భూములు ఈ పథకం క్రింద అభివృద్ధి చేయడం జరుగుతుంది. భూమి వనరుల విభాగం ద్వారా అమలు చేయిబడుతున్న ప్రాంత అభివృద్ధి పథకాలైన కరువు పీడిత ప్రాంతం అభివృద్ధి కార్యక్రమ అయిన డి.పి.ఎ.పి., ఎడారి అభివృద్ధి పథకం (డి.డి.పి.) మరియు సమగ్ర బంజర భూమి అభివృద్ధి పథకం (ఐ.డబ్ల్యు.ఎమ్.పి.) ఈ పథకాలన్నింటిని కలిపి సమీకృతం చేసి ఒకే ఒక సమగ్ర వాటర్ షెడ్ యాజమాన్య పథకంగా పిలుస్తున్నారు. వనరుల సక్రమ వినియోగము, సుస్థిరమైన ఫలితాల సాధన మరియు సమగ్ర ప్రణాళిక కోసం ఈ పథకాలన్నిటినీ ఒకటిగా చేయడం జరిగింది.

**ఐ.డబ్ల్యు.ఎమ్.పి. ఉద్దేశ్యాలు ఏవనగా :**

- కరువు ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి, జీవావరణ క్షీణతను అరికట్టడానికి సహజ వనరులైన నేల, నీరు, వృక్ష సంపదల సక్రమ వినియోగము

- పర్యావరణ సమతుల్యతను పాటించుట
- సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా కాపాడుట
- సహజ సంపద పునరుత్పత్తి చేయుట
- వర్షపు నీటిని నిల్వ చేయుట మరియు భూగర్భ జలాల స్థాయిని పెంచుట
- బహుళ పంటలను ప్రోత్సహించుట మరియు వ్యవసాయ ఆధార కార్యక్రమాలను ప్రోత్సహించుట
- సుస్థిర జీవనోపాధులను ప్రోత్సహించుట.

**వాటర్ షెడ్ పథకంలో చేపట్టే పెద్ద కార్యక్రమాలు ఏవనగా:**

- మృత్తిక మరియు తేమ సంరక్షణలో భాగంగా కట్టలు, టెర్రెసింగ్, మొక్కలునాటడం మైదలైన కార్యక్రమాలు చేపడతారు.
- వివిధ రకాల ఉపయోగాలున్న మొక్కలు నాటుట, పెంచుట.
- సహజ సంపద పునరుత్పత్తిని ప్రోత్సహించుట.
- వ్యవసాయ అడవులను, మరియు తోటల పెంపకాన్ని ప్రోత్సహించుట.
- కలపనిచ్చే చెట్లు, వంటచెఱకు వాడకం నివారణచర్యలు
- సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల లోనికి తీసుకువెళ్ళే విధానం
- శిక్షణా కార్యక్రమం ద్వారా శిక్షకులకు అన్ని అంశాల పైన అవగాహన కల్పించుట.
- ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించుట.
- స్థిర ఆస్తులు లేని వారికి జీవనోపాధుల కల్పన
- సూక్ష్మ ఋణాలను మరియు ఉత్పాదన అభివృద్ధి

కొండ ప్రాంతాలలో మరియు కఠినతరమైన ప్రాంతాలలో ఒక హెక్టారుకు రూ.15,000/- లు మరియు సాధారణ ప్రాంతాలలో ఒక హెక్టారుకు రూ.12,000/-లు యూనిట్ ఖరీదు ఉంటుంది. ఒక వాటర్ షెడ్ పథకం క్రింద 5000 ల హెక్టార్లకు రూ.600 లక్షలు సమకూర్చ బడుతాయి.

వాటర్ షెడ్ పథకం ఆ ప్రాంతంలోను భూమి అభివృద్ధి మరియు సంరక్షణ, తేమ మరియు నీటి వనరులను కాపాడేందుకు అవకాశం కల్పిస్తుంది. ఆదాయ ఉత్పదన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆస్తులు లేని వారికి జీవనోపాది అవకాశాలను కూడా కల్పిస్తుంది. మరియు వాటర్ షెడ్ పథకం ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుంది.

సమగ్ర వాటర్ షెడ్ యాజమాన్య పథకం క్రింద వాటర్ షెడ్ ప్రాజెక్టు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఆ ప్రాంతంలో చేపట్టిన వాటర్ షెడ్ ప్రాజెక్టుపనుల ద్వారా ప్రత్యక్షంగా గానీ లేదా పరోక్షంగా గానీ లబ్ధిపొందుతారు. ఈ పనులు ఏవంటే ప్రాజెక్టు ప్రాంతంలోని ఉమ్మడి ఆస్తి వనరుల నిర్మాణము లేదా మరమ్మత్తులు. ఉదాహరణకు గ్రామ చెరువు, బావులు, ఇంకుడు చెరువు, పచ్చిక బయళ్ళు, మొక్కల పెంపకం మరియు ఉద్యానవనం అభివృద్ధి. ఆస్తి లేని ప్రజలకు జీవనోపాధి కార్యక్రమాలు చేపడతారు. భూమి యజమానుల కొరకు వ్యవసాయ ఉత్పత్తి మరియు చిన్న వ్యాపార కార్యక్రమాలు చేపడతారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఆదాయ ఆర్జన కార్యక్రమాల కొరకు శిక్షణా మరియు సామర్థ్యాల పెంపుదలకు హాజరవడం ద్వారా కూడా సామాన్య ప్రజలు ప్రయోజనం పొందవచ్చు.

వాటర్ షెడ్ ప్రాజెక్టు చెక్ డ్యాం నిర్మాణము, నీటి సంరక్షణ నిర్మాణాలు మరియు మట్టి, తేమ సంరక్షణ చర్యలు ఉదా॥ ఫీల్డు బండ్‌లు, కాంటూరు కందకాలు, అటవీ పెంపకం మరియు ఉద్యాన వన అభివృద్ధి, మొక్కల పెంపకం, ఇంధన కలప మరియు ఉద్యాన వన మొక్కలు, పచ్చిక అభివృద్ధి, తేనెటీగల పెంపకం, కోళ్ళ పెంపకం, మేకల పెంపకం, చేపల పెంపకం వంటి పనులలో కూడా ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

**ఐ.ఎన్.ఓ.లు ఏమి చేయవచ్చు?**

- సహజ వనరులపై అవగాహన పెంపొందించుకొని వాటిని సంరక్షించుకోవడం, భూసారాన్ని పెంచడం. నీటిని సద్వినియోగ పర్చుకోవడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవడం మొదలగు కార్యక్రమాల ద్వారా వారి జీవనోపాధులు మెరుగుపర్చుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించడం.
- వాటర్‌షెడ్ కార్యక్రమం గూర్చి ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా ప్రజల భాగస్వామ్యంతో వర్షాధార భూములు / సాగులో లేని భూములను అభివృద్ధి పర్చుకునేందుకు అవసరమైన సమాచారాన్ని, తోడ్పాటును రైతులకు అందించడం.
- వాటర్ షెడ్ కమిటీలు నిస్వార్థంగా పనిచేసేలా కృషి చేయడం.
- వాటర్ షెడ్ కార్యక్రమంలో చేపట్టవలసిన పనులను గుర్తించి ప్రణాళికలను తయారు చేయడంలో సహాయపడటం.
- ప్రణాళిక తయారీ కోసం స్వయం సహాయక సంఘాలతో, వినియోగదారుల బృందాలతో సమావేశాలు నిర్వహించడం.
- వాటర్ షెడ్ కార్యక్రమంలో ప్రణాళికాబద్ధంగా పనులు జరిగేలా చూడటం.
- పనుల నిర్వహణ దశ, నిష్క్రమణ దశలలో సహాయపడటం.
- వాటర్ షెడ్ కార్యక్రమాలలో జరిగిన పనులపై పనులు నాణ్యతను తెలునుకునేందుకు వచ్చే సామాజిక తనిఖీ బృందానికి సహకరించడం.
- పనుల అమలు తరువాత వాటి సంరక్షణ, నిర్వహణ యాజమాన్య పద్ధతుల ద్వారా జీవనోపాధుల మెరుగుదలకు బాధ్యతాయుతంగా వ్యవహరించే విధంగా ప్రోత్సహించడం.
- రైతులకు సూక్ష్మ రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించడంలో సహాయపడటం.
- వ్యవసాయ అడవులను, తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం.
- సామర్థ్యాల పెంపుదల కొరకు శిక్షణా కార్యక్రమం వివరాలను సేకరించి సమాచారాన్ని అందించడం.
- రైతులకు జీవనోపాధుల కల్పన, సమగ్ర పశుసంపద, యాజమాన్యం, పాడి పరిశ్రమ, పాల ఉత్పత్తులను ప్రోత్సహించడం.
- వాటర్ షెడ్ కమిటీ లెక్కలు / ఖర్చులు వివరాలు చూడటంలో కమిటీకి సహాయపడడం.
- ప్రజా సంఘాల మధ్య సమన్వయం నెలకొల్పడం.
- గ్రామంలోని సహజవనరుల ప్రస్తుత స్థితిగతుల పట్ల - అనగా గ్రామంలో భూ వినియోగం తీరుతెన్నులు, భూగర్భజలాల పరిస్థితి, ఉపరితల నీటి వనరుల పరిస్థితి, అటవీ భూములు, సామాజిక భూముల పరిస్థితి మొదలగు వాటిపట్ల ప్రజలలో అవగాహన పెంపొందింపచేయటం.



## జాతీయ గ్రామీణ ఆరోగ్య కార్యక్రమం - భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పాత్ర

గ్రామీణ పేదలకు చౌకగా నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించాలని 2005 ఏప్రిల్‌లో ఈ పథకం ప్రారంభించబడినది. దీని ప్రధాన ఉద్దేశ్యాలు - శిశు మరణాలు, తల్లి మరాణాల రేటు తగ్గించడం. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సేవలు అందరికి నియంత్రణ, జనాభా స్థిరీకరణ, ఆయుష్ కార్యక్రమాన్ని జనజీవన స్రవంతిలోకి తేవడం మొదలైనవి. 11వ ప్రణాళిక కాలంలో రూ. 2818 కోట్లు ఈ పథకం క్రింద ఖర్చు చేయడమైనది.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టే కార్యక్రమాల గూర్చి ప్రజలకు వివరించడం.
- గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయాల్లో తీసుకునే జాగ్రత్తల గూర్చి ఇంటింటా ప్రచారం ద్వారా అవగాహన కల్పించడం.
- దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం.
- హెచ్ ఐ వి / ఎయిడ్స్ వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ర్యాలీలు నిర్వహించడం.
- గ్రామంలో హెల్త్ కమిటీలు ఏర్పాటు చేయడం.
- వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గూర్చి ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం.
- వికలాంగులకు ప్రభుత్వం నుండి అందవలసిన సహాయం అందేలా చూడటం.
- గ్రామంలో పుట్టిన ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించేలా తల్లులను ప్రోత్సహించడం.
- బాలింతలుగా ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్గించడం.
- బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాల ప్రాముఖ్యతను, మెదటి ఆరు నెలలు శిశుజాగ్రత్తల గూర్చి వివరించడం.
- ఆరోగ్య పరంగా గ్రామంలో పనిచేసే ఏఎన్ఎమ్, ఆశావర్కర్‌లకు సహాయం చేయడం.
- గ్రామంలో 100% పిల్లలకు వ్యాధి నిరోక టీకాలు అందేలాగా చూడటం, శిశుమరణాలు, మాతృమరణాలు సంభవించకుండా అవగాహన కల్గించటం.
- ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించటం.
- 'ఆశ' కార్యకర్తకు, ఎ.ఎన్ఎమ్‌కు సహాయపడటం.
- గ్రామంలో 100% కుటుంబ నియంత్రణ సాధించేటట్లు సహకరించడం.



## మధ్యాహ్న భోజన పథకం

పోషకాహార భోజనం అందించే జాతీయ కార్యక్రమంగా మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టబడినది. సుమారు 300 కేలరీలు, 8-12 గ్రాముల ప్రొటీన్‌లతో కలిగిన వండిన ఆహారపదార్థాలను పిల్లలకు సరఫరా చేయడం పథకం ఉద్దేశ్యం. దీని ద్వారా 84.90 లక్షల (5968 ప్రాథమిక స్థాయి విద్యార్థుయి విద్యార్థులు) పిల్లలు లబ్ధిపొందుతున్నారు. 11వ ప్రణాళిక కాలంలో సుమారుగా రూ. 1556 కోట్లు ఇప్పటి వరకు ఖర్చుచేయడమైనది.

**బి.ఎన్.వి.లు ఏమి చేయవచ్చు?**

- పిల్లలకు అందించే ఆహారం నాణ్యమైనది ఉండేలా చూడటం.
- మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడటం. వారానికి రెండు సార్లు గుడ్లు, మంచి కురగాయలతో ఆహారం అందేలా చూడటం.
- పిల్లలకు పరిశుభ్రత, నాణ్యత పుష్టికరమైన ఆహారాన్ని అందించే విషయంలో శ్రద్ధ తీసుకోవడం.
- మధ్యాహ్న భోజన పథకానికి కావలసిన బియ్యం, పప్పులు, రేషన్ మొత్తం డీలర్ల నుండి సక్రమంగా అందేలా చూడటం.
- వంటకు అవసరమయ్యే వంటసామగ్రిని దాతల సహకారంతో సమకూర్చుకోవడం.
- నిర్ణీత వేళల్లో పిల్లలకు భోజనం అందేలా చూడటం.
- భోజనానికి ముందు చేతులు శుభ్రపరుచుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించడం.
- పాఠశాల కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా ప్రోత్సహించడం.
- మధ్యాహ్న భోజన పథకంలో భోజన సమయంలో వడ్డించే బాధ్యత తీసుకోవడం.
- పాఠశాల విద్యాకమిటీలు క్రమం తప్పకుండా జరిగేలా చూడడం.
- వంటకు ఉపయోగించే వంటశాల, పాత్రలు శుభ్రంగా ఉండే విధంగా చూడటం.

■

# బాలికలు, మహిళలపై అత్యాచారాలకు అంతే లేదా?

**ఈ మధ్య వార్తా పత్రికలు తిరగేసినా, టీవీ ఛానళ్ళు చూస్తున్నా ఒకటే వార్త**

- దేశ రాజధానిలో ఒక యువతిపై మూకుమ్మడిగా అత్యాచారం
- ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఓ యువతిపై అత్యాచారం
- సంక్షేమ హాస్టళ్ళలో బాలికపై వార్డెన్/అధికారి అత్యాచారం
- పాఠశాలలో విద్యార్థినికి ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు
- హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్లతో సీనియర్ డాక్టర్లు, ప్రొఫెసర్లు అసభ్యకరంగా ప్రవర్తించటం

ఇవి చాలవన్నట్లు ఈవ్ టీజింగ్‌లు, ప్రేమను తిరస్కరించిందనే సాకుతో యువతులపై దాడులు, భార్యలపై భర్తల హింస, హత్యలు, హత్యాయత్నాలు ఇలా ఒకటేమిటి? ఎటు చూసినా ఇలాంటి పశు ప్రవృత్తి చేష్టలే.

మనం మనుషులమా? మృగాలమా? అనేందుకు ప్రత్యేక నిదర్శనం క్రింది గణాంకాలే.

2011 లో రాష్ట్రంలో మహిళలపై నేరాలు, అత్యాచారాలు 22,179 నమోదుకాగా, అవి 2012 నాటికి 22,585కు చేరాయి. అందులో అత్యాచార కేసులు 2011లో 1291 కాగా, 2012లో 1191 ఉన్నాయి. ఒక్క హైదరాబాదు మహానగరంలోనే 2012 సంవత్సరంలో అత్యాచార కేసులు 68 నమోదు అయ్యాయి. ఇక నమోదు కానివి ఎన్నో, ఎన్నెన్నో!

మహిళను పరాశక్తిగా కొలిచే సంస్కృతీ, సంప్రదాయాలున్న మన దేశంలో ఈ పరిస్థితికి కారణమేమిటి? దీనికి బాధ్యులెవరు? ప్రభుత్వం ఏం చేస్తుంది? ఈ సమాజం ఎటు పోతుంది? ప్రస్తుతం మనందరి ముందున్న కింకర్తవ్యం ఏమిటి? ఇలా ప్రశ్నల పరంపర ప్రతి ఒక్కరి మదిని తొలుస్తూనే ఉంది.

### మహిళలు - ప్రస్తుత పరిస్థితి

ప్రపంచంలో సగానికి పైగా మహిళలున్నారు. ప్రపంచంలో జరిగే పనిలో మూడింట రెండు వంతుల పని మహిళలతోనే సాధ్యమౌతుంది. అయినా ఓ మనిషిగా హక్కులను అనుభవించే పరిస్థితులు లేవు. స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే అవకాశాలూ లేవు.

ఓ మహిళ ఎక్కడైతే, ఎవరితోనైతే సంతోషంగా, స్వేచ్ఛగా జీవించాలో అక్కడే స్వేచ్ఛ హరించివేయబడి, సుఖసంతోషాలకు దూరమై, ప్రతిక్షణం భయం భయంగా జీవించవలసిన పరిస్థితి. కుటుంబ సభ్యుల నుండే అత్యాచారానికి గురి అవుతున్న పరిస్థితి. ఇది చాలదన్నట్లు చదువుకొనే విద్యాలయాల్లో, పనిచేసే ప్రదేశాలలోనూ, ఇటువంటి సమస్యలే. ఆఖరుకు ధైర్యంగా ఒక్కతే బయటకు వెళ్ళలేని పరిస్థితి. ఈ పరిస్థితులలో స్త్రీకి రక్షణ ఏది?

దీనికంతటికీ ప్రధాన బీజం కుటుంబం నుండే పడుతుంది. స్త్రీ అనగానే, అందం, అలంకరణ, అణకువ, పనిపాటలు అని నవనరాన జీర్ణించుకుని పెరిగేలా చేస్తున్నాం మనం. సమానత్వం, హక్కులను అనుభవించడం, అవసరమైనపుడు ప్రశ్నించడం, న్యాయం కోసం ఎదురు తిరగడం వంటివి నేర్పించ గలిగితే ఈ రోజు మహిళలకు ఆ దుస్థితి దాపురించేదే కాదు. సమాజంలో బాధ్యాతాయుతమైన స్థాయిలలో ఉన్న వ్యక్తులు ప్రస్తుతం

- స్త్రీల రాత బాగాలేదని,
- రాత్రిపూట భయటకు రావద్దని,
- కురచదుస్తులు వేసుకోవద్దని,
- లక్ష్మణ రేఖ దాటవద్దని....

ఇలా ప్రకటనల మీద ప్రకటనలు ఇచ్చేస్తున్నారు. ఓ ప్రక్కన సమానత్వం, సాధికారికత అంటూ వేదికలపై ప్రసంగాలు చేస్తూ, మరోప్రక్క ఆంక్షలు విధిస్తున్నారు. ఇదే వారి తల్లికో, భార్యకో, బిడ్డకో జరిగితే ఇలానే స్పందిస్తారా!

"స్త్రీ భోగ వస్తువు కాదు. అవసరమైతే తల్లిలా లాలిస్తుంది, తోబుట్టువులా తోడు నీడగా ఉంటుంది. తన తనువుపై చెయ్యి వేస్తే మాడ్చి, మసి చేస్తుంది" అనే భయం/భావం మృగాళ్లకు కల్గించగలగాలి. అప్పుడే ఈ పరిస్థితికి ముగింపు ఉంటుంది.

### అత్యాచారానికి గురైన బాలికలకు, మహిళలకు ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలు ఏమిటి?

అత్యాచారానికి గురైన బాలిక/ మహిళ, ఆమె కుటుంబ సభ్యులు తక్షణం ఏమి చెయ్యాలి? ఎవరిని సంప్రదించాలి? ఏ విధమైన చట్టాలు అందుబాటులో ఉన్నాయి? ఎలా వెళ్తే న్యాయం జరిగే అవకాశం ఉంది. ఆ వివరాలను పరిశీలిద్దాం.

### మహిళలపై జరిగే వివిధ నేరాలకు చట్టాల ద్వారా తీసుకోవలసిన చర్యలు

ఒక స్త్రీ/బాలిక పై ఎలాంటి నేరం జరిగినా, ఆ మహిళ కాని, వారి

కుటుంబ సభ్యులు లేక ఇరుగు పొరుగు సమాజం కాని, స్వచ్ఛంద సేవా సంస్థలు/వ్యక్తులు మరియు స్థానిక సంస్థలు ముందుగా ఆ నేరాన్ని రిపోర్టు చేసేలా, పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలి. చేయటానికి కావలసిన ధైర్యాన్ని, సహకారాన్ని అందరూ ఆమెకి, ఆమె కుటుంబానికి అందించాలి.

ఏ నేరంలోనైనా దోషులని శిక్షింపవలెనంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడాలి. నేర పరిశోధన, మరియు కోర్టులో వారి మీద కేసు నడిపించే బాధ్యత పోలీసు యంత్రాంగానిది. ఆ తరువాత పోలీసులు న్యాయస్థానం, చట్టానికి లోబడి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

ప్రస్తుత సమాజంలో బాలికలు/మహిళలపై జరుగుతున్న నేరాలలో అత్యంత కిరాతకమైనవి అత్యాచారం, వరకట్న దురాచారం. అత్యాచారం జరిగినప్పుడు ఇప్పటివరకు ఇండియన్ పీనల్ కోడ్‌లోని (ఐ.పి.సి) సెక్షన్స్- 375, 376 క్రింది, ఎట్రాసిటి చట్టం క్రింద కేసు నమోదు చేసి దోషులని శిక్షించవచ్చు.

### ఐ.పి.సి - 375 మరియు 376 సెక్షన్ లో అత్యాచారం కేసులో ఎలాంటి శిక్షలు వేయవచ్చు

స్త్రీకి ఇష్టం లేకుండా ఆమెను బలవంతంగా కాని లేక బెదిరించిగాని ఆమెపై అత్యాచారం చేసినట్లయితే, లేక ఆమెకు మతి స్థిమితం లేకపోయినా, లేక మత్తులో ఉన్నా, లేక అతను మత్తు మందు ఇచ్చి ఆమెపై అత్యాచారం చేసినా అతనికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారు.

భార్య వయస్సు 12 సంవత్సరాల లోపు ఉన్నప్పుడు ఆమె భర్త ఆమెతో రతి జరిపినచో, ఆ భర్త ఆమెపై అత్యాచార నేరం చేసినవాడు అవుతాడు. అతనికి రెండు సంవత్సరాల జైలు శిక్ష లేక జరిమానా లేక రెండూ విధిస్తారు.

భార్యాభర్తలు న్యాయపరమైన ఎడబాటులో అనగా జ్యుడీషియల్‌గా విడిపోయినప్పుడు భర్త ఆ భార్యపై అత్యాచారం చేసినచో అతనికి 2 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారు.

### ఐ.పి.సి సెక్షన్ 376-బి

ప్రభుత్వ ఉద్యోగి తన దగ్గర పనిచేస్తున్న స్త్రీలపైగాని లేక తన ఆధీనంలో ఉన్న స్త్రీలపై గాని అత్యాచారం చేసినట్లయితే, అట్టివారికి 5సం.లు జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారు.

### ఐ.పి.సి సెక్షన్ 376-సి

జైలు సిబ్బంది జైలులో ఉన్న స్త్రీ ఖైదీలపైగాని లేక వారి ఆధీనంలో వున్న స్త్రీలపై గాని అత్యాచారం చేసినట్లయితే, అట్టివారికి 5 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధింపబడును.

### ఐ.పి.సి సెక్షన్ 376-డి

హాస్పిటల్ సిబ్బంది హాస్పిటల్‌లో ఉన్న స్త్రీలపై అత్యాచారం చేసినట్లయితే, ఇట్టివారికి 5సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారు.

### ఐ.పి.సి సెక్షన్ 376-2(జి)

18 సంవత్సరాల లోపు బాలికలపై అత్యాచారం చేసినా, లేక చేయటానికి ప్రయత్నించినా అట్టివారికి జీవిత ఖైది లేక 14 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా లేక రెండూ విధిస్తారు.

### ఐ.పి.సి సెక్షన్ 376 మరియు 376 (2)

ఒక మహిళ/బాలికపై ఒకరి కన్నా ఎక్కువ మంది అత్యాచారం చేసినట్లయితే, దానిని గ్యాంగ్ రేప్‌గా పరిగణించి అట్టివారికి జీవిత ఖైది లేక 14 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా లేక రెండూ విధిస్తారు.

### ఐ.పి.సి సెక్షన్ 420

ఐ.పి.సి సెక్షన్ 420 ప్రకారం ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని మోసం చేసినట్లయితే ఈ సెక్షన్ క్రింద శిక్షార్హుడు. అదేవిధంగా ఒక పురుషుడు ఒక స్త్రీని మోసం చేసినట్లయితే అతను కూడా శిక్షించబడును. ఈ సెక్షన్ క్రింద 7సం.ల జైలు శిక్ష మరియు జరిమానా విధించవచ్చును.

### ఐ.పి.సి సెక్షన్ 354

ఎవరైనా దురుద్దేశంతో స్త్రీల శరీరాన్ని లైంగికపరంగా తాకినా, లేక వేధించినా, వారి స్త్రీత్వానికి భంగం కలుగచేసినా (స్త్రీల ఎడల లజ్జాకరంగా, అవమానకరంగా ప్రవర్తించినా) అట్టివారిని ఈ సెక్షన్ క్రింద 7సంవత్సరాల జైలు శిక్ష లేదా జరిమానా లేక రెండూ విధించవచ్చును. ఈ నేరం బెయిలు మంజూరుకానటువంటిది.

### ఐ.పి.సి సెక్షన్ 509

ఏ ఒక్క స్త్రీ త్వానికి అవమానం కలిగే విధంగా మాట్లాడినా, సైగలు చేసినా, ఏదైనా వస్తువును ప్రదర్శించినా అట్టివారిపై ఈ సెక్షన్ క్రింద ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా జరిమానా లేక రెండూ విధించవచ్చును.

### ఐ.పి.సి సెక్షన్ 498 ఎ

వివాహం అయిన స్త్రీని ఆమె భర్తగాని, అతని బంధువులుగాని శారీరకంగా గాని, మానసికంగా గాని, మరే ఇతర కారణం చేతనైనా హింసించినట్లయితే, అట్టివారికి 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధించవచ్చును.

## ఐ.పి.సి సెక్షన్ 304 బి

ఒక వివాహిత మహిళ చావుని ఈ క్రింది సందర్భాలలో వరకట్నపు చావుగా పరిగణిస్తారు.

- వివాహం జరిగిన 7 సంవత్సరాలలోపు ఒక వివాహిత స్త్రీ చనిపోతే, వంటిపైన కాలిన గాయాలు గాని లేక ఇతర గాయాలు లేక అసహజ మరణం అయితే
- ఎక్కువ వరకట్నం తెమ్మని వివాహిత స్త్రీలను చావటానికి ముందు శారీరకంగా లేక మానసికంగా హింసకు గురిచేసిన సందర్భాలలో మహిళ చనిపోతే, అలాంటి మరణాలను.

ఈ సెక్షన్ క్రింద నేరస్తులకి 7సంవత్సరాల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు విధించవచ్చును.

## ఐ.పి.సి సెక్షన్ - 306

ఇతరుల ప్రోద్బలం వల్ల ఒక స్త్రీ గాని మరెవరైనా గాని ఆత్మహత్య చేసుకుంటే అట్టి ప్రోద్బలం చేసినవారికి ఈ సెక్షన్‌లో 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును.

## వరకట్న నిషేధ చట్టం, 1961

వరకట్న నిషేధ చట్టం 1-7-1961 వ తేది నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం క్రింద కట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరంగా పరిగణించబడును.

కట్నం ఇచ్చిన వారికి, తీసుకున్నవారికి 5సం.ల జైలు శిక్ష మరియు రూ.10,000 ల వరకు గానీ లేక కట్నం సొమ్ముతో సమానమైన మొత్తంగాని జరిమానాగా విధించవచ్చును.

వివాహ విషయాలలో ఏ డిమాండు లేకుండా వధువునకు గాని, వరునకుగాని ఇచ్చే కానుకలకు ఈ నిబంధన వర్తించదు. అయితే ఈ చట్టంలో సెక్షన్ 3 ప్రకారం వధూవరులకి ఇచ్చే కానుకలను లిస్టు వ్రాయవలెను.

సెక్షన్ 4 ప్రకారం కట్నం కావాలని ఏ రకంగా డిమాండు చేసినా అది నేరమే అవుతుంది. నేరం ధృవీకరణ అయినట్లయితే 2 సం.ల జైలు శిక్ష మరియు పదివేల రూపాయలు వరకు జరిమానా విధించవచ్చును.

సెక్షన్ 6 ప్రకారం కట్నం సొమ్మును భార్య, ఆమె వారసులు కోర్టు ద్వారా రాబట్టుకోవటం.

ఏ వ్యక్తయినా వివాహ విషయంగా ఆ వివాహానికి సంబంధించి వరకట్నాన్ని తీసుకుంటే, ఆ వ్యక్తి ఆ వరకట్నాన్ని వివాహం చేసుకుంటున్న స్త్రీ (వధువుకు)కి ఈ క్రింది విధంగా తిరిగి ఇవ్వాలి.

- వివాహానికి ముందే వరకట్నం తీసుకుంటే, వివాహం జరిగిన తేదీ నుండి మూడు నెలలలోపు,
- వివాహం నాడు కాని ఆ తరువాత గానీ వరకట్నం తీసుకుంటే వరకట్నం తీసుకున్న రోజు నుంచి మూడు నెలలలోపు,
- సెక్షన్ 6 (1) వరకట్నం తీసుకునే నాటికి వధువు మైనరు అయి ఉంటే, ఆమెకు 18 సం.లు వయసు వచ్చిన రోజు నుండి 3 నెలలలోపు,

సెక్షన్-6(3) పెండ్లి జరిగిన రోజు నుండి 7 సం.లలోపు పెండ్లి చేసుకున్న స్త్రీ చనిపోయి, ఆ చావు సహజ మరణం కాకుండా వుంటే ఆమెకు రావలసిన ఆస్తిని ఆమె సంతానం లేకపోతే, ఆమె తల్లిదండ్రులకు ఇవ్వాలి. ఆమెకు సంతానం ఉంటే, ఆ సంతానానికి ఇవ్వవలెను.అలా వరకట్నం తిరిగి ఇవ్వకపోతే ఆ వ్యక్తికి 6 నెలల నుండి 2సం.ల వరకు జైలు శిక్ష లేదా 5వేల నుండి రూ.10 వేలవరకు జరిమానా లేక రెండూ వేయవచ్చును.

పైన చెప్పినట్లుగా ఏ వ్యక్తయినా తీసుకున్న వరకట్నం వధువుకు తిరిగి ఇవ్వకపోతే ఆ వ్యక్తికి పైన చెప్పిన శిక్షలు విధించడమే కాకుండా కోర్టువారు ఫలానా గడువు లోపల ఆ వరకట్నపు ఆస్తిని వధువుకు తిరిగి ఇవ్వమని కోర్టు ఆదేశిస్తుంది.

సెక్షన్ 6(3-ఎ) ప్రకారం పైన ఇచ్చిన ఆదేశాన్ని గడువులోపు ఇవ్వకపోతే, ఆ ఆస్తికి సమాన విలువ కలిగిన మొత్తాన్ని, జరిమానాగా వసూలు చేసి వధువునకుగాని ఆమె తల్లిదండ్రులకు గానీ, ఆమె సంతానానికి గాని ఇవ్వవలెను. ఈ చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వరకట్న నిరోధక అధికారులను నియమించింది. కేసు వీరి ద్వారా కాని, సంబంధిత మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో కాని లేక పోలీసు వారి ద్వారా కాని, లేక ప్రయివేటు కంప్లెయింట్‌గా కాని వేసి న్యాయం పొందవచ్చును.

ఇలాంటి నేరాలనుండి స్త్రీలు/ బాలికలు ధైర్యంగా వారికున్న హక్కుతో చట్టానికి లోబడి సత్వర న్యాయం పొందటానికి సమాజంలో ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలి.

## నేరాన్ని పోలీసులకు సమాచారం అందించి ఎఫ్.ఐ.ఆర్. ఎలా నమోదు చేయాలి

ఎఫ్.ఐ.ఆర్ (ప్రథమ సమాచార రిపోర్టు) ని సెక్షన్-154 (సిఆర్.పి.సి) క్రిమినల్ ప్రొసీజరల్ కోడ్ ప్రకారం నమోదు చేయాలి.

ఎఫ్.ఐ.ఆర్ అనగా ఒక నేరం జరిగినప్పుడు గాని లేక జరగబోతుందని అనుమానించిప్పుడు గాని ఎవరైనా దగ్గరలో ఉండే పోలీసు ఆఫీసర్‌కు ఒక ఫిర్యాదు రూపంలో ఇచ్చే సమాచారాన్ని ఎఫ్.ఐ.ఆర్ అంటారు.

కేసు నిరూపణకి ఎఫ్.ఐ.ఆర్. పునాది లాంటిది. ఎఫ్.ఐ.ఆర్. లో తెలియపరచవలసిన విషయాలు 1. నేరం వివరాలు 2. నేరం జరిగిన స్థలం 3. నేరం జరిగిన తేది, సమయం 4. నిందితుని వివరాలు 5. సాక్షుల వివరాలు

## ఎఫ్.ఐ.ఆర్.

- ప్రథమ సమాచార రిపోర్టును ఘటన జరిగిన వెంటనే ఎంత త్వరగా నమోదు చేయగల్గితే, అంత మంచిది. కేసు వివరాలు ఏమీ తారుమారు చేయటానికి ఆస్కారం ఉండదు 2. నేర సమాచారాన్ని ఆ నేరం గురించి తెలిసిన వారెవరైనా దగ్గరలో గల పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసరుకు ఇవ్వవచ్చును. నేర సమాచారాన్ని వ్రాత పూర్వకంగా కాని, మౌఖికంగాకాని తెలియచేయవచ్చును.
- ప్రథమ సమాచారం రిపోర్టు ఇచ్చినవారు ఆ రిపోర్టు మీద సంతకం చేయాలి.
- ప్రథమ సమాచారం రిపోర్టు కాపీని, నేర సమాచారం ఇచ్చిన వ్యక్తికి పోలీసువారు ఉచితంగా ఇవ్వాలి.
- పోలీసు ఆఫీసరు ప్రథమ సమాచార రిపోర్టును (ఎఫ్.ఐ.ఆర్) నమోదు చేయాలి.

ప్రథమ సమాచార రిపోర్టును పోలీసు ఆఫీసరు నమోదు చేయకపోతే ఆ వ్యక్తి తన ఫిర్యాదును స్వయంగా గాని లేక పోస్టు ద్వారాగాని జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు తెలియజేయాలి. అట్టి కేసును పోలీసు సూపరింటెండెంట్ తన క్రింది పోలీసు అధికారిని విచారణ జరపమని ఉత్తర్వులు ఇవ్వవచ్చును.

లేక సంబంధిత మేజిస్ట్రేటు గారిని కోర్టులో కేసు పెట్టవలెనని పిటిషన్ ఇవ్వవచ్చును. ఆ మేజిస్ట్రేటు అట్టి పిర్యాదును క్రిమినల్ ప్రోసీజర్ కోడ్ సెక్షన్ - 200 క్రింద దర్యాప్తు చేయడానికి సంబంధిత పోలీసు అధికారికి ఆదేశాలు ఇవ్వాలి.

## మెడికల్ రిపోర్ట్

అత్యాచార కేసులలో ఎఫ్.ఐ.ఆర్. నమోదుకాగానే సంబంధిత పోలీసు ఆఫీసరు ఆ బాధిత మహిళలకి 24 గంటలలోపు తాలుకా వైద్యశాలలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ చేత పరీక్షలు చేయించి తగిన ఆధారాలను సేకరించి కోర్టులో కేసు నమోదు సమయంలో ఇవ్వాలి.

## పోలీసు అధికారి కేసుకు సంబంధించిన సాక్ష్యాలని ఎలా ధృవీకరించాలి

ఒక నేరాన్ని దర్యాప్తు చేయడానికి అధికారం కలిగిన పోలీసు అధికారికి ఆ నేరానికి సంబంధించిన విషయాలు తెలిసిన ఏ వ్యక్తినైనా విచారించే అధికారం ఉంది. పోలీసు ఆఫీసరు సాక్షి నుండి సాక్ష్యం కోసం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 161 క్రింద స్టేట్‌మెంట్ తీసుకొని కోర్టుకి సమర్పించాలి. పోలీసు దర్యాప్తులో ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై సాక్షులు సంతకం చేయక్కర్లేదు.

## కోర్టులో నేరవిచారణ

నేరం తాలూకు దర్యాప్తు పూర్తి అయిన తరువాత తగు సాక్ష్యాధారాలను చూపుతూ పోలీసు వారు ముద్దాయి పైన నేరారోపణ చేస్తూ ఛార్జ్ షీటును కోర్టులో దాఖలు చేస్తారు. ఛార్జ్‌షీట్ కోర్టులో వేసినప్పటి నుండి క్రిమినల్ కేసు మొదలవుతుంది.

కోర్టు ముద్దాయిపైన చార్జి మోపి, అందుకు అతని సంజాయిషీని కోరుతుంది. ముద్దాయి కోర్టువారికి సంజాయిషీ ఇచ్చిన తరువాత కోర్టులో ప్రాసిక్యూషన్ మొదలవుతుంది. ప్రాసిక్యూషన్ వారు సాక్షులను కోర్టు ముందు హాజరుపరిచి, వారి సాక్ష్యాన్ని అంటే నేరాన్ని గురించి వారికి తెలిసిన విషయాలను కోర్టువారితో రికార్డు చేయించుతారు. ముద్దాయి తరపు లాయర్లు ఆ సాక్షులను ఎదురు ప్రశ్నలు వేస్తారు. (అంటే క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు) ప్రాసిక్యూషన్ వారు కేసుకు ఆధారపడే అన్ని డాక్యుమెంట్లను కోర్టులో దాఖలు చేస్తారు.

ప్రాసిక్యూషన్ వారు సాక్షులందరినీ విచారించిన పిదప ముద్దాయిని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 313 క్రింద సంజాయిషీ కోరతారు. ముద్దాయి తన తరపున చెప్పుకోవలసినదేమైనా ఉంటే కోర్టువారికి చెప్పుకుంటారు. ఆ తరువాత ముద్దాయి తన తరపున సాక్షులను కోర్టు ముందు ప్రవేశపెట్టి వారి సాక్ష్యాన్ని కోర్టువారితో రికార్డు చేయించడం జరుగుతుంది. ఈ సాక్షులను ప్రాసిక్యూషన్ వారు ఎదురు ప్రశ్నలు వేయడం (క్రాస్ ఎగ్జామినేషన్) జరుగుతుంది. ఆ తరువాత ప్రాసిక్యూషన్ వారి వాదనలు, ముద్దాయి వాదనలు విన్న తరువాత కోర్టువారు కేసులో తీర్పు ఇస్తారు.

## ఉచిత న్యాయ సహాయక కేంద్రాలు

ప్రభుత్వం తరపున బాధితులకు ఉచిత తక్షణ న్యాయ సహాయాన్ని అందించటానికి కేంద్రస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జిల్లా మరియు మండల స్థాయిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ సహాయక కేంద్రాలను ఏర్పాటుచేయటమైనది.

ఈ కేంద్రాలలో న్యాయసహాయం అవసరమైన బాధితులు న్యాయసహాయం కోరిన వెంటనే వారికి అవసరమైన న్యాయవాదులను ఏర్పాటు చేసి వారి యొక్క కేసు పూర్వాపరాలని పరిశీలించి అవసరమైన విధంగా కోర్టులో కేసు నిరూపించుకోవటానికి తగిన చర్యలు తీసుకుంటారు.

**ఆర్. శివ పార్వతి,**
డిప్యూటీ డైరెక్టర్ & సెంటర్ హెడ్, సి.డబ్ల్యు.సి.డి.

# మహిళా సంఘాల్లో పారదర్శకత కోసం సోషల్ ఆడిట్

**మహిళా సంఘాల్లో పారదర్శకత, సోషల్ ఆడిట్ కోసం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ (ఎస్ఇఆర్‌పి) ఇందిరా కాంతి పథం కార్యక్రమంలో వినూత్న పద్ధతులని అవలంబిస్తోంది. ఇందిరా క్రాంతి పథం, కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉండే పేద మహిళలను ఆర్థికంగా స్వశక్తివంతులను చేయడానికి ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమాలను అమలు పరిచింది. ప్రస్తుతం మన ఆంధ్రప్రదేశ్‌లో చూసినట్లైతే 10,59,101 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1,15,48,174 మంది స్త్రీలు సభ్యులుగా ఉన్నారు. 38,821 గ్రామ సమాఖ్యలు, 1098 మండల మహిళా సమాఖ్యలు, 22 జిల్లా సమాఖ్యలు 22 జిల్లాల్లో ఉన్నాయి. డిసెంబర్, 2012 నాటికి మొత్తం పొదుపు చూసినట్లయితే రూ. 4054.44 కోట్లు, కార్పస్ మొత్తం రూ. 5871.91 కోట్లు ఉన్నాయి.**

ఎస్ఇఆర్ పి ద్వారా నడపబడుతున్న అనేక కార్యక్రమాల్లో డబ్బులు పొదుపు చేసుకొని, తద్వారా తమ జీవితాల్లో వెలుగులు ప్రసరింపచేసుకుంటున్నారు. ముఖ్యంగా, పిల్లల చదువు, ఆరోగ్యం, పెళ్ళిళ్లు, వ్యవసాయం, కుటుంబ అవసరాలు, అప్పులు తీర్చుకోవడం వంటివి చేయడంలో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ స్త్రీలదే ప్రథమ స్థానం ఉందని చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రస్థానంలో సంఘాల్లో ఉండే మహిళలు అనేక అంశాలపై నైపుణ్యాలను, నేర్పులను గడించారు. తద్వారా పేదరికం నుండి బయటపడి, నాణ్యమైన జీవితం కోసం జీవిత నైపుణ్యాలు కూడా పెంచుకుంటూ, సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గల స్వయం సహాయక సంఘాల సభ్యులు తమదైన శైలిలో అడుగులు వేస్తూ అందరికీ ఆదర్శంగా నిలబడుతున్నారు.

పేదరికం అంశాన్ని పరిశీలిస్తే, చదువు లేకపోవడం, సరైన సమాచారం లేకపోవడం కూడా ముఖ్యమైన కారణాలే. ఈ క్రమంలోనే స్వయం సహాయక సంఘాల్లో ఉండే మహిళలు తమ పొదుపు, బ్యాంక్ లోన్లకు సంబంధించిన అంశాలన్నిటినీ బుక్ కీపింగ్ ద్వారా పుస్తకాల్లో పొందుపరచటం జరుగుతుంది. దీనిని మరింత ముందుకు తీసుకెళ్ళడానికి, ఎస్ఇఆర్‌పి వారు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకొని ఇ - బుక్ కీపింగ్ (ఎలక్ట్రానిక్ బుక్ కీపింగ్ ద్వారా) అంశాన్ని గ్రామ సమాఖ్యలో పరిచయం చేశారు. దీనిని ఒక పైలెట్ ప్రాజెక్ట్‌గా 10 లక్షల గ్రూపుల్లో ఇ-బుక్ కీపింగ్, లాప్‌ట్యాప్‌ల ద్వారా వారి పొదుపును, బ్యాంక్ లోన్లను పొందుపరచడం జరిగింది. ఇదొక వినూత్న ప్రయోగం. బుక్స్, అకౌంట్స్‌కు సంబంధించిన గోప్యత విషయాలను పటాపంచలు చేస్తూ చేస్తున్న ఈ ప్రయోగానికి గ్రామ సమాఖ్య సభ్యులు, లీడర్ల నుండి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం మన స్వయం సహాయ సంఘాల్లో చూసినట్లయితే, 82% - 85% వరకు మహిళలందరికీ మొబైల్ ఫోన్లను ఉపయోగించడం తెలుసు.

పైన పేర్కొన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రతి మొబైల్‌లో బుక్ కీపింగ్, హాజరు, పొదుపుల వివరాలను పొందుపరిచేటట్లుగా కావాల్సిన సపోర్ట్ సాఫ్ట్‌వేర్, మొబైల్, సిమ్‌ను 40,000 గ్రామ సంఘాలకు ఎస్ఇఆర్‌పి వారు అందించడం జరిగింది. భారతదేశంలో మొట్టమొదటి సారిగా మహిళలు స్వయంగా తమ వివరాలను, తాము పొదుపు చేసిన మొత్తాలను కేవలం సంఖ్యలను ఉపయోగించి మొబైల్‌లో ఎంటర్ చేసేటట్లుగా, తద్వారా తమ వివరాలు అన్నీ, అనగా గ్రామ సమాఖ్య సమావేశానికి హాజరు అయినవారు, నెలనెలా పొదుపు కట్టిన మొత్తం, బ్యాంక్ లోన్‌కు కట్టిన మొత్తం మొదలైనవి అన్నీ ఇ-బుక్ కీపింగ్‌లో పొందుపరుస్తున్నారు. ఈ విధంగా చేయడం వలన ప్రతి సంఘంలో మహిళలు అందరూ చేస్తున్న పొదుపులు, బ్యాంక్‌కు కట్టాల్సిన లోన్లు, ఎవరు సక్రమంగా కడుతున్నారు, ఎవరు లోన్లు సరిగ్గా కట్టడం లేదన్న విషయాలు సుస్పష్టంగా అందరికీ అర్థం అవుతాయి. ఈ విధంగా 10 లక్షల గ్రామ సంఘాల వివరాల మొత్తం డేటాను మొబైల్ ఫోన్లలో ఎస్ఇఆర్‌పి వారు పొందుపరిచారు.

ప్రతి గ్రామంలో దాదాపుగా 30 సంఘాలు ఉంటాయి. వీటిలో దాదాపుగా 300 మంది మహిళలు సంఘ సభ్యులుగా ఉంటారు. ప్రతి సంఘంలో జరిగే సమావేశం, హాజరు వేసుకోవడం, పొదుపుల వివరాలు మాట్లాడుకోడానికి దాదాపుగా గంట గంటన్నర వరకు పడుతుంది. ఈ విధంగా విలేజ్ బుక్ కీపర్ వివరాలన్ని బుక్స్‌లో పొందుపరచడం, కొన్ని సార్లు పొదుపరిచిన వివరాలు సరిగ్గా లేకపోవడం కూడా జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు ప్రవేశపెట్టిన వినూత్న విధానం ద్వారా గ్రామ సమాఖ్యల్లో ఉండే మహిళలు తాము చేస్తున్న పొదుపులు,

లోన్ల వివరాలన్నీ పారదర్శకంగా నమోదు చేయవచ్చు. ఈ క్రమంలో గ్రామ సమాఖ్యల్లో ఉండే మహిళలు వడ్డీలేని రుణాలను కూడా పొందుతూ మెరుగైన జీవితాన్ని పొందడంలో సఫలీకృతమౌతున్నారు.

సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ వారు ఇ- బుక్ కీపింగ్ ద్వారా సంఘాల పొదుపుల వివరాలన్నీ డిజిటలైజేషన్ చేసి, ప్రతి ఒక్కరు సమాచారాన్ని తెలుసుకునేటట్లు చేస్తున్నారు. తద్వారా ఇందిరా క్రాంతి పథం సిబ్బందిలోను, బుక్ కీపర్స్‌లోను జవాబుదారీ తనం పెరుగుతుంది. అంతేకాక ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవడానికి అవకాశం ఉంది. ఇ - బుక్ కీపింగ్‌లోని వివరాలను, ఎమ్.ఐ.ఎస్. రిపోర్ట్‌లను సెర్ప్ వారి వెబ్‌సైట్ నుండి చూసుకోవచ్చు. (www.serp.ap.gov.in)

### స్వయం సహాయక సంఘాలు - సభ్యుల వివరాలను ఇంటర్‌నెట్‌లో ఈ క్రింది విధంగా చూసుకోవచ్చు.

జిల్లా :..........................................................................

మండలం పేరు :..........................................................................

గ్రామ సమాఖ్య పేరు :..........................................................................

స్వయం సహాయక సంఘం పేరు :..........................................................................

సభ్యుల పేర్లు :..........................................................................

| స్వయం సహాయక సంఘం వివరాలు | సభ్యుల వివరాలు |
|---|---|
| తెలుగు వెర్షన్ | ఇంగ్లీష్ వెర్షన్ |

సభ్యుల పేరు :..........................................................................

సభ్యుల రుణాలు :..........................................................................

రుణ పద్ధతి : లింకేజ్ అప్పు

లోన్ బ్యాలెన్స్ :..........................................................................

రుణ పద్ధతి :..........................................................................

లోన్ బ్యాలెన్స్ :..........................................................................

సభ్యుల పొదుపు :..........................................................................

జనరల్ సేవింగ్స్ :..........................................................................

### రుణం పొందిన స్వయం సహాయక సంఘాల వివరాలు

| లోన్ టైప్ | లింకేజ్ నెంబర్ | అకౌంట్ నెంబర్ | లోన్ బ్యాలెన్స్ |
|---|---|---|---|
| లింకేజ్ లోన్ | 3 | 7302980<br>7317 | 64074 |

### రుణం తీసుకున్న సభ్యుల వివరాలు

| సభ్యుల పేర్లు | లోన్‌టైప్ | లోన్ నెంబర్ | లోన్ బ్యాలెన్స్ |
|---|---|---|---|
| ఎర్రమ్మ | లింకేజ్ లోన్ | 3 | 6203 |
| సమ్మక్క | లింకేజ్ లోన్ | 3 | 6203 |
| రత్నకుమారి | లింకేజ్ లోన్ | 3 | 6203 |
| లక్ష్మి | లింకేజ్ లోన్ | 3 | 6203 |

### సభ్యుల సేవింగ్స్

| సభ్యుల పేర్లు | జనరల్ సేవింగ్స్ | హెల్త్ సేవింగ్స్ | ఎడ్యుకేషన్ సేవింగ్స్ | స్త్రీ నిధి సేవింగ్స్ | ఇతర సేవింగ్స్ | స్త్రీ నిధి (ఎస్‌సి) |
|---|---|---|---|---|---|---|
| లక్ష్మి | 4100 | 0 | 0 | 0 | 0 | 0 |
| సింగమ్మ | 4100 | 0 | 0 | 0 | 0 | 0 |
| సమ్మక్క | 4100 | 0 | 0 | 0 | 0 | 0 |

### గ్రాంట్స్ అండ్ ఇతర ఫండ్స్

| రివాల్వింగ్ ఫండ్ | ఎస్‌జిఎస్‌వై సబ్సిడి ఫండ్ | పంప్ ఫండ్ | గ్రాంట్స్ ఫర్ అసెట్స్ | ఇతర గ్రాంట్స్ | ఇతర చెల్లింపులు | అదనపు ఆదాయం | జెండర్ ఫండ్ |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |

### పాత బ్యాలెన్స్ వివరాలు

| స్వయం సహాయక సంఘంలోఉన్న నగదు | బ్యాంక్‌లో ఉన్న నగదు | అదనపు ఖర్చులు | ఇంకా రావాల్సినవి |
|---|---|---|---|
| | | | |

### పాత పెట్టుబడుల వివరాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |
| | | | | | | | |

**పైన పేర్కొన్న వివరాలన్నీ కూడా వెబ్‌సైట్‌లో ఈ లింక్ ద్వారా పొందవచ్చు**
హెచ్‌టిటిపి: //65.19.149.155/ihcb/test/.........

ప్రస్తుతం సెర్ప్ వారు ఈ అంశాలన్నిటినీ సామాజిక తనిఖీ చేయాలనే ఉద్దేశంతో చర్చలు జరుపుతున్నారు. తద్వారా భవిష్యత్‌లో గ్రామ సమాఖ్యల్లో పారదర్శకత పెరగడమే కాకుండా అందరూ బాధ్యతా యుతంగా, జవాబుదారీ తనంతో వ్యవహరించడానికి సామాజిక తనిఖీ దోహదపడుతుంది.

- **ఉషారాణి,** సెంటర్ హెడ్, సెంటర్ ఫర్ సోషల్ ఆడిట్
- **ఝాన్సీరాణి,** ట్రెయినింగ్ ఆఫీసర్, సెంటర్ ఫర్ సోషల్ ఆడిట్, అపార్డ్



# తెలుగు భాషా తేజాన్ని నలుదిక్కులా చాటిన ప్రపంచ తెలుగు మహాసభలు

**తెలుగు భాషకు చారిత్రిక సంపద వుంది. భారతీయ భాషల్లో పురాతన శాస్త్రీయ భాష తెలుగు. క్రీస్తు పూర్వం 3000-2500 సంవత్సరం మధ్య కాలంలోతెలుగు ఒక భాషగా విలసిల్లిందని నిరూపించే '8' శాసనాలు కర్నూలు జిల్లాలో మూడు దశాబ్దాల క్రితం బయట పడ్డాయి. అదేవిధంగా గుంటూరు జిల్లాలో తాళపత్రాలలో క్రీ.పూ. 400 సంవత్సరాలకు ముందే తెలుగు పదాల ఆనవాళ్ళున్నాయి. భారత ప్రభుత్వం 2008 లో తెలుగును ప్రాచీన భాషగా గుర్తించింది.**

"మన దేశంలో హిందీ తర్వాత అత్యధికులు మాట్లాడే రెండో భాష తెలుగు. తెలుగు 'తెనుగు' అనే పదం నుండి వచ్చింది. తెలుంగులు రాసే లిపిని 'ఆంధ్రీ'లిపి అంటారు. పోలికల్లో ద్రవిడ జాతికి చెందిన వారైనా ఆంధ్రులు తమిళుల కంటే పొడుగైన వారు, అందగాళ్లు, సాహసపరులని 1911 ఎన్ సైక్లో పిడియా ఆఫ్ బ్రిటానికాలో పేర్కొన్నారు. బ్రిటీష్ పాలన అంతమయి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డనాడు వారి భాషలోనే పరిపాలనా వ్యవహారాలు సాగించడానికి తప్పక ప్రయత్నించాలి" అని ఆల్. కాల్డెట్టిల్ 1935లో తెలిపారు.

1948 అప్పటి రెవెన్యూ మంత్రి శ్రీ కళా వెంకట్రావు (మద్రాసు రాష్ట్రంలో 'మాతృభాషలో పాలన', అనే పేరిట 1948లో ఒక రాజపత్రం విడుదలైంది) . ప్రజల భాషల్లో పరిపాలన జరగాలని, అప్పుడే ప్రజలకు నిజమైన సౌకర్యం కల్గుతుందని, కోర్టు వ్యవహారాలు తప్పనిసరిగా మాతృభాషలో సాగాలని అభిప్రాయపడ్డారు. నాటి 'రాష్ట్ర సమాచారం' అనే ప్రభుత్వ పత్రికలో వారి ప్రసంగం అచ్చుయింది.



1948 నుండి నేటి వరకు పరభాష ప్రభావం తొలగించి తెలుగులో ప్రభుత్వ వ్యవహారాలు నడపడానికి ప్రభుత్వాలు తీవ్ర కృషి చేస్తున్నాయి. పురాతన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవడానికి కూడా పాటు పడుతున్నాయి.

వర్ధమాన దేశాల మాతృభాషలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను రాబోతున్న విపత్తు గురించి ఐక్యరాజ్యసమితి, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక విభాగం 'యునెస్కో' 2000 సంవత్సరంలోనే హెచ్చరించింది. 200 సంవత్సరాలకు పైగా ఇంగ్లీషు వారి పాలనలో మాతృభాషాభివృద్ధి అడుగంటి పోయింది. వివిధ పదాలు తెలుగులో చేరి పదాల స్వరూపమే మారిపోయింది. పరిపాలించే పాలకులు విదేశీలైనప్పుడు వారిభాష, అలవాట్లు ప్రజలపై రుద్దడం పరిపాటి. 17వ శతాబ్దం వరకు ఇంగ్లండులోనే ఇంగ్లీషు భాషకు విలువలేదు. ఫ్రెంచి, లాటిన్ భాషలదే పై చేయి. తరువాతి కాలంలోనే పార్లమెంట్‌లో ప్రత్యేక తీర్మానం ద్వారా ఇంగ్లీషును అధికార భాషగా ప్రకటించుకున్నా, వారి ప్రభావం మన మీద పడిందని స్పష్టంగా చెప్పవచ్చు.

శాతవాహనులు, ఇక్ష్వాకులు, గౌతమీపుత్ర శాతకర్ణి, వేంగిరాజులు, అన్నమయ్య, నన్నయ్య, తిక్కన, వేమన, వీరబ్రహ్మంగారు తెలుగుకు చేసిన సేవ ఎనలేనిది.

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, రాష్ట్రపతి పదవిని అధిరోహించిన డా॥ నీలం సంజీవరెడ్డి, ప్రధానమంత్రి పదవిని చేపట్టిన శ్రీ పి.వి. నరసింహారావు, లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన శ్రీ జి.యం.సి బాలయోగి - పేరు ప్రఖ్యాతులు గడించిన తెలుగువారు.

తుళు భాషను మాతృభాషగా కలిగి, కర్నాటక రాష్ట్రాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయుల కాలం తెలుగుకు స్వర్ణయుగంగా అభివర్ణించవచ్చు, వారి కలం నుండి జాలు వారిన 'తెలుగు దేలయన్న దేశంబు తెలుగౌను' అనే పద్యంలో 'దేశ భాషలందు తెలుగులెస్స' అని అభివర్ణించిన- గొప్ప సాహితీ వేత్త వీరు. సాహిత్యానికి పెద్ద పీట వేశారు.

తేనెలొలుకు తియ్యటి మాతృభాషా సాహిత్యానికి సేవచేసిన మధుర కవులు కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, నండూరి, అభ్యుదయ సాహితీవేత్త గురజాడ, చలం, పదాల్లో ఉడుకులెత్తించే శ్రీశ్రీ, మధుర గీతాల ఆరుద్ర, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, గిడుగు వెంకట రామమూర్తి, దాశరథి, చిలకమర్తి, ముళ్ళపూడి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణ రెడ్డి వంటి వారిని స్మరించక తప్పదు.

క్రమేణా మాతృభాషలో మాట్లాడే వారి సంఖ్య తగ్గి, ఆంగ్లానికి ప్రాధాన్యత ఇస్తూ, సంస్కృతీ సంప్రదాయాలు క్షీణిస్తున్న దశలో తెలుగుమాట, పాట, నృత్యం, నాటకం, జానపదం, కట్టుబొట్టు, చలనచిత్రాలు, సంస్కృతి మొత్తం మారిపోతున్న దశలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, దేశ విదేశ మేధావులు, కవులు, సాహితీవేత్తలు కలిసి, మేధోమథనం చేసి భవిష్యత్‌లో పూర్తి రూపు మారకుండా సంరక్షించి, తెలుగు వికాసానికి బాటలు వేయడానికి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు.

## 1975 మొదటి ప్రపంచ తెలుగు మహాసభ

12.4.1975 నుండి 18.4.1975 వరకు లాల్‌బహదూర్ స్టేడియం మైదానంలో నాటి సి.ఎం. జలగం వెంగళరావు, విద్యా సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ మండలి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ సంవత్సరాన్ని 'తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా' ప్రకటించింది.

## రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు

14.4.1981 నుండి 18.4.1981 వరకు మలేషియాలో జరిగాయి. నాటి మలేషియా అధ్యక్షుడు మహతీర్ బిన్ మహ్మద్ హాజరయ్యారు. నాటి ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి అంజయ్య, అప్పటి రాష్ట్రపతి డా॥ నీలం సంజీవరెడ్డి కూడా పాల్గొన్నారు.

## మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు

10.2.1990 నుండి 13.12.1990 వరకు మారిషస్‌లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణ రెడ్డి నేతృత్వంలో ఈ సభలు నిర్వహించారు. ప్రస్తుత అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ కూడా పాల్గొన్నారు.

## నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు

27.12.2012 నుండి 29.12.2012న జరిగాయి. 37 సంవత్సరాల తర్వాత తెలుగు నేలపై జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు ప్రతిష్ఠను, తెలుగు వైభవాన్ని, సంస్కృతి ఔన్నత్యాన్ని నిలబెట్టిన ఈ సభలకు ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి మాన్యశ్రీ ప్రణబ్ ముఖర్జీ, విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాన్యశ్రీ ఈ.యస్.యల్. నరసింహన్, సభాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, గౌరవ అతిథులుగా కేంద్ర పర్యాటక శాఖామాత్యులు డా॥ కె. చిరంజీవి, రాష్ట్ర గనులు మరియు భూగర్భ శాఖా మాత్యులు శ్రీమతి గల్లా అరుణకుమారి, పార్లమెంట్ సభ్యులు డా॥ చింతా మోహన్, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, శాసనమండలి సభ్యులు శ్రీ వై. శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర మాధ్యమిక విద్యా శాఖామాత్యులు శ్రీ కె. పార్థసారథి, రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖా మాత్యులు శ్రీ వట్టి వసంతకుమార్, తదితరులు హాజరయ్యారు.

తిరుమల శ్రీ వెంకటనాథుని పాదాల చెంత తిరుపతిలో, శ్రీ వెంకటేశ్వర పశు, వైద్య, విద్యాలయ ప్రాంగణంలో 27.12.2012 నుండి 29.12.12వరకు 'నభూతో నభవిష్యత్' అన్న చందంగా, బాలల నుండి వృద్ధుల వరకు అందరినీ ఆకట్టుకున్న ప్రపంచ మహాసభల నిర్వహణ అద్భుతం, ఇది తెలుగు సౌరభాన్ని వెదజల్లిన ప్రాంగణం. ఈ ప్రాంగణంలో ఒక ప్రధాన వేదిక, 5 చర్చా వేదికలు, 5 ఉప వేదికలు, మొత్తం11 వేదికలు ఏర్పాటు చేశారు.

*ఉప వేదికల్లో జరిగిన కార్యక్రమాలు:* రంగస్థలం, సంగీతం, నృత్యం, జానపదం, సాహిత్యం మొదలైనవి. 5 చర్చా వేదికలలో- విదేశాలు, ఇతర రాష్ట్రాలలోని తెలుగువారి సదస్సు, అధికార భాషా సదస్సు, సాహిత్య వేదిక, చరిత్ర, లలిత కళలు, మానవీయ శాస్త్రాల సదస్సు, ప్రగతి రంగం మొదలైనవి జరిగాయి.

టి.టి.డి. మహతి ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రెండు సినిమా థియేటర్స్‌లో, 37 ప్రదర్శనశాలలతో తెలుగు చిత్రాల ప్రదర్శనలతో తెలుగు వెలుగులు విరజిమ్మింది ప్రాంగణం.

14 దేశాల నుంచి వచ్చిన ప్రవాస భారతీయులు దేశ, విదేశ, అంతర్రాష్ట్ర తెలుగు భాషాభిమానులతో సభా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. అన్ని రహదారులు, వాహనాలు-ప్రజలు మహాసభల వైపే అన్నట్లు కనుల విందుగా సభలు జరిగాయి.



## అజంత భాష

తెలుగును 'అజంత భాష'గా పేర్కొన్నారు. 15వ శతాబ్దంలోని ఇటాలియన్ యాత్రికుడు 'నికోలోకొంటి' తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా పేర్కొన్నారు. ఇటాలియన్ భాష, తెలుగు భాష రెండింటి ఉచ్చారణలో ఉన్న సారూప్యం ఇలాంటి గుర్తింపును తీసుకొచ్చింది. ఇటాలియన్ భాషలో ప్రతి పదం పలికేటప్పుడు చివరిలో ఒక అచ్చును పలుకుతారు. అదే విధంగా తెలుగులో వుండడాన్ని, ప్రతి పదం అచ్చు స్వరంతో అంతమవ్వడాన్ని 'అజంత' అన్నారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా తెలుగుకు 'ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్'గా ప్రాముఖ్యత వచ్చింది.

ఇక తిరుపతి పట్టణం 27, 28, 29 తేదీలలో జనసంద్రమైంది. జాతరలను మరిపించే సదస్సులు, చర్చావేదికలతో, నృత్య సంగీత, జానపద, సాహిత్యాలతో మారుమ్రోగింది.



ఇక రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ జ్యోతి వెలిగించి తెలుగు భాష ప్రత్యేకత, త్రిలింగ దేశం గూర్చి మాట్లాడం అపురూపం.

గౌరవ ముఖ్య మంత్రి తెలుగు వెలుగుల కోసం వరాల జల్లులు కురిపించారు. ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి, సంగీత, సాహిత్య లలిత కళల అకాడమీలను తిరిగి ప్రారంభించడం, ప్రత్యేక మంత్రిత్వ శాఖ, తెలుగు భాష బోధన, విదేశాల్లో, ఇతర రాష్ట్రాలలో తెలుగువారి పిల్లలకు తెలుగు నేర్చుకోవడానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించడం, తెలుగుకు సంబంధించిన అన్ని సంస్థలను అభివృద్ధి చేయడం వంటి చర్యలతో గొప్ప మార్పు భవిష్యత్‌లో సంభవిస్తుందని ఎదురు చూడవచ్చు.

తెలుగువారు ఇతరులకు ఆదర్శంగా ఉండేలా భాషా, సంస్కృతులపై అభిమానాన్ని పెంచుకోవాలని తమిళనాడు గవర్నర్ శ్రీ కె. రోశయ్య సూచించారు.

ఈ మహాసభలు తెలుగు తేజాన్ని నలుదిక్కులా చాటాయి. తెలుగు భాషా సంస్కృతులను భావితరాల వారికి అందించడం, దేశ, విదేశాలలోనున్న అందరిలో భావ సమైక్యతను కల్గించడం, ప్రపంచ భాషలతో సరితూగే విధంగా తెలుగును పాలనా భాషగా మార్చుకోవడం, తియ్యటి నూతన పారిభాషిక







పదాల రూపకల్పన, చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు ప్రాచుర్యం కల్గించే ప్రయత్నం చేయటం వంటి పరిణామాలతో ప్రభుత్వ కృషి నేరవేరింది.

విదేశీ భాష (ఆంగ్లం) హిందీ రెండు వుంటే చాలు. ప్రపంచమంతా తిరిగి రావచ్చు, ఎక్కడైనా నౌకరీ చేయవచ్చు, తెలుగు ఇక్కడికే పరిమితం, పనికిమాలిన భాషయని ఈసడించుకొనే కొందరికి తమ భావాలు తప్పని తెలిపే గొప్ప వేదికైనాయి. ఇలాంటి సభలు తరచూ నిర్వహించుకుంటూ, లోటుపాట్లు సవరించుకుంటే తప్ప ఈ మహాసభల ప్రయోజనం నెరవేరదు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు తెలుగులో వచ్చే లేఖల పైన మాత్రమే సంతకం పెడతానని ప్రకటించి, పాలనా యంత్రాంగం తెలుగులో వ్రాసే పద్ధతి ప్రవేశ పెట్టారు.

1948లో అప్పటి రెవెన్యూ మంత్రి శ్రీ కళా వెంకట్రావు నుండి నేటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి వరకు అందరి ఆరాటం తెలుగును పూర్తి స్థాయిలో అమలు చేయటమే.

ఇక తెలుగు మహాసభల కొరకు - తెలుగు ప్రజలను చైతన్యం చేయడానికి రాష్ట్రంలోని 23 జిల్లాల్లో వివిధ ప్రచార కార్యక్రమాలు నవంబర్ 19 నుండి డిసెంబర్ 19 వరకు జరిగాయి.

ఇక జిల్లాలలోని, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో భాషపై సదస్సులు, కళా ప్రదర్శనలు, ఊరేగింపులతో ప్రజలు ముగ్ధులైనారని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

"ప్రతి రాష్ట్రంలో - పరిపాలనా క్రతువంతా రాష్ట్ర భాషలో జరగాలి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకం కావాలి" ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ సందర్భంగా ఆనాటి ప్రధాని నెహ్రూ అభిలాష.

"తెలుగు వీనుల విందు ద్రావిడ భాషల్లో కెల్లా మధురాతి మధురం. చదువురానివాడు మాట్లాడినా చెవులకింపుగా వుంటుంది. దీనిని 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనడం సమంజసం" **- హెన్రిమోరిస్ 1890**

తెలుగు జాతి, తెలుగుభాష, తెలుగు సంస్కృతి పరిరక్షణ నిమిత్తం తెలుగు మహాసభలకు తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలకు, రాజకీయ నాయకులకు, జననాయకులకు, సాహితీవేత్తలకు, కవులకు, కళాకారులకు, ప్రతి ఒక్కరికి తెలుగు మహాసభల తరపున నమస్కారాలు.

*- ఎన్. రాజేశ్వరమ్మ, ఫ్యాకల్టీ,*
*ఈ.టి.సి. శ్రీ కాళహస్తి*

## షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళికల అమలుపై :

# అపార్డ్‌లో మేధోమధనం



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉపప్రణాళికల ఆవశ్యకత మరియు అమలుపై చర్చించటానికి అపార్డులో జనవరి 29, 2013 న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ డి.మాణిక్య వరప్రసాద్ గారి అధ్యక్షతన అపార్డ్‌లో మేధోమధనం నిర్వహించారు.**

ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సలహాదారు, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ అధికారి డా. పి.ఎస్.కృష్ణన్, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారులు డా.ముని వెంకటప్పయ్య, డా. ఎస్.చెల్లప్ప,జి.వో.ఎన్.జీ.వో. ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్, శ్రీ టి.గోపాలరావులు హాజరయ్యారు. అపార్డ్ కమీషనర్ శ్రీ కె.చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్, సెర్ప్ సి.ఇ.ఓ రాజశేఖర్ ఐ.ఏ.ఎస్ లు కూడా ఈ మేధోమధనంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డా. పి.ఎస్. కృష్ణన్ మాట్లాడుతూ, పంచవర్ష ప్రణాళికలలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజలకు ప్రత్యేక ప్రణాళికలు ఉండవలసిన ఆవశ్యకతను గుర్తించిన మొదటి రాష్ట్రం మనదేనని, 1979 నుండి ఈ ప్రణాళికలు అమలు జరుగుతున్నప్పటికీ ఈ ప్రణాళికలు ఏ ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టబడ్డాయో ఆ ఉద్దేశ్యం గాడి తప్పిందని అన్నారు. అందుకే ఈ ప్రణాళికలకు చట్టబద్ధత కల్పించటానికి దేశస్థాయిలో యు.పి.ఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ కూడా సానుకూలత వ్యక్తపర్చారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ దిశలో ఒక అడుగు ముందుకు వేసి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్, మరియు ట్రైబల్ సబ్ ప్లాన్‌లకు చట్ట బద్ధత కల్పించటం హర్షణీయమని అన్నారు. ఎస్.సి, ఎస్.టి. వర్గాలకు చెందిన ప్రజల ఆర్థిక స్వాతంత్ర్యం, అందరికీ విద్య, సామాజిక సమానత్వం సాధించటమే ఈ ఉపప్రణాళికల లక్ష్యం అని అన్నారు. ఎస్.సి, ఎస్.టి. వర్గాలకు చెందిన ప్రజల జీవన ప్రమాణాల మెరుగుపర్చటం ఈ ఉపప్రణాళికల ధ్యేయమన్నారు.

చట్టంలో చిన్న చిన్న లోపాలు ఉన్నప్పటికీ వీటిని సవరించటం సులభమేనన్నారు. కేవలం చట్టాలు తెచ్చినంత మాత్రాన వీరి జీవన స్థితిగతులు మారుతాయని ఏమాత్రం భావించరాదని, చట్టం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేయటానికి ఒక పెద్ద వాలంటీర్ ఫోర్సు కావాలని, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలను ఇందుకు ఉపయోగించుకోవచ్చని అని అన్నారు. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో ప్రతీ ఎస్.సి, ఎస్.టి రైతుకీ భూపంపకం జరగాలని అన్నారు. రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీలో ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే వ్యక్తులను సభ్యులుగా తీసుకోవాల నే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, దేశంలో ప్రప్రథమంగా స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ మరియు గిరిజన ఉపప్రణాళికలను చట్టబద్ధం చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎస్.సి, ఎస్.టి. ఆర్థిక స్థితిగతులలో మార్పు రావాలంటే భూమిపై యాజమాన్యం తప్పనిసరి అని, అందుకే ప్రభుత్వం పలు పథకాల ద్వారా పేదవారిని రైతులుగా మార్చే సంకల్పంతో భూపంపిణీ చేపట్టిందని ఎస్.సి, ఎస్.టి.ల భూముల ఉత్పాదకతను పెంచటానికి 'ఇందిర జలప్రభ' వంటి పథకాన్ని రూపొందించి నిరుపేద రైతులు ఆర్థిక సుస్థిరత పొందేట్లు ప్రోత్సహిస్తోందని అన్నారు. వ్యక్తిగత లబ్ది చేకూర్చే పథకాలు ఎన్నో ప్రవేశ పెడుతున్నప్పటికీ, బ్యాంకర్ల సహాయనిరాకరణతో, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు నష్ట పోతున్నారని, ఈ వైఖరి మారాలని అన్నారు. ఎస్.సి, ఎస్.టి కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం ఉపాధిహామీ వంటి పథకంలో నిధులు మంజూరు చేసినప్పటికీ అమలులో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు.

ఈ సందర్భంగా ఉపప్రణాళికల ఆవశ్యకతపై అపార్డ్‌లోని సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ మరియు వాలంటరీ యాక్షన్ సెంటర్‌హెడ్ శ్రీ మదన్‌మోహన్ రూపొందించిన పుస్తకాన్ని రాష్ట్రమంత్రి శ్రీ మాణిక్య వరప్రసాద్ గారు విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉన్నత అధికారులు, అనధికారులు, ఎన్.జి.ఓలు పలు సలహాలు సూచనలు అందచేశారు. ◆



వ్యవసాయంలో రైతులు నేడు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య ఎరువుల కొరత. ప్రభుత్వాలు భారీగా రాయితీలను ఇచ్చి సరఫరా చేస్తున్నప్పటికీ, రైతుల అవసరాలు తీరడం లేదు. దీనికి తోడు కొంతమంది వ్యాపారస్తులు కృత్రిమ కొరత సృష్టించడంతో కొరత మరింత పెరుగుతోంది. కొన్నిసార్లు రైతులు అవగాహన రాహిత్యం వల్ల అవసరం కంటే ఎక్కువ ఎరువులను వాడుతున్నారు. దీని వల్ల సాగుఖర్చులు పెరగడమే కాక, నేల, నీరు కలుషితం అవుతున్నాయి. వ్యవసాయంలో కొన్ని ఖచ్చితమైన పద్ధతులను పాటించడం వల్ల ఎరువుల ఖర్చును తగ్గించుకొని అధిక లాభాలను పొందవచ్చు.



# పంటల సాగులో ఎరువుల కొరతను, ఖర్చును తగ్గించుకునే విధానాలు

రైతులు ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల, ఆయా నేలల్లో ఉండే పోషకాల మోతాదును తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఆ నేలల్లో కొరతగా ఉన్న పోషకాలను ఎరువుల రూపంలో అందించవచ్చు. అంతేగాక నేలల్లో సమృద్ధిగా ఉన్న పోషకాలను గుర్తించి, పోషకాలను అందించే ఎరువులను భూమిలో వేయకుండా ఆపాలి. మన ఎరువులలో లభించే పోషకాలు ముఖ్యంగా మూడు, అవి నత్రజని, భాస్వరం, పొటాష్.

## నత్రజని

పంటకు ముఖ్యంగా అవసరమైన పోషకం నత్రజని. దీని కొరత వల్ల పంట దిగుబడి తీవ్రంగా దెబ్బతింటుంది. దీనిని సాధారణంగా యూరియా రూపంలో అందిస్తాం. సాధారణంగా నత్రజని ఎరువును అఖరి దుక్కిలో కొంత భాగాన్ని, మిగిలిన భాగాన్ని 2-3 సార్లు పంటపై పై పాటుగా వేసుకుంటాం. నత్రజని ఎరువును పొలంలో చల్లుకోవడం కంటే, మొక్కల మొదళ్ళ వద్ద చిన్న గుంత చేసుకొని వేసుకోవడం వల్ల ఎరువును ఆదా చేసుకోవచ్చు. దీని వల్ల మొక్కకు అందే నత్రజని కూడా పెరుగుతుంది.

నత్రజనిని యూరియా రూపంలో అందించేటప్పుడు యూరియాకు పై పూతగా వేప పిండిని వేస్తే చిన్నగా కరిగి, పైరుకు పోషకం ఎక్కువ కాలం అందుతుంది. కొన్ని బ్యాక్టీరియాలు వాతావరణంలోని నత్రజనిని గ్రహించి దానిని మొక్కకు అందుబాటులోకి తెస్తాయి. వాటిని జీవన ఎరువులుగా వాడడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించు కోవచ్చు. వాటిలో ముఖ్యమైనది రైజోబియం. రైజోబియంను లెగ్యూమ్ జాతి పప్పు పంటలకు విత్తన శుద్ధికి వాడడం ద్వారా మొక్కలకు కావల్సిన నత్రజనిని అందించవచ్చు. అదే వరి పంటలో అజొల్లా పెంపకం ద్వారా నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్‌తో ఎరువు, విత్తనం ఒకేసారి వేస్తే విత్తనం కింద ఎరువు పడి మొక్క మొలకెత్తగానే పోషకాలు అందుతాయి. నత్రజని ఎరువు వేసిన వెంటనే నీరు పెట్టకుండా, యూరియాను తడిగా ఉన్న నేలపై వాడుకోవడం ద్వారా ఎరువు సమర్ధవంతంగా మొక్కకు అందుతుంది. సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, వర్మికం పోస్టు, పచ్చిరొట్ట పైర్లను వేసుకోవడం ద్వారా కూడా రసాయన ఎరువులపై ఎక్కువగా ఆధారపడకుండా అధిక దిగుబడులను పొందవచ్చు.



రైతులు భాస్వరాన్ని విచ్చలవిడిగా పైర్లకు వాడుతున్నారు. దీని వల్ల మొక్కకు ఉపయోగం లేకపోగా, ఖర్చు పెరిగి లాభాలు తగ్గుతున్నాయి. రైతులు భాస్వరాన్ని వేరుకు వివిధ దశల్లో పై పాటుగా వేస్తున్నారు. ఈ పద్ధతి వల్ల భాస్వరం మొక్కకు అందదు. ఈ విధంగా వేసిన భాస్వరం భూమి పొరల్లో నిల్వ ఉండి పనికిరాని భాస్వరంగా మారుతుంది. పైరుకు తొలిదశలో భాస్వరం అవసరం అవుతుంది. కావున, భాస్వరం అందించే ఎరువును పూర్తిగా ఆఖరిదుక్కులో వేసుకోవాలి. కొన్ని సూక్ష్మజీవులు భూమి పొరల్లో నిల్వ ఉండి మొక్కల వేర్లకు అందుబాటులో లేని భాస్వరంను కరిగించి మొక్కల వేర్లకు అందుబాటులోకి తెస్తాయి. వీటినే ఫాస్ఫో బ్యాక్టీరియం అంటారు. నూనెగింజల పంటలకు భాస్వరంను సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసుకోవాలి. దీనివల్ల మొక్కకు కావల్సిన భాస్వరంతో పాటు అధిక నూనె దిగుబడికి అవసరమయ్యే సల్ఫర్ కూడా అందుతుంది.

భాస్వరం ఎరువును సరైన మోతాదులో వేసుకోవడం ద్వారా భూమిలో ఉండే జింక్, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను కూడా మొక్కకు అందించవచ్చు.

మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందేందుకు పొటాష్ ముఖ్యమైన పోషకం. నీటి ఎద్దడిని తట్టుకొనే శక్తి కూడా మొక్కకు పొటాష్ ద్వారా అందుతుంది. పొగాకు, బంగాళాదుంప వంటి పంటలకు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయరాదు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లో ఉండే క్లోరైడ్ వలన పంట నాణ్యత దెబ్బతింటుంది. ఇటువంటి పంటలలో సల్ఫేట్ ఆఫ్ పొటాష్ వాడుకోవాలి. పత్తి, పప్పుదినుసులు వంటి పంటలలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. పొటాష్‌లో ఎక్కువ భాగాన్ని ఆఖరి దుక్కిలో వేసుకొని, కొంత భాగాన్ని పైపాటుగా వేసుకోవాలి.

నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులే కాకుండా మొక్కల పెరుగుదలకు జింక్, బోరాన్, సల్ఫర్, కాల్షియం వంటి సూక్ష్మపోషకాలు అవసరమవుతాయి. మన దేశంలోని నేలల్లో జింక్ లోపం సమస్యగా మారింది. భాస్వరం ఎరువును విచ్చలవిడిగా వాడడం వల్ల నేలలోని జింక్ ఎరువు మొక్కకు అందడం లేదు. జింక్‌ను ఎకరాకు 20 కిలోలు దుక్కిలో వేసుకోవాలి. 2% జింక్ ద్రావణాన్ని పైరుపై పిచికారి చేయడం ద్వారా లోపాన్ని నివారించాలి. వేరుశెనగ పంటకు కాల్షియం ముఖ్యమైన సూక్ష్మపోషకం. వేర్లు ఏపుగా పెరగడానికి, కాయ నిండడానికి కాల్షియం తోడ్పడుతుంది. కాల్షియంను జిప్సం రూపంలో అందించడం ద్వారా కాల్షియమే కాకుండా అధిక నూనె దిగుబడికి అవసరమైన సల్ఫర్ అందుతుంది. జిప్సంను వేరుశెనగ తొలిపూత దశలో ఎకరాకు 200 కిలోల చొప్పున మొక్కల మొదళ్ళ వద్ద వేసుకోవాలి.

పైన తెల్పిన వివిధ పద్ధతులలో వివిధ పంటలలో పోషక యాజమాన్యాన్ని చేపట్టడం ద్వారా ఎరువులను పంటలకు సరిగ్గా అందించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చు. వ్యవసాయంలో ఎరువుల ఖర్చును, వాడకాన్ని తగ్గించుకోవచ్చు.

**- జి. సంతోష్ కుమార్**
**- ఎం.డి. గౌస్ మొహియుద్దీన్**

# పడి లేచిన కెరటం

## విషాదం నుండి విజయం సాధించి
## గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కిలక చిట్టిబాబు




**అది పార్వతీపురం ఏజన్సీ ప్రాంతం. అక్కడ నివసించే గిరిజనులలో ఎక్కువ శాతం సవర, జాతాపు వంటి గిరిజన తెగలకు చెందిన వారే. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ వారి ప్రధాన జీవనోపాధులు.**

**అటవీ ఉత్పత్తుల అమ్మకం, సంతలో కావలసిన నిత్యావసర సరుకులు కొనటం, చుట్టుప్రక్కల గూడెంలలో గల తమ బంధు మిత్రులను కలుసుకుని క్షేమ సమాచారాలు, పరామర్శలకు ప్రతి వారం తమ దగ్గరిలో గల వారాంతపు సంతకు వెళ్ళడం వారి జీవన విధానంలో ప్రధానమైన భాగం.**

ఆ రోజు శనివారం ఆగష్టు నెల 31వ తేదీ 1996 సంవత్సరం. ప్రతి వారం సంతకు వెళ్ళటం అలవాటు గల భిన్నిడి, దిగువచోరిపల్లి, ఎగువ చోరిపల్లి, గాజులగూడ, సికలార, లాబేస్, ఒడిజ వంటి గ్రామాలలో ఉన్న గిరిజనులంతా తమ వ్యవసాయం, అటవీ ఉత్పత్తులను ఆ రోజు 'కూడేరు'లో జరిగే సంతలో అమ్మటానికి బయలుదేరారు. 'కూడేరు' సంత ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు గ్రామాల మధ్యలో జరిగే పెద్ద సంత. ఈ సంతకు వెళ్ళాలంటే ఉధృతంగా ప్రవహించే 'నాగావళి' నదిని నాటు పడవలలో దాటి వెళ్ళాల్సిందే.

తమ గూడెంల నుండి కాలి నడకన తలలపై అటవీ ఉత్పత్తులు మోసుకుంటూ వచ్చిన గిరిజనులంతా నాగావళి నదిలోకి నాటు పడవను ఎక్కి కూడేరు సంతకు చేరుకోవాలని భావించి పడవ ప్రయాణం మొదలు పెట్టారు.

ఆ పడవలో భిన్నిడి గ్రామానికి చెందిన కిలక సుబ్బారావు, అతని చిన్న భార్య సుందరమ్మ కూడా ఉన్నారు. సుబ్బారావు అత్యంత నిరుపేద గిరిజనుడు. అతనికి ఇద్దరు భార్యలు, పెద్ద భార్య పిల్లలు పెరిగి పెద్దవారు అయ్యారు వారి బ్రతుకులు వారు బ్రతుకుతున్నారు. కాని చిన్న భార్య సుభద్రమ్మకు ఒక కొడుకు కిలక చిట్టిబాబు.

కిమిశీల ప్రభుత్వ పాఠశాలలో 4 వ తరగతి చదువుతున్నాడు.

# వంతెన నిర్మాణం కోసమే ఇంజినీరింగ్ చదివా....................

తల్లి, తండ్రి పడవ ప్రయాణంలో మరణించటం వలన అనాథ అయిన నన్ను ప్రభుత్వం తరపున ఆదుకొని వ్యక్తిగతంగా నాలో మానసిక స్థైర్యం, స్ఫూర్తి కాంక్షను రగిలించి, భవిష్యత్ ప్రణాళికను అందించిన ఆనాటి మా సంయుక్త కలెక్టర్, ప్రస్తుత అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి గారిని చాలా కాలం తర్వాత కల ్ససుకోవటం ఎంతో ఆనందంగా ఉంది.

ఒక గిరిజన యువకుడిగాను తోటి గిరిజన యువతకు నేనిచ్చే సందేశం ఏమంటే ... జీవితంలో అనేక విషాదాలు, ఆటంకాలు ఎదురవుతాయి. వాటిన్నింటినీ మానసిక స్థైర్యంతో ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించాలి.

అదే విధంగా ప్రభుత్వంలో పని చేస్తున్న అధికారులు శ్రీ చంద్రమౌళి గారిని స్ఫూర్తిగా తీసుకొని ఇబ్బందుల్లో ఉన్న యువతకు సరైన మార్గదర్శకం చేస్తే గిరిజన యువకులు ఇంకా ఎన్నో ఉన్నత స్థానాల్లో ఉండటం ఖాయం.

*- కిలక చిట్టిబాబు*

కిలక సుబ్బారావు, సుభద్రమ్మలు పడే కష్టం, చేసే ఆలోచనలు అన్నీ ఆ 12 సంవత్సరాల పిల్లవాడయిన కిలక చిట్టిబాబు గురించే.

అందరిలాగే పడవలో ఉన్న కిలక సుబ్బారావు, సుభద్రమ్మల ను విధి కాటేసింది. దురదృష్టవశాత్తు వారు ప్రయాణిస్తున్న పడవ నాగావళి నదిలో మునగటం వలన వీరితో పాటు 36 మంది గిరిజనుల ను మృత్యువు కబళించుకపోయింది.

అమ్మ, నాన్న ప్రమాదంలో దుర్మరణం పొందటం వలన కిలక చిట్టిబాబు 12 సంవత్సరాల వయస్సులోనే అనాధగా మారాడు. ఎటూ పాలుపోని స్థితి, వర్తమానం భవిష్యత్ - రెండు ప్రశ్నార్థకంగా మారాయి. బ్రతుకుతెరువే గగనం అయ్యింది.

ఆ సమయంలో జిల్లా యంత్రాంగం మృత్యు వాత పడ్డ గిరిజనులకు సహాయ, పునరావాస చర్యలు చేపట్టడం, మరణించిన కుటుంబాల వారసులకు పరిహారం చెల్లించటం జరిగింది. ఆ జిల్లాలో సంయుక్త కలెక్టరుగా పనిచేసిన శ్రీ కె. చంద్రమౌళి గారు 12 సంవత్సరాల కిలక చిట్టిబాబును ఓదార్చటమే కాకుండా, అతని భవిష్యత్ బాటను నిర్ధేశించి గిరిజన సంక్షేమ అధికారి, ఉపకార్యనిర్వాహక ఇంజినీరు నాయుడులను తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించారు.

తద్వారా కిలక చిట్టిబాబు భద్రగిరిలోని గురుకుల పాఠశాలలో చేర్పించటం అతనికి వచ్చిన ఎక్స్‌గ్రేషియాని బ్యాంకు ఖాతాలో జమ చేయటం చక చకా జరిగిపోయాయి. జిల్లా యంత్రాంగం యొక్క సకాల మద్దతుతో మహా విషాదం నుండి మానసికంగా కోలుకున్న కిలక చిట్టిబాబు సంయుక్త కలెక్టరు గారిని స్ఫూర్తిగా తీసుకొని, తన తల్లి దండ్రుల ప్రమాదానికి కారణమైన నాగావళి నదిపై వంతెనను నిర్మించాలనే లక్ష్యంగా చదువు కొనసాగింది.

పాఠశాల విద్య తరువాత పి. కోనవలస గురుకుల కళాశాలలో ఇంటర్‌మీడియేట్ విద్య పూర్తి చేసి, గీతమ్ ఇంజనీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడయ్యాడు.

ప్రవేటు రంగంలో మంచి వేతనం, హోదా గల ఉద్యోగం లభించినా, కేవలం ప్రజలకు సేవ చేయాలనే ఏకైక లక్ష్యంతో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో ఇంజనీరింగ్ సలహాదారుగా విధులు నిర్వహిస్తున్నారు.

గిరిజన ప్రాంతాలలో పుట్టి, జీవన గమ్యంలో పెను విషాదాన్ని ఎదుర్కొన్న చిట్టిబాబు కేవలం జిల్లా యంత్రాంగం అందించిన సహాయ, సహకారాల వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని వినయంగా ఇప్పటికి చెప్పుకుంటాడు.

ఒక సంఘటనలో అధికారులు సకాలంలో స్పందించి, చిట్టిబాబుకు మానసిక స్థైర్యం, భవిష్యత్ ప్రణాళికను నిర్ధేశించి సమయానుకూలంగా సహకారం అందించటం వల్లనే నేడు ఈ స్థాయికి చేరుకోవటం జరిగింది.

ఆదివాసి ప్రాంతంలో నివసించే గిరిజన యువతలో అపారమైన నైపుణ్యం, తెలివితేటలు నిగూఢంగా ఉన్నాయి. సమయానుకూలంగా ఒక బాధ్యత గల పౌరులుగా(అధికారులుగా) వారికి సక్రమమైన దిశా నిర్దేశం చేయగలిగితే ఆదివాసి ప్రాంతంలో గల మానవ వనరుల ను సద్వినియోగం చేసిన వారమవుతామని చిట్టిబాబు ఉదంతంలో అధికారులు చూపిన స్పందనే నిదర్శనం.

*- ఎ. సుభాష్ చంద్రగౌడ్,*
*సీనియర్ ఫ్యాకల్టీ, ఎ. ఎమ్.ఆర్. అపార్డ్,*

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : **K. Chandra Mouli**